www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 6-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 81 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి తె. 4.26 తదుపరి విదియ; నక్షత్రం: పునర్వసు తె. 4.48 తదుపరి పుష్యమి; వర్జ్యం: సా.4.27-6.05; దుర్ముహూర్తం: ఉ.5.49-7.33; అమృతఘడియలు: రా.2.19-3.58; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.49 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## స్కాన్ చెయ్.. కరెంట్ బిల్లు కట్టెయ్!

అగస్టు నుంచి క్యూఆర్ కోడ్ ఆధారిత కరెంట్ బిల్లుల జారీ

గూగుల్/ఫోన్‌పే, పేటీఎం ఆధారంగా స్కాన్‌చేసి కట్టేయొచ్చు

వినియోగదారులకు కొత్త సదుపాయం.. డిస్కమ్‌ల నిర్ణయం



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇకపై కరెంటు బిల్లులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కట్టొచ్చు. ఈ మేరకు వినియోగదారులకు కొత్త సదుపాయం కల్పిస్తూ తెలంగాణ డిస్కమ్‌లు నిర్ణయం తీసుకున్నాయి. థర్డ్‌పార్టీ యాప్‌ల ద్వారా చెల్లింపును నిలిపివేస్తూ ఆర్బీఐ నిర్ణయం తీసుకోవడంతో గూగుల్/ఫోన్‌పే/అమేజాన్ పే లేదా పేటీఎంల ద్వారా కరెంటు బిల్లులు

మిగతా 3వ పేజీలో...

# మరో ఆరుగురు?

## కాంగ్రెస్‌లో చేరనున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

వారం రోజుల్లోపే చేరిక ముహూర్తం

ఎమ్మెల్యేలతో కొలిక్కి వస్తున్న చర్చలు

ఇప్పటిదాకా ఒక్కొక్కరుగా చేరిన నేతలు

ఇకపై బృందాలుగా చేర్చుకొనే యోచన

బీఆర్ఎస్ శాసనసభాపక్షం విలీనమే లక్ష్యం

బడ్జెట్ సమావేశాలకు ముందే ఆపరేషన్

మండలిలోనూ మెజారిటీ సాధనపై దృష్టి

నేడు కాంగ్రెస్‌లోకి గద్వాల ఎమ్మెల్యే బండ్ల

వ్యతిరేకిస్తున్న సరితకు రేవంత్ హామీలు



హైదరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ లక్కీ నంబర్ '6' పైన సీఎం రేవంత్‌రెడ్డి గురి పెట్టారు. గురువారం అర్ధరాత్రి.. ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్న ఆయన.. మరో ఆరుగురు ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై దృష్టి పెట్టారు. వచ్చే సోమ లేదా మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్‌ల పరిధిలోని ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ గూటికి చేర్చేందుకు చర్చలు జరుగుతున్నాయి. చేరికలు దాదాపుగా ఖరారయ్యాయని, అమావాస్య, మంచి రోజులు కాకపోవడంతో చేరిక వచ్చే వారానికి వాయిదా పడిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వంలో సుస్థిరతే లక్ష్యంగా... అధిష్ఠానం అనుమతితో ఆపరేషన్ ఆకర్ష్‌ను ప్రారంభించిన రేవంత్‌రెడ్డి.. ఈ విషయంలో వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఒక్కొక్కరుగా పార్టీలో చేర్చుకుంటున్న ఆయన.. ఇక మీదట గుంపులుగా పార్టీలో చేర్చుకునే ప్రక్రియకు తెరలేపారు. ఇప్పటిదాకా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, కాలె యాదయ్యలు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వచ్చే వారం.. మరో ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికకూ రంగం సిద్ధమవుతోంది. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తిగా ఉన్న ఎమ్మెల్యేలతో సంప్రదింపుల ప్రక్రియ కొనసాగిస్తూనే... చేరికల ప్రక్రియనూ సీఎం రేవంత్‌రెడ్డి కొనసాగించనున్నట్లు చెబుతున్నారు. ఇప్పటి దాకా

మిగతా 2వ పేజీలో...

### ఏడుగురు ఎమ్మెల్యేల డుమ్మా

హైదరాబాద్ బీఆర్ఎస్ భేటీకి గైర్హాజరు

15 మంది కార్పొరేటర్లూ..

జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో వ్యూహంపై సమావేశం

ఒక రోజు ముందే ఎమ్మెల్యేలకు సమాచారం


ఫోన్లు చేసి పిలిచినా వచ్చింది ఏడుగురే

నేడు కౌన్సిల్‌కు వచ్చేది ఎంతమందో?

2



# చర్చకు రెడీ



## విభజన సమస్యలపై రేవంత్, చంద్రబాబు భేటీ నేడే

సాయంత్రం 6 గంటలకు ప్రజాభవన్‌లో ప్రారంభం

విభజన చట్టంలోని 9, 10 షెడ్యూళ్ల సంస్థలే ప్రధాన ఎజెండా

సీఐడీ హెడ్‌క్వార్టర్స్, లేక్‌వ్యూ అతిథి గృహంపైనా చర్చ

కొన్ని సమస్యలైనా కొలిక్కి వస్తాయనే అభిప్రాయాలు

విద్యుత్తు బకాయిలపై పేచీ వీడుతుందన్న ఆశాభావం

తెలంగాణ నుంచి పాల్గొననున్న భట్టి, పొంగులేటి, శ్రీధర్‌బాబు

ఏపీ నుంచి మంత్రులు సత్యప్రసాద్, జనార్దన్‌రెడ్డి, దుర్గేశ్

ముఖ్యమంత్రుల భేటీపై ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల ఆశలు

జిల్లాలో పరిష్కారానికి ఎదురుచూస్తున్న అనేక సమస్యలు

### తెలంగాణ చర్చకు పెట్టనున్న అంశాలివే!

తెలంగాణ ప్రభుత్వ వర్గాలు తాజాగా పాత అంశాలకు తోడు కొన్ని కొత్త అంశాలను తెరపైకి తెచ్చాయి. అవి..

- ఏపీలో కలిపిన 7 మండలాలు తిరిగివ్వాలి.
- ఏపీలోని 1000 కి.మీ. మేర తీరప్రాంతంలో తెలంగాణకూ భాగం కావాలి.
- తెలుగు ప్రజల ఆరాధ్య దైవం తిరుమల వేంకటేశ్వరస్వామికి చెందిన టీటీడీలో తెలంగాణకు కూడా భాగం.
- కృష్ణా జలాల్లో ఉన్న 811 టీఎంసీల నీటి లభ్యతలో తెలంగాణకు 558 టీఎంసీలు.
- తెలంగాణ విద్యుత్తు సంస్థలకు ఏపీ విద్యుత్తు సంస్థలు బకాయి ఉన్న రూ.24 వేల కోట్లను సత్వరమే చెల్లించాలి. ఏపీకి ఏమైనా చెల్లించాల్సి ఉంటే చెల్లిస్తాం.
- తెలంగాణకు ఓడరేవులు లేనందున ఏపీలోని కృష్ణపట్నం, మచిలీపట్నం, గంగవరం పోర్టుల్లో భాగం కావాలి.

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సరికొత్త సన్నివేశం ఆవిష్కృతం కాబోతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు శనివారం సమావేశం కానున్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ఇందుకు వేదిక కాబోతోంది. ఈ ఇద్దరు నేతలు సీఎంలుగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా జరుగుతున్న సమావేశం ఇది. ఈ భేటీలో రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యలపై ఇరువురు సీఎంలు చర్చించనున్నారు. విభజన సమస్యలపై సమావేశమవుదామంటూ

మిగతా 13వ పేజీలో...

### ఉద్యోగాల భర్తీపై టెన్షన్ వద్దు

నిరుద్యోగులకు న్యాయం జరిగేలా రూపొందిస్తాం

బడ్జెట్ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్: రేవంత్‌రెడ్డి

సీఎస్, ప్రజాప్రతినిధులు, విద్యార్థి నేతలతో సమావేశం

3

### చంద్రబాబుకు తెలంగాణ టీడీపీ ఘన స్వాగతం





### గ్యాస్ బైక్ వచ్చేసింది!

12

ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్‌ను విడుదల చేసిన బజాజ్ ఆటో

'ఫ్రీడమ్ 125' పేరుతో మార్కెట్లోకి

2 కిలోల గ్యాస్, 2 లీటర్ల పెట్రోల్‌తో 330 కి.మీ. ప్రయాణించొచ్చు

కి.మీ.కి దాదాపు రూపాయి ఖర్చు

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా

### సుదర్శన్‌రెడ్డి

13

ఉత్తర్వులు జారీ చేసిన ఈసీ

వికాస్‌రాజ్ రిలీవ్.. త్వరలో కీలక బాధ్యతలు ఇవ్వనున్న రాష్ట్ర ప్రభుత్వం



### హీరో రాజ్ తరుణ్ మోసగించాడు

11 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నాం

ఇప్పుడు ఓ హీరోయిన్‌తో తిరుగుతున్నాడు

2

నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో లావణ్య అనే మహిళ ఫిర్యాదు

**డబ్బు కోసమే డ్రామాలు**

మాదక ద్రవ్యాలకు అలవాటు పడింది

ఒకప్పుడు ఆమెతో రిలేషన్‌లో ఉన్నమాట నిజమేగానీ.. ఇప్పుడు లేను

ఆరోపణలపై హీరో రాజ్‌తరుణ్



ప్రధాని నివాసం నుంచి వెళ్తున్న సునాక్, అక్షత

దేశాన్ని పునర్‌నిర్మిస్తా: కియర్



యూకే ప్రధానిగా

## కియర్ స్టార్మర్

ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం.. మొత్తం 650 స్థానాల్లో 412 గెలుపు

కన్జర్వేటివ్‌లకు ఘోర ఓటమి.. 121 సీట్లకు పరిమితం.. సునాక్ రాజీనామా

ఓటమికి నాదే బాధ్యత.. క్షమించాలంటూ ప్రకటన

కింగ్ చార్లెస్‌ను కలిసిన స్టార్మర్.. ప్రధానిగా నియామకం

పద్నాలుగేళ్ల కన్జర్వేటివ్ పార్టీ పాలనకు తెర

దెబ్బకొట్టిన అసమ్మతి, అస్థిరత, ప్రభుత్వ వ్యతిరేకత

రిచ్‌మండ్-నార్త్ ఆల్టన్ నుంచి సునాక్ మళ్లీ గెలుపు

తెలుగువారు ఉదయ్ నాగరాజు, చంద్ర కన్నెగంటిల ఓటమి

రికార్డు స్థాయిలో 26 మంది భారత సంతతి వ్యక్తుల విజయం

12

## నీట్ రద్దు చేయొద్దు

నిజాయితీగా పరీక్ష రాసిన లక్షలాది మంది విద్యార్థులకు రద్దుతో తీవ్రనష్టం


భారీగా అవకతవకలు జరిగిన దాఖలాల్లేవు

ఇప్పటికే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాం

సుప్రీంకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం

సర్కారుబాటలోనే రద్దును వ్యతిరేకించిన ఎన్‌టీఏ

ఆగస్టు 11న నీట్-పీజీ



న్యూఢిల్లీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నీట్ యూజీ పరీక్షను రద్దు చేయొద్దని.. అలా చేస్తే నిజాయితీగా పరీక్ష రాసిన లక్షలాది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. నీట్ పరీక్ష నిర్వహణలో భారీ మొత్తంలో అవకతవకలు జరిగినట్లు ఆధారాలు లేవని.. ఆ పరీక్షను

మిగతా 12వ పేజీలో...

## త్వరలో కొత్త రేషన్ కార్డులు!

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనతో ఆశావహుల్లో ఆనందం
- ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడగానే 'మీ-సేవ' పోర్టల్ ఓపెన్
- సుమారు 10 లక్షల కొత్త దరఖాస్తులొస్తాయని అంచనా
- అదనపు సభ్యుల నమోదుకు 11 లక్షల దరఖాస్తులు పెండింగ్

13




# మరో ఆరుగురు?

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కొక్కరుగా జరుగుతున్న ఎమ్మెల్యేల చేరిక ప్రక్రియ.. ఇక గుంపులుగా జరగనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేసుకున్నప్పుడు.. కేసీఆర్ ఏ విధానాన్ని అనుసరించారో.. అదే విధానాన్ని ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సీఎల్పీలో విలీనం చేసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్నారు. శాసనసభలో సాంకేతికంగా బీఆర్ఎస్ పార్టీకి 38 మంది ఎమ్మెల్యేలు ఉన్న సంగతి తెలిసిందే. వారిలో మూడింట రెండొంతులు అంటే.. కనీసంగా 26 మంది ఎమ్మెల్యేలు చీలి.. ప్రత్యేకంగా శాసనసభా పక్షంగా ఏర్పడి సీఎల్పీలో విలీనం కావాల్సి ఉంటుంది. ఇప్పటిదాకా ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బడ్జెట్ సమావేశాల లోపు ఫిరాయింపు ఎమ్మెల్యేలను విలీనం చేసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు. ఈ లోపున 26 మందికి పైగా ఎమ్మెల్యేల చేరిక ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్న సీఎం ఇక మీదట ఒక్కొక్కరుగా కాకుండా గుంపులుగా చేర్చుకొనే ఆలోచనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగానే సోమ లేదా మంగళవారం మరో ఆరుగురు ఎమ్మెల్యేలను చేర్చుకొనేందుకు చర్చలు జరుగుతున్నట్లు చెబుతున్నాయి.

### ఎమ్మెల్సీల చేరికపైనా దృష్టి

కీలక బిల్లులు, తీర్మానాలు శాసనమండలిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆమోదం పొందడానికి ఆ సభలోనూ మెజారిటీ సాధించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు. శాసనమండలిలో 40 మంది సభ్యులకుగాను ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లు రెండు ఖాళీగా ఉన్నాయి. ఉన్న 38 మంది సభ్యుల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలు పాతిక మంది వరకూ ఉన్నారు. కాంగ్రెస్ సంఖ్యాబలం కేవలం నాలుగుగా ఉంది. అయితే పట్నం మహేందర్‌రెడ్డి ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరి ఉండడం, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రభుత్వం పట్ల సానుకూలంగానే ఉండడంతో సభలో కాంగ్రెస్‌కు ఆరుగురి మద్దతు లభించినట్లయింది. వీరిద్దరికి తోడుగా.. గురువారం అర్ధరాత్రి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో సభలో గులాబీల బలం 17కు పడిపోయింది. అయితే, ప్రస్తుతం మండలిలో ఉన్న నలుగురు నామినేటెడ్ సభ్యులూ బీఆర్ఎస్ మద్దతుదారులే కావడంతో ఇప్పటికీ మెజారిటీ సభ్యులు బీఆర్ఎస్ పక్షానే ఉన్నట్లయింది. ఇక ఆరుగురు ఎమ్మెల్సీల చేరికతో కాంగ్రెస్ పార్టీ బలం 12కు చేరుకుంది. ఎమ్మెల్యే కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ సీట్లూ జత చేరితే పార్టీ బలం 14కు చేరుకోనుంది. సభలో మెజారిటీ సీట్లు కాంగ్రెస్ పక్షాన ఉంటేనే కీలక బిల్లులు, తీర్మానాలకు ఇబ్బంది ఉండబోదని భావిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎమ్మెల్సీల సంఖ్యను 20ని దాటించే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో మరో 7-8 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు సంప్రదింపులు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. శాసనమండలిలో మెజారిటీ సాధన ప్రక్రియ కూడా బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే లోపు ముగించేందుకు కసరత్తు జరుగుతున్నట్లు చెబుతున్నారు.



## నేడు కాంగ్రెస్‌లోకి గద్వాల ఎమ్మెల్యే బండ్ల

**వ్యతిరేకిస్తున్న సరితకు రేవంత్ హామీలు**

గద్వాల, జూలై 5 : జోగుళాంబ గద్వాల జిల్లాలోని బీఆర్ఎస్ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరికకు ముహూర్తం ఖరారైంది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంత్రి జూపల్లితో పాటు పలువురు మంత్రులను కలిసి చర్చించి చేరికను ఖరారు చేశారు. అయితే ఎమ్మెల్యే బండ్ల చేరికను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వ్యతిరేకిస్తున్నారు. వారి అనుచరవర్గం శుక్రవారం గాంధీ భవన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించింది. గురువారం కూడా గద్వాలలో ఆందోళనలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఎంపీ మల్లు రవితో కలిసి సరిత, ఆమె భర్త తిరుపతయ్య, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడారు. ఆయన నేనున్నానని వారికి ధైర్యం చెప్పినట్లు సమాచారం. అన్ని విషయాలు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌తో మాట్లాడాలని సూచించడంతో వారు తిరిగి మహేష్ కుమార్ గౌడ్‌తో చర్చలు జరిపారు.

## స్పీకర్ సమయమిచ్చారు.. అందుబాటులోకి రాలేదు: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 'ముందుగానే శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అపాయింట్‌మెంట్ తీసుకొని అసెంబ్లీకి వచ్చాం. మాకు సమయం ఇచ్చినా కూడా ఆయన అందుబాటులోకి రాలేదు' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, పాడికౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడుతూ తాము ప్రాతినిథ్యం వహించే నియోజకవర్గాల్లో జరిగే అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని, ఈ విషయాన్ని చెప్పేందుకే స్పీకర్‌ను కలిసేందుకు వచ్చినట్లు చెప్పారు. అధికారులపై ప్రివిలైజ్ మోషన్ ఇవ్వడానికి స్పీకర్‌ను కలవాలనుకుంటే.. ఎన్నిసార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదన్నారు.

### నేను.. మా అమ్మ బీఆర్ఎస్‌లోనే: కార్తీక్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి వెళతామంటూ తమపై వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, 'నేను, మా అమ్మ సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉంటాం. పార్టీ మారే ప్రసక్తే లేదు' అని పటోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఆరోజు ప్రత్యేక పరిస్థితుల్లో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వచ్చామని, రాజకీయ అవసరాలకోసం, సదవుల కోసం మరోసారి పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



నగర బీఆర్ఎస్ సమావేశానికి

## ఏడుగురు ఎమ్మెల్యేల డుమ్మా

**15 మంది కార్పొరేటర్లూ గైర్హాజరు..**

**జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో వ్యూహంపై సమావేశం నిర్వహించిన తలసాని**

**ఫోన్లు చేసి పిలిచినా వచ్చింది ఏడుగురే**

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కీలక సమావేశానికి నగరానికి చెందిన ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. మరో 15 మంది కార్పొరేటర్లూ గైర్హాజరయ్యారు. కండువాల మార్పిడి సీజన్ నడుస్తోన్న సమయంలో ఒకరోజు ముందు సమాచారమిచ్చినా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సమావేశానికి దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది. హైదరాబాద్‌లోనే ఉండి కూడా కొందరు ఎమ్మెల్యేలు రాలేదు. శనివారం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం జరగనున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై శుక్రవారం తెలంగాణ భవన్‌లో సమావేశం నిర్వహించారు. గురువారం మధ్యాహ్నమే తలసాని శ్రీనివాస్ యాదవ్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు సమావేశానికి రావాలని సమాచారం అందించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కూడా హాజరవ్వాలని మొదట అనుకున్నా ఢిల్లీ జైలులో ఉన్న కవిత బెయిల్ పిటిషన్‌పై న్యాయవాదులతో చర్చించేందుకు గురువారం సాయంత్రమే ఢిల్లీ వెళ్లారు. దీంతో శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో సమావేశం జరిగింది. మీటింగ్ ప్రారంభమయ్యే సమయానికి కొద్ది మందే రావడంతో పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు ఫోన్లు చేసి మరీ రప్పించారు. కాలేరు వెంకటేష్, సుధీర్‌రెడ్డి ఆలస్యంగా సమావేశానికి వచ్చారు. మరో ఏడుగురు అసలే రాలేదు. ప్రజా సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీని నిలదీయాలని, ఎమ్మెల్యేలూ కౌన్సిల్‌కు హాజరు కావాలని శుక్రవారం నాటి సమావేశంలో నిర్ణయించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డిలపై అవిశ్వాసం పెట్టాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. అయితే, జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం కౌన్సిల్ కొలువుదీరిన నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టే అవకాశం లేకపోవడంతో విరమించుకున్నారు.

### కారు దిగుతారా?

రాష్ట్ర రాజధాని పరిధిలో బీఆర్ఎస్‌కు 14 మంది ఎమ్మెల్యేలున్నారు. వీరిలో ఏడుగురు శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి రాలేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 నియోజక వర్గాలకుగాను 16 బీఆర్ఎస్ గెలుచుకుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ లోక్‌సభ ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లో చేరారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అకస్మిక మరణంతో ఉప ఎన్నిక జరుగగా కాంగ్రెస్ గెలుచుకుంది. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 14కు తగ్గింది. వీరిలోనూ కొందరు కాంగ్రెస్‌లోకి చేరేందుకు సిద్ధమయ్యారన్న ప్రచారం జరుగుతోంది. శివారు ప్రాంతంలోని ఒక ఎమ్మెల్యేకు చేరేందుకు కాంగ్రెస్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం. ముహూర్తం చూసుకొని చేరతారని అంటున్నారు. నగరం మధ్యలోని మరో ఎమ్మెల్యే కూడా పార్టీ మారేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్థానిక కాంగ్రెస్ నేతల అభ్యంతరంతో తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. ఇప్పటికే అధికార పార్టీతో పలువురు ఎమ్మెల్యేలు టచ్‌లోకి వెళ్లిపోయారని, అక్కడ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెబుతున్నారు. ఈ ఎమ్మెల్యేలు కొన్నాళ్లుగా నియోజకవర్గాల్లో తిరగడం లేదు. పార్టీ సమావేశాలకు కూడా దూరంగా ఉంటున్నట్టు సమాచారం. శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేక్ తిరుమలలో ఉండగా.. అరెకపూడి గాంధీ సొంత పనిపై నిజామాబాద్‌కు వెళ్లానని పార్టీ నేతలకు సమాచారమిచ్చారు. కౌన్సిల్‌లో బీఆర్ఎస్ బలం 56గా ఉండేది. ప్రస్తుతం 47కు తగ్గింది. కాంగ్రెస్ కార్పొరేటర్ల సంఖ్య బీఆర్ఎస్, బీజేపీల నుంచి చేరికలతో మూడు నుంచి 19కి పెరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లలో ఎంతమంది శనివారం నాటి సమావేశానికి హాజరవుతారనేది ఆసక్తికరంగా మారింది.

**వచ్చిన ఎమ్మెల్యేలు**

తలసాని శ్రీనివాస్‌యాదవ్ (సనత్‌నగర్), పద్మారావు (సికింద్రాబాద్), ప్రకాష్‌గౌడ్ (రాజేంద్రనగర్), సుధీర్‌రెడ్డి(ఎల్‌బీనగర్), మాగంటి గోపినాథ్(జూబ్లీహిల్స్), ముఠా గోపాల్ (ముషీరాబాద్), కాలేరు వెంకటేష్(అంబర్‌పేట)

**రాని ఎమ్మెల్యేలు**

అరెకపూడి గాంధీ(శేరిలింగంపల్లి), మాధవరం కృష్ణారావు(కూకట్‌పల్లి), బండారి లక్ష్మారెడ్డి(ఉప్పల్), మర్రి రాజశేఖర్‌రెడ్డి(మల్కాజ్‌గిరి), కేపీ వివేకానందగౌడ్(కుత్బుల్లాపూర్), సబితా ఇంద్రారెడ్డి(మహేశ్వరం), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు)

మాజీ సీఎం కేసీఆర్‌కు

## మంత్రి సీతక్క లీగల్ నోటీస్

**» బీఆర్ఎస్ పోస్టుపై అభ్యంతరం తెలిపిన మంత్రి**

హైదరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధికారిక ట్విటర్(ఎక్స్) ఖాతాలో పెట్టిన ఓ పోస్టుపై మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనుసూయ సీతక్క శుక్రవారం లీగల్ నోటీసులు పంపారు. ఇందిరమ్మ రాజ్యం- ఇసుక గాళ్ల రాజ్యం అంటూ బీఆర్ఎస్ పెట్టిన ఆ పోస్టుపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ అధికారిక ఖాతా కావడంతో బాధ్యుడిగా పార్టీ అధ్యక్షుడైన కేసీఆర్‌కు నోటీసులు పంపుతున్నట్లు ఆమె వెల్లడించారు. అలాగే తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా కూడా సోషల్ మీడియా వేదికగా విషప్రచారం చేశారని సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ఆరోపణలు చేసినందుకుగాను తక్షణమే కేసీఆర్, ఆ పార్టీ తనకు లిఖితపూర్వకంగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. జూన్ 24న బీఆర్ఎస్ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు కారణంగానే కేసీఆర్‌తోపాటు ఆ పార్టీకి నోటీసులు పంపామని మంత్రి సీతక్క తరఫు న్యాయవాది వెల్లడించారు.

## మరో 4 మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు

హైదరాబాద్, జులై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో నాలుగు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు శుక్రవారం కొత్త పాలకవర్గాలను ప్రభుత్వం నియమించింది. వనపర్తి టౌన్, వికారాబాద్ జిల్లాలోని తాండూరు, బషీరాబాద్, జగిత్యాల జిల్లా ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తూ వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో 197 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయని, శుక్రవారం నియమించిన కమిటీల సంఖ్య మొత్తం 15కు చేరిందని వెల్లడించారు. మిగిలిన మార్కెట్ కమిటీలకు కూడా పాలకవర్గాలను త్వరలోనే నియమిస్తామని తెలిపారు. మార్కెట్ యార్డుల్లో రైతులకు మౌలిక వసతులు సమకూర్చాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పాలకవర్గాలు పనిచేయాలని సూచించారు. మరో కార్యక్రమంలో టీజీపీఎస్సీ ద్వారా ఉద్యాన శాఖలో ఉద్యోగాలు పొందిన 18 మందికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియామక పత్రాలు అందజేశారు. సచివాలయంలో పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చి వారిని అభినందించారు.

## శాసనమండలి ఉనికికే ప్రమాదం..

**» అసెంబ్లీ సీట్లు పెరిగితేనే గట్టెక్కుతాం: వినోద్‌కుమార్**

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ సర్కారు గతంలో చేసిన రాజ్యాంగ సవరణతో తెలంగాణ శాసనమండలి ఉనికి ప్రమాదంలో పడిందని, అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరిగితేనే గట్టెక్కుతామని మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం మండలి రాజ్యాంగ నిబంధనల ప్రకారం లేదని, ఎవరైనా కేసు వేస్తే రద్దవుతుందని చెప్పారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 ప్రకారం మండలిలో కనీసం 40 సీట్లుండాలి. అంతకంటే తక్కువ ఉండకూడదు. శాసనసభ సీట్లలో మూడోవంతు కౌన్సిల్ సభ్యులు ఉంటారు. అయితే ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేను తొలగించడంతో తెలంగాణ అసెంబ్లీలో ఉన్న 120 మంది సభ్యుల సంఖ్య 119కి తగ్గింది. రెండు రాష్ట్రాల్లో శాసనసభ సీట్లు పెంచాలని విభజన చట్టంలో ఉంది. చట్టానికి చిన్న సవరణ చేస్తే సీట్ల సంఖ్య పెంచుకోవచ్చు. అసెంబ్లీ స్థానాలు పెంచాలని మేం కోరినా మోదీ సర్కారు పట్టించుకోలేదు' అని చెప్పారు.

## భ్రమల్లో బతుకుతున్న కేసీఆర్:కాంగ్రెస్

భ్రమల్లో బతుకుతున్న కేసీఆర్.. ఫాంహౌస్‌లో కూర్చుని బీఆర్ఎస్ కార్యకర్తలకు పేదరాసి పెద్దమ్మ కథలు చెబుతున్నారంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ఆయనను మానసిక వైద్యునికి చూపించాల్సిన అవసరముందన్నారు. దేశంలోని రైతులు కేసీఆర్ కోసం ఎదురు చూసే పరిస్థితే ఉంటే.. ఆయన దేశవ్యాప్తంగా ఎందుకు అభ్యర్థులను నిలపలేదని ప్రశ్నించారు. కేసీఆర్‌ను ఓడించిందే తెలంగాణ రైతులన్న విషయాన్ని ఆయన మరిచిపోతున్నారన్నారు. ఆయనపై విశ్వాసం లేకనే ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరారని చెప్పారు. 'ఆనాడు ప్రగతిభవన్‌లో కేసీఆర్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడినప్పుడు కేటీఆర్ గడ్డి పీకారా?' అంటూ మండిపడ్డారు. నిరుద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డికి పాలు, పూలాభిషేకాలు చేసే రోజు రానుందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు.


# బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ మెసర్స్ అశోకా లీగ్ ప్రాజెక్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న దీని మేనేజింగ్ పార్టనర్ **శ్రీ ముత్యాలపాటి విశ్వనాథ్ తండ్రి శ్రీ ముత్యాలపాటి శేషగిరి,** 19 మంది ఇతర వ్యక్తులతో కలిసి వివిధ సేల్ డీడ్స్ ద్వారా 2022, 2023 వ సంవత్సరంలో గండిపేట (మం), కిస్మత్‌పూర్ గ్రామం, సర్వే నంబర్లు 15, 16, 17, 20, 22 మరియు 23లలోని ఎ.4.18 గుంటల విస్తీర్ణం కలిగిన భూమిని కొనుగోలు చేశారు మరియు ఎ.14.14 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి మొత్తంలో ఎ.6.08 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి కొరకు వివిధ రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్ కుదుర్చుకున్నారు మరియు నా క్లయింట్లకు ఎ.14.14 గుంటల మొత్తంలో ఎ.10.25 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి కొరకు సదరు భూమి యజమానుల నుండి స్వాధీనం కూడా బట్వాడా చేయబడినది. షెడ్యూలు ఆస్తిలో కొన్ని అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నవి. ఇటీవల సదరు భూమికి పొరుగు భూమి యజమాని అయిన **శ్రీ ఎల్. సంజీవ రెడ్డి తండ్రి ఎల్.యాది రెడ్డి** అతని భూమి ఎ.3.28 గుంటల విస్తీర్ణంలో వివిధ షెడ్లు నిర్మించారు మరియు ప్రహరీ గోడ కట్టారు మరియు దానిలో గుర్రపు స్వారీ వ్యాపారాన్ని చేస్తున్నారు. వారు నా క్లయింట్‌ను సంప్రదించి అతని భూమి ఎ.3.28 గుంటల భూమిని చాలా అన్యాయమైన ధరకు తీసుకోమని అడిగాడు మరియు లేనిచో నా క్లయింట్‌ను అక్కడ అడుగు కూడా పెట్టనివ్వనని బెదిరించారు మరియు వారి అభివృద్ధి పనులు కొనసాగించబోమని హెచ్చరించారు. **ఎల్. సంజీవ రెడ్డి** చేసిన ప్రతిపాదన తిరస్కరించినందుకు అతను నా క్లయింట్ మెసర్స్ అశోకా లీగ్ ప్రాజెక్ట్స్ వారి అనవసరమైన ఇబ్బందులు కల్గిస్తున్నారు మరియు దాని పరిహారాలతో గౌరవనీయ న్యాయస్థానాల సమక్షంలో ఓఎస్ నం. 886/2023, ఓఎస్ నం. 78/2024, ఓఎస్ నం. 664/2023, మరియు ఓఎస్ నం. 364/2024లతో ఒకటి తర్వాత మరొకటి వివిధ పార్టిషన్ దావాలు దాఖలు చేస్తున్నారు. మేము కూడా న్యాయస్థానాలను ఆశ్రయించాము మరియు వాస్తవిక డాక్యుమెంట్లను పరిశీలించుటకు సంబంధిత డాక్యుమెంట్లు దాఖలు చేశాము. ఇరువైపులా వాదనలు విన్న తర్వాత గౌరవనీయ న్యాయస్థానం స్టేటస్ కో ఆర్డర్‌ను సవరించినది మరియు ఎఫ్ లైన్ పిటిషన్‌తో కొనసాగుటకు అనుమతినిచ్చింది. ఆ ప్రకారంగా **ఎల్ సంజీవ రెడ్డి**తోపాటు అన్ని పార్టీలకు నోటీసు జారీ చేసిన తర్వాత ఎడి సర్వే చేపట్టబడినది, పార్టీల ద్వారా దాఖలు చేయబడిన దరఖాస్తుపై హద్దులతో మొత్తం భూమి విస్తీర్ణం ఎ.14.14 గుంటలు విభజించబడినది. సదరు భూమి విస్తీర్ణం ఎ.3.28 గుంటలు ఇప్పటికే ఎల్ సంజీవ రెడ్డి స్వాధీనంలో ఉన్నదనే విషయం స్పష్టంగా చూపించబడినది మరియు కొలతలు వేయబడినది మరియు భూమి విస్తీర్ణం ఎ.2.29 గుంటలు గుర్తులు పెట్టబడినది మరియు ఓఎస్ నం. 886 ఆఫ్ 2023లో అడ్వకేట్ కమిషనర్ ద్వారా కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఉంచబడినది మరియు అందులో గౌరవనీయ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది మరియు ఎ.1.00 గుంటలు ఎ.2.29 గుంటల మొత్తంలో అడ్వకేట్ కమిషనర్ ద్వారా గుర్తించబడినది మరియు అది అపరిష్కృతంగా ఉన్నది. మిగిలిన ఎ.8.25 గుంటల విస్తీర్ణమునకు సంబంధించి అక్కడ ఎటువంటి వివాదాలు లేవు మరియు పూర్తిగా స్పష్టంగా మా స్వాధీనంలో ఉన్నది, ఇందుకు సంబంధించి గౌరవనీయ న్యాయస్థానం నిషేధపుటుత్తరువు కూడా జారీ చేసినది మరియు అది మా స్వాధీనం క్రింద ఉన్నది మరియు సదరు **ఎల్ సంజీవ రెడ్డి** అక్కడ ప్రతీ విషయంలో జోక్యం చేసుకుంటున్నారు మరియు కొంతమంది అసాంఘిక శక్తులతో కలిసి అక్కడ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గౌరవనీయ న్యాయస్థానం ఉత్తర్వులను అతిక్రమిస్తూ విధేయత లేకుండా సదరు **ఎల్ సంజీవ రెడ్డి అలియాస్ నరసింహారెడ్డి** నా క్లయింట్ **మెసర్స్ అశోకా లీగ్ ప్రాజెక్ట్స్** వారి నుండి సులభంగా డబ్బు తీసుకొనుటకు ప్రయత్నిస్తూ మరియు నా క్లయింట్ పేరును చెడగొట్టుటకు ఎటువంటి వాస్తవాలు లేకుండా వార్తాపత్రికలలో తప్పుడు ప్రచురణలను ఇస్తూ మోసపూరితంగా వ్యవహరిస్తున్నారు. ఆ ప్రకారంగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా సదరు **ఎల్ సంజీవ రెడ్డి** భూమి నా క్లయింట్ ద్వారా కొనుగోలు చేయబడలేదు మరియు అతను అన్యాయమైన ధరకు అతని భూమి విక్రయించుట అతనికి కావాలి కనుక అతను తప్పుడు ప్రకటనలు/ప్రచురణలు వార్తాపత్రికలలో ఇస్తున్నారు. దానికి మేము సదరు **ఎల్ సంజీవ రెడ్డి మరియు ఎల్ సంగారెడ్డి అలియాస్ నరసింహారెడ్డి**లపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటున్నాము.

**తేది: 05.07.2024** **సం/- ఎం.శ్రీనివాస్ రెడ్డి,** అడ్వకేట్, మొబైల్ నం: **8185811456**
ప్రదేశం: రంగారెడ్డి జిల్లా ఇ-మెయిల్: **prataplawfirmtg@gmail.com**
అడ్రస్: ప్లాట్ నం.405, 4వ అంతస్తు, సైబర్ శాంతి అపార్ట్‌మెంట్స్, ఆనంద్‌నగర్, బండ్లగూడజాగీర్, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ- 500086


# హీరో రాజ్‌తరుణ్ మోసం చేశాడు

**నార్సింగి పీఎస్‌లో లావణ్య అనే మహిళ ఫిర్యాదు.. 11 ఏళ్లుగా తాము సహజీవనం చేస్తున్నట్టు వెల్లడి**



**» డబ్బు కోసమే డ్రామాలు: రాజ్‌తరుణ్**

నార్సింగ్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): హీరో రాజ్ తరుణ్ ప్రేమ పేరుతో తనను మోసం చేశాడంటూ లావణ్య అనే మహిళ నార్సింగి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. 2012 నుంచి తమ ఇద్దరి మధ్య అనుబంధం ఉందని.. 2014 మే 11 నుంచి ఒకే ఇంట్లో ఉంటూ సహజీవనం చేస్తున్నామని ఆమె పేర్కొంది. పదకొండేళ్లుగా అదే ఇంట్లో ఉంటున్నామని.. ఇద్దరం శారీరకంగా, మానసికంగా దగ్గరై ఆనందంగా ఉండేవారమని వివరించింది. "అయితే.. రాజ్‌తరుణ్ ఈ మధ్య హీరోయిన్ మాల్వి మల్హోత్రాతో కలిసి తిరుగుతున్నాడని నాకు తెలిసింది. 'తిరగబడర సామి' సినిమా షూటింగ్ నుంచి వారిద్దరి మధ్య ఎఫైర్ మొదలైంది. రాజ్‌తరుణ్ ఆమెను కలిసేందుకు తరచుగా ముంబై వెళ్లేవాడు. ఆమె హైదరాబాద్‌కు వస్తుండేది. వారిద్దరూ ఇక్కడ ఒక డైరెక్టర్ ఇంట్లో కలిసేవారు. ఈ విషయం నాకు తెలిసి నిలదీసినప్పటి నుంచీ అంతా మారిపోయింది. రాజ్ నన్ను తిట్టడం మొదలుపెట్టాడు. ఆమె కూడా నన్ను టార్గెట్ చేసింది. రాజ్‌ను వదిలేయాలంటూ మాల్వి కుటుంబసభ్యులంతా నన్ను బెదిరించారు. ఇదంతా 2023 అక్టోబరులో జరిగింది. ఇదంతా జరుగుతుండగానే.. నాకు సంబంధం లేని ఒక కేసులో నన్ను ఇరికించారు. ఆ కేసులో 43 రోజులు జైల్లో ఉన్నా. బయటకు వచ్చేసరికి అంతా మారిపోయింది. రాజ్ మేమున్న ఇంటిని వదిలేసి వెళ్లిపోయాడు. మేమిద్దరం త్వరలో పెళ్లి కూడా చేసుకోవాలనుకున్నాం. కానీ.. ఇంతలోనే ఇలా జరిగింది." అని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

### వేరే వ్యక్తితో..

తనపై ఫిర్యాదు చేసిన లావణ్యతో ఒకప్పుడు తాను రిలేషన్‌లో ఉన్న మాట నిజమేగానీ.. ప్రస్తుతం ఆమె మస్తాన్ సాయి అనే వ్యక్తితో రిలేషన్‌లో ఉందని హీరో రాజ్‌తరుణ్ చెప్పారు. లావణ్య తనపై చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. 2017 తర్వాత తమ మధ్య ఎలాంటి శారీరక సంబంధం లేదని తేల్చిచెప్పారు. "నా ఇంట్లో నేను కింది అంతస్తులో ఉంటే ఆమె మస్తాన్‌సాయి అనే వ్యక్తితో రెండో అంతస్తులో ఉండేది. ఆమె డ్రగ్స్‌కు అలవాటు పడింది. ఆమెపై గతంలో డ్రగ్స్ కేసు కూడా నమోదైంది. తనను పెళ్లి చేసుకోవట్లేదంటూ మస్తాన్‌సాయిపై ఆమె గతంలో గుంటూరులో కేసు కూడా పెట్టింది. అప్పట్లో ఆమెకు నేను కూడా సహకరించాను. 11 సంవత్సరాలు ఆమెతో కలిసి ఉన్నానని. గుళ్లో మా ఇద్దరికీ పెళ్లయిందని చెప్పడం అబద్ధం. నేను హైదరాబాద్‌కు వచ్చిన కొత్తల్లో నాకు సహాయం చేసింది. అందుకు కృతజ్ఞత ఉండడం వల్లనే ఆమెను నా ఇంటిలో ఉండనిచ్చాను. నన్ను ఎంత ఇబ్బంది పెట్టినా నా పరువు ఎక్కడ పోతుందోనని భరిస్తూ వచ్చా. కానీ, డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత ఆమె ఫ్రెండ్ సర్కిల్ పెద్దదైంది. ఇదంతా చూసి తట్టుకోలేక నేను ఇంట్లోంచి బయటకు వెళ్లాలని అనుకున్నా. మాల్వీతో నేను సహజీవనం చేస్తున్నానని లావణ్య ఆరోపించడంలో అర్థం లేదు. ఎందుకంటే నేను ఉండేది హైదరాబాద్‌లో. ఆమె ఉండేది ముంబైలో. లావణ్య నన్ను ఎప్పుడు అడిగితే అప్పుడు డబ్బులు ఇస్తూ వచ్చా. ఆ తర్వాత నాకు అర్థమైంది.. ఇది మరీ ఎక్కువైపోతోందని. దీంతో డబ్బులు ఇవ్వడం మానేశా. ఆవిడకు బేసిగ్గా నా దగ్గర నుంచి డబ్బులు కావాలి. అయితే.. నేను ఇటీవలే లావణ్య గురించి డీసీపీతో మాట్లాడాను. అప్పట్నుంచి.. నేను తనను ఎక్కడ ఇల్లు ఖాళీ చేయిస్తానో అనే భయంతో ఆమె ఇలా రచ్చ చేస్తోంది. ఆమెకు నేనే కావాలనుకుంటే.. మస్తాన్‌సాయి తనను పెళ్లిచేసుకోవాలంటూ గుంటూరు పీఎస్‌లో ఎందుకు ఫిర్యాదు చేస్తుంది? ఇదంతా నా మంచికే. జనాలకు అంతా తెలిసింది. నేను కూడా ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా. ఆమెకు ఇప్పటి వరకూ నేను ఎంత డబ్బు ఇచ్చానో చెప్పే ఆధారాలు నా దగ్గర ఉన్నాయి. నాకు ఆమెతో పెళ్లి కాలేదు. పెళ్లి చేసుకుంటానంటూ నేనెప్పుడూ ఆమెను మోసం చేయలేదు" అని రాజ్‌తరుణ్ వివరణ ఇచ్చారు.

# నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**బీఆర్ఎస్వీ, బీజేవైఎం ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ కార్యాలయం ముందు ఆందోళన**

**» ఆందోళనకారులను ఎక్కడికక్కడే అడ్డుకున్న పోలీసులు**

**» శాంతియుత నిరసనలకూ అరెస్టులా?: కేటీఆర్**

గోషామహల్/మౌలాలి/హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్వీ, బీజేవైఎం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆందోళనలను నిర్వహించారు. శుక్రవారం నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయం వద్దకు నిరుద్యోగులు తరలివచ్చారు. కార్యాలయం ముందు రోడ్డుపై బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అంతకుముందు టీజీపీఎస్సీ కార్యాలయం వద్దకు రాకుండా నిరుద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. గోషామహల్ పోలీసు స్టేషన్ ఆవరణలో విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య గౌరవాధ్యక్షుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునేంత వరకు నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా గ్రూపు-2లో 2 వేలు, గ్రూపు-3లో 3 వేల పోస్టులను అదనంగా కలపాలని, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:100 చొప్పున అభ్యర్థులకు అవకాశం కల్పించాలని, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా, బీజేవైఎం ఆధ్వర్యంలో నిరుద్యోగుల ఆందోళనకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన కలెక్టరేట్ల ముట్టడిని పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రంగుల శంకర్ అన్నారు.

### రేవంత్‌కు నిరుద్యోగులంటే గౌరవం లేదు: బీఆర్ఎస్

టీజీపీఎస్సీ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపే ప్రయత్నం చేసిన నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం ఏమిటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. నిరుద్యోగుల పట్ల పోలీసులు, ప్రభుత్వం చేస్తున్న దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలన పేరును పదేపదే చెబుతున్న కాంగ్రెస్ సర్కార్ యువకులు, విద్యార్థులకు నిరసన తెలిపేఅవకాశం కూడా ఇవ్వకుండా నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నిరుద్యోగులు, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టులు చేసి నిర్బంధించడం హేయమైనచర్య అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఒకవైపు ప్రజాపాలన అంటూనే రేవంత్ సర్కారు నిరుద్యోగుల గొంతులను, వారి హక్కులను అణగదొక్కేలా కుట్రలకు పాల్పడుతోందని ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు. మరోవైపు.. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని, వాటికి రావాల్సిన నిధులను విడుదల చేయాలని సీఎం రేవంత్‌ని మాజీ మంత్రి హరీశ్ కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు.

## కుల వివక్ష వల్లే ఎస్సై శ్రీను ఆత్మహత్యాయత్నం

- పోలీసులకు ఆయన భార్య కృష్ణవేణి ఫిర్యాదు
- అశ్వారావుపేట సీఐ, నలుగురు కానిస్టేబుళ్లపై అట్రాసిటీ కేసు

అశ్వారావుపేట, జూలై 5: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆత్మహత్యాయత్నం వ్యవహారం కీలకమలుపు తిరిగింది. అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్ల శివ, సుబానీ, సన్యాసి నాయుడు, శేఖర్‌ల వేధింపుల వల్లే శ్రీను ఆత్మహత్యాయత్నం చేశారని ఆయన భార్య కృష్ణవేణి హైదరాబాదులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుల వివక్ష, ప్రాంతీయ విబేధాలతో తన భర్తను వేధించారని ఫిర్యాదులో ఆరోపించారు. కృష్ణవేణి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును మహబూబాబాద్ స్టేషన్‌కు పంపించారు. తన భర్త ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు ఆయన ఫోన్‌లో ఉన్నాయని, ఆ డాటాను భద్రపరిచి తమకు అందించాలని కృష్ణవేణి కోరారు. ఎస్ఐ శ్రీను ప్రస్తుతం హైదరాబాదులోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన పరిస్థితి ప్రస్తుతం విషమంగానే ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే సీఐని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేయగా, నలుగురు కానిస్టేబుళ్లను పోలీస్ శాఖ వీఆర్‌కు పంపింది.



## జనగామ జిల్లాలో పాక్షికంగా తెలంగాణ తల్లి విగ్రహ ధ్వంసం

- బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం.. రాస్తారోకో

దేవరుప్పుల, జూలై 5: జనగామ జిల్లాలో తెలంగాణ తల్లి విగ్రహ ధ్వంసం ఘటన అగ్గి రాజేసింది. దేవరుప్పుల మండలం కామారెడ్డి గూడెంలో కొత్తగా ఏర్పాటు చేసిన విగ్రహానికి అనుమతులు లేవంటూ గురువారం రాత్రి అధికారులు కూల్చే ప్రయత్నం చేశారు. అయితే గ్రామస్థులు గొడవ చేయడంతో విరమించుకున్నారు. కానీ అప్పటికే విగ్రహం పాక్షికంగా ధ్వంసమైంది. దీనిపై ఆగ్రహించిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం జనగామ-సూర్యాపేట రహదారిపై మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాలతో విగ్రహాన్ని అధికారులు కూల్చే ప్రయత్నం చేశారని ఆరోపిస్తూ రాస్తారోకో చేశారు. విగ్రహం కూల్చివేతను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

## బస్సులోనే గర్భిణికి పురుడు పోసిన మహిళా కండక్టర్

- అదే బస్సులో ఆస్పత్రికి తరలింపు
- హైదరాబాద్‌లో ఘటన

కండక్టర్, డ్రైవర్‌కు మంత్రి పొన్నం అభినందన



పుట్టిన బిడ్డతో శ్వేతరత్నం

బర్కత్‌పుర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్ ఆర్టీసీకి చెందిన ఓ బస్సులో శుక్రవారం ఓ గర్భిణి ప్రసవించింది. ఆ బస్సులో విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్ ఆమెకు పురుడుపోయగా ఆడపిల్ల జన్మించింది. అనంతరం బస్సు డ్రైవర్ ఆ తల్లీబిడ్డలను అదే బస్సులో తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్ మానవత్వం చాటుకున్న ఘటన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనే జరిగింది. ముషీరాబాద్ డిపోకు చెందిన 1జెడ్ రూట్ సిటీ బస్సు శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఆరాంఘర్ నుంచి సికింద్రాబాద్ బయలుదేరింది. ఆరాంఘర్‌కు చెందిన శ్వేతరత్నం అనే గర్భిణి ఈ బస్సు ఎక్కారు. బస్సు బహదూర్‌పూర చేరుకునే సరికి శ్వేతరత్నంకు పురిటి నొప్పులు అధికమవ్వడంతో డ్రైవర్ ఎం.అలీ వాహనాన్ని రోడ్డు పక్కన ఆపారు. మహిళా కండక్టర్ బి. సరోజ ప్రయాణికులందరినీ కిందకు దింపి కొందరు మహిళలతో కలిసి శ్వేతరత్నంకు పురుడుపోయగా అమ్మాయి పుట్టింది. అనంతరం తల్లీబిడ్డలను అదే బస్సులో తీసుకెళ్లి జజ్జీఖానా ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న హైదరాబాద్ సిటీ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ ఇతర అధికారులు డ్రైవర్ అలీ, కండక్టర్ సరోజను సత్కరించారు. అలాగే, డ్రైవర్ అలీ, కండక్టర్ సరోజకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలియజేశారు. ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చడంతోపాటు సేవాస్ఫూర్తి చాటుతున్న ఆర్టీసీ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని మంత్రి పేర్కొన్నారు.

# ఉద్యోగాల భర్తీపై టెన్షన్ వద్దు

## భర్తీ విషయంలో కృత నిశ్చయంతో ఉన్నాం.. బడ్జెట్ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్

- నిరుద్యోగులకు న్యాయం జరిగేలా రూపకల్పన: రేవంత్
- సీఎస్, ప్రజాప్రతినిధులు, విద్యార్థి సంఘం నాయకులతో సీఎం భేటీ



హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో కృతనిశ్చయంతో ఉన్నదని, నిరుద్యోగులకు మేలు జరిగే నిర్ణయాలే తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు, స్వార్థపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలి కావొద్దని నిరుద్యోగులకు సూచించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఇష్టారీతిన నిబంధనలు మార్చితే తలెత్తే చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని హామీనిచ్చారు. గత ప్రభుత్వం వ్యవహరించిన విధంగా ఉద్యోగాల భర్తీ విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే నిరుద్యోగులకు న్యాయం జరగక పోగా ప్రస్తుతమున్న నోటిఫికేషన్లు కూడా రద్దయ్యే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రూప్-1 సహా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశంపై శుక్రవారం నిరుద్యోగులు నిర్వహించిన ఆందోళన నేపథ్యంలో సీఎం రేవంత్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సహా సంబంధిత అధికారులతో పాటు, పలువురు ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో నిరుద్యోగులు లేవనెత్తిన డిమాండ్లను పరిష్కరించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం ఇప్పటికే 28,942 ఉద్యోగ నియామకాలను చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రూప్-1, 2, 3 నియామకాలకు ఉన్న కోర్టు చిక్కులన్నింటినీ అధిగమించిందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం పోటీ పరీక్షలు నిర్వహించి, ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే చర్చించి, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయనున్నట్టు స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వ నియామ పరీక్షలు, వివిధ బోర్డులు నిర్వహించే పరీక్షలతో ఆటంకాలు ఏర్పడకుండా, నిరుద్యోగులకు పూర్తిన్యాయం జరిగేలా క్యాలెండర్‌ను రూపొందిస్తున్నామన్నారు. నిరుద్యోగుల విషయంలో ప్రభుత్వం కీలకంగా కసరత్తు చేస్తుంటే కొందరు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కొందరు చేసే కుట్రలతో నోటిఫికేషన్లలోని నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే ఉద్యోగాలు భర్తీ చేసే ప్రక్రియ నిలిచిపోయి, నిరుద్యోగులు మరింత నష్టపోతారని స్పష్టంచేశారు.

### నిరుద్యోగుల డిమాండ్లపై చర్చ

సమావేశంలో నిరుద్యోగులు లేవనెత్తిన అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎంకు వివరించారు. ఈ మేరకు గ్రూప్-1 పరీక్ష మెయిన్స్‌కు ఒక్కో పోస్టుకు 1:50నిష్పత్తి చొప్పున కాకుండా 1:100 చొప్పున ఎంపిక చేయాలనే డిమాండ్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం 2022లో ప్రకటించిన గ్రూప్-1 పరీక్ష పేపర్ల లీకేజీ, తప్పుడు నిర్ణయాల కారణంగా రెండు సార్లు వాయిదా పడిందని, కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులో ఉన్న పలు పిటిషన్లను వెనక్కి తీసుకున్నదని అధికారులు సీఎంకు వివరించారు. పాత నోటిఫికేషన్లను రద్దు చేసి అదనంగా మరిన్ని పోస్టులతో కొత్త నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసిందని తెలిపారు. దాదాపు 12ఏండ్ల తరువాత చేపట్టిన గ్రూప్-1 పరీక్షకు 4లక్షల మంది అభ్యర్థులు పోటీ పడ్డారని, ఇటీవలే ప్రిలిమినరీ పరీక్షను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పకడ్బందీగా నిర్వహించిందని చెప్పారు. నోటిఫికేషన్ ప్రకారం ప్రిలిమ్స్‌లో మెరిట్ ఆధారంగా ఒక్కో పోస్టుకు 50మంది చొప్పున మెయిన్స్‌కు ఎంపిక జరుగుతుందని వివరించారు. ఇప్పుడు ఒక పోస్టుకు 100మందిని ఎంపిక చేసేలా నిబంధనలను సవరిస్తే కోర్టులు జోక్యం చేసుకునే ప్రమాదం ఉందని, నోటిఫికేషన్‌లో ఉన్న నిబంధనలను మార్చితే న్యాయపరంగా చెల్లుబాటుకాదని, నిబంధనలను మార్చితే మళ్లీ ఈ నోటిఫికేషన్ కూడా నిలిచిపోతుందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా గ్రూప్-1 పరీక్ష రెండోసారి రద్దయినప్పుడు హైకోర్టు చేసిన వ్యాఖ్యలను అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి నోటిఫికేషన్‌లో ఉన్న బయోమెట్రిక్ పద్ధతిని ఎందుకు పాటించలేదన్న ఏకైక కారణంతో రాష్ట్ర హైకోర్టు పరీక్షను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కాగా 1999లో యూపీఎస్సీ వర్సెస్ గౌరవ్ ద్వివేది కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గురించి కూడా చర్చించారు. ఆ తీర్పు ప్రకారం నోటిఫికేషన్‌లో పేర్కొన్నదానికంటే ఎక్కువమందికి అవకాశం ఇస్తే ముందుగా ఉన్నవాళ్లకు అన్యాయం జరిగినట్టేనని సుప్రీంకోర్టు స్పష్టంచేసిందని తెలిపారు.

### గ్రూప్-2, 3 పోస్టుల పెంపుపైనా చర్చ

సమావేశంలో గ్రూప్-2, 3 పోస్టుల పెంపుపైనా చర్చించారు. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో పోస్టులు పెంచడం కూడా నోటిఫికేషన్‌ను ఉల్లంఘించినట్టే అవుతుందని తెలిపారు. దాంతో కోర్టులు కూడా జోక్యం చేసుకునే పరిస్థితి ఉంటుందన్న విషయాన్ని కూడా అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గ్రూప్-1కు కొత్తగా నోటిఫికేషన్ ప్రకటించడంతో పోస్టుల సంఖ్య పెంచడం సాధ్యమైందని, గ్రూప్-2, 3 నోటిఫికేషన్లకు అలాంటి వెసులుబాటు లేదని స్పష్టంచేశారు. కాగా సమావేశంలో పాల్గొన్న విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రూప్-2, డీఎస్సీ పరీక్షలు ఒకదానివెంట ఒకటి ఉండడంతో అభ్యర్థులు నష్టపోతున్నారని సీఎంతో అన్నారు. జూలై 17 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు ఉన్నాయని, ఆ వెంటనే ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 ఉన్నదని, దాంతో అభ్యర్థుల ప్రిపరేషన్‌కు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. స్పందించిన సీఎం రేవంత్, పరీక్షల తేదీల విషయంలో టీజీపీఎస్సీ, విద్యాశాఖతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

## స్కాన్ చెయ్.. కరెంట్ బిల్లు కట్టెయ్!

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించేందుకు బాగా అలవాటు పడ్డవారు కొంత ఇబ్బందుల్లో పడ్డారు. ఈ తరహా వినియోగదారుల కోసమే అన్నట్టుగా డిస్కమ్‌లు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకున్నాయి. ఆగస్టు నుంచి వినియోగదారులకు క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్) కోడ్‌తో కూడిన బిల్లును జారీ చేయాలని నిర్ణయించాయి. ఈ కోడ్‌ను గూగుల్‌పే/ ఫోన్‌పే/అమేజాన్‌పే, పేటీఎం ద్వారా స్కాన్ చేసి బిల్లులు కట్టొచ్చు. అంటే.. ఏదైనా షాపింగ్ మాల్, హోటల్‌లో బిల్లు చెల్లించేటప్పుడు నిర్వాహకులు బిల్లుతో కూడిన క్యూఆర్ కోడ్‌ను చూపితే, దాన్ని స్కాన్ చేసి బిల్లు చెల్లించినట్టుగానే అన్నమాట! ఆగస్టులో జారీ చేసే బిల్లులన్నీ కూడా క్యూఆర్ కోడ్ ఆధారంగా జారీ చేయనుండటంతో వినియోగదారులకు ఇబ్బందులు తీరనున్నాయి. ప్రస్తుతం రెండునెలలుగా ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్-వరంగల్)లో పలు ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ ఆధారిత బిల్లులు జారీ చేస్తున్నామని, ఆగస్టు నుంచి పూర్తిస్థాయిలో డిస్కమ్‌లో జారీ చేస్తామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. అయితే అధికార యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని వాటి ద్వారానూ బిల్లులు చెల్లించే విధంగా సర్కారు అవకాశమిచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకొని, కరెంట్ బిల్లులు చెల్లించే అవకాశం ఉంది. అంతేకాకుండా https://tgsouthpower.org లేదా https://tgnpdcl.comలలోకి వెళ్లి.. paybillను క్లిక్ చేసి, యూనిక్ సర్వీస్‌నెంబర్(usc)ను ఎంటర్‌చేసి, బిల్లులు కట్టే అవకాశం ఉంది. గురువారం ఉదయం 10 గంటల దాకా 1.20 లక్షల మంది వినియోగదారులు యాప్‌లు లేదా వెబ్‌సైట్‌లో చెల్లింపులు చేసినట్లు దక్షిణ డిస్కమ్ ప్రకటించింది.

## ‘రైతు భరోసా’పై జిల్లాల వారీగా సదస్సులు

- రైతులు, రైతు సంఘాల నేతల అభిప్రాయ సేకరణ
- రోజుకో ఉమ్మడి జిల్లాలో.. 3 రోజుల్లోనే శ్రీకారం
- మంత్రి వర్గ ఉప సంఘం సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించాలని మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చైర్మన్‌గా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభ్యులుగా ఉన్న మంత్రి వర్గ ఉప సంఘం శుక్రవారం సమావేశమైంది. ఒక్కో రోజు.. ఒక్కో ఉమ్మడి జిల్లాలో సదస్సు ఏర్పాటు చేయాలని, మూడు రోజుల్లోనే దీనికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. డిప్యూటీ సీఎం సహా నలుగురు మంత్రులు ఈ కమిటీలో ఉండగా.. ఒక్కొక్కరు ఒక్కో ఉమ్మడి జిల్లాలో నిర్వహించే సదస్సులో పాల్గొనేలా ప్రణాళిక రచించారు. ఈ సందర్భంగా రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, ఇతరుల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతు సదస్సులు నిర్వహిస్తూ.. అభిప్రాయాలు సేకరించారు. సహకారశాఖ ఆధ్వర్యంలో జూన్ 29న ఈ సదస్సులు ప్రారంభంకాగా.. ఈ నెల 4వ తేదీకి షెడ్యూల్ పూర్తయింది. మిగిలిన పీఏసీఎస్‌ల్లో రెండు రోజుల్లోగా పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత జిల్లా స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు ప్రతి మంగళవారం రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా అభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. వీటిలోనూ మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు పాల్గొనాలని నిర్ణయించారు. వీడియో కాన్ఫరెన్సుల్లో మంత్రులతో నేరుగా మాట్లాడలేని రైతులు.. లిఖిత పూర్వకంగా తమ అభిప్రాయాలను అధికారులకు ఇచ్చే అవకాశం కల్పించారు. అలాగే, తాజా మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌ల అభిప్రాయాలు సేకరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. చివరిగా ఈ అభిప్రాయాలన్నింటినీ క్రోడీకరించి, అసెంబ్లీలో ప్రతిపక్షం ముందు పెట్టనున్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల అభిప్రాయాలు తీసుకొని, కేబినేట్‌లో చర్చించిన తర్వాత రైతుభరోసా విధివిధానాలు ఖరారు చేయనున్నారు.

## చనిపోయిన టీచర్‌కు పదోన్నతి

- రిటైర్డ్ అయిన మరో టీచర్‌కి కూడా..
- పదోన్నతుల ఉత్తర్వుల జారీలో విద్యాశాఖ సిత్రాలు

రంగారెడ్డి అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో సిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఏడాది క్రితం చనిపోయిన ఓ ఉపాధ్యాయునికి, కొద్ది నెలల క్రితం పదవీ విరమణ మరో ఉపాధ్యాయునికి పదోన్నతి కల్పిస్తూ రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇది ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపగా తప్పును సరి చేసుకున్న అధికారులు పాతవాటిని రద్దు చేసి కొత్త ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లాలో చేపట్టిన హిందీ పదోన్నతుల్లో (సీరియల్ నెంబర్ 129, రోస్టర్ పాయింట్ 163) భాగంగా మంచాల మండలం తిప్పాయిగూడ పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ బషీర్‌కు గ్రేడ్-2 హిందీ పండిట్‌గా పదోన్నతి కల్పిస్తూ కొందుర్గు మండలంలోని యూపీఎస్ చిన్న ఎల్కిచర్ల పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చారు. అయితే, ఎండీ బషీర్ గతేడాది జూన్ 1న మరణించడం గమనార్హం. అలాగే, ఈ ఏడాది మార్చి 24న పదవీ విరమణ పొందిన వెలిజర్ల పాఠశాల ఉపాధ్యాయుడు కే రవీంద్రనాథ్‌కు కూడా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేయడంతో మేల్కొన్న అధికారులు వాటిని సరిచేసి నిబంధనల ప్రకారం జాబితాలో తర్వాత ఉన్నవారికి పదోన్నతి కల్పిస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డి జిల్లాకు రిక్వెస్ట్‌తో వచ్చిన టీచర్లకు సర్వీసు రూల్స్ పాటించకుండా పదోన్నతులు కల్పించారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.


GHMC
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం
డివిజన్ నం.19, SLPZ, GHMC, యూసుఫ్‌గూడ, హైదరాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన NIT నం.10/EE/DIV.No.19/SLPZ/GHMC/2024-25 తేది: 05.07.2024
పనుల సంఖ్య: 13 నం.ల సివిల్ పనులు, అంచనామొత్తం రూ.లక్షల్లో : రూ.282.80 ప్రారంభ తేది/డౌన్‌లోడ్ ముగింపు తేది మరియు సమయం: 06.07.2024న మ.2.00 గం.లకు, 12.07.2024న మ.2.00 గం.వరకు మాత్రమే. అధికారి పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, GHMC,శ్రీ యు.రాజ్ కుమార్, 99635-50654. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.telangana.gov.in ను చూడగలరు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, DIV-19, (SLPZ), GHMC
DIPR RO NO. 1538-PP/CL/ADVT/1/2024-25, తేది:05.07.2024

శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిక్కడపల్లి, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఆర్‌సి నం.32/SVSD/2024 తేది: 05.07.2024 శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిక్కడపల్లి, హైదరాబాద్‌లో టెండరు షెడ్యూల్లో వివరించిన విధంగా 01.09.2024 నుండి 31.08.2025 వరకు గల కాలానికి అనగా ఒక (1) సంవత్సరం కాలానికి సరుకుల సరఫరా కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుతున్నవి. వివరాల కొరకు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in ను దర్శించగలరు. తదుపరి వివరాల కొరకు మీరు దేవస్థానం అధికారులను ఫోన్ నం. 9849601680 పై సంప్రదించవచ్చును.
సం/- కార్యనిర్వహణాధికారి, శ్రీ వెంకటేశ్వర దేవస్థానము, చిక్కడపల్లి, హైదరాబాద్
DIPR RO.No.1530-PP/CL/ADVT/1/2024-25 తేది: 05.07.2024

తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
Lr No. E1/72/2024 ఇ-ప్రొక్యూర్ మెంట్ టెండరు ప్రకటన తేది:05.07.2024
రూ.119.00 లక్షల మొత్తముతో సి.సి రోడ్లు వేయుటకు, రూ. 48.00 లక్షల మొత్తముతో స్ట్రోమ్ వాటర్‌డ్రైన్ నిర్మాణము చేయుటకు రూ.45.50 లక్షల మొత్తముతో సి.సి. రోడ్లు మరియు డ్రైన్ పనులు చేయుటకు, రూ. 10.00 లక్షల మొత్తముతో సి.సి. కెమెరాలు ఇన్‌స్టాల్ చేయుటకు, రూ.10.00 లక్షల మొత్తముతో గ్రేవ్ యార్డ్ అభివృద్ధి పనులు చేపట్టుటకు (2వ పిలుపు), రూ.20.00 లక్షల మొత్తముతో కమ్యూనిటీ హాల్ మిగులు చేపట్టుటకు (2వ పిలుపు) నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. టెండరు షెడ్యూలు దిగువ విధంగా ఉన్నది. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేది: 06.07.2024 ఉ. 10.00గం.ల నుండి 12.07.2024 సా. 4.00 గం.ల వరకు కమిషనర్, తుక్కుగూడ మునిసిపాలిటీ వారిచే స్వీకరించబడును మరియు టెండర్లను తెరచుట తేది: 12.07.2024 సా. 04.01 గం.లకు కమిషనర్ తుక్కుగూడ మున్సిపాలిటీ లేదా వారి డిప్యూటీచే తెరవబడును. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in దర్శించండి. లేదా తుక్కుగూడ మునిసిపల్ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించు నెం. 8639160741.
DIPR RO.No 1521-PP/CL/ADVT/1/2024-25 తేది.05.07.2024 సం/- కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ

भाकृअनुप - भारतीय श्री अन्न अनुसंधान संस्थान
ICAR- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్
राजेन्द्रनगर, हैदराबाद/రాజేంద్రనగర్, హైదరాబాద్-500030.
ఫోన్ : 24599300 ఫ్యాక్స్ నం.24599304, www.millets.res.in
IIMR
F.No: 4(946)Admn/2024 తేది: 05.07.2024
వర్చువల్ ఇంటర్వ్యూ
దిగువ ఉద్యోగ నియామకానికి ICAR - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రిసెర్చ్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030 వద్ద వర్చువల్ ఇంటర్వ్యూకు అర్హతగల మరియు ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావల్సిందిగా కోరబడుచున్నారు.

| క్ర.సం. | ఉద్యోగాలు | వర్చువల్ ఇంటర్వ్యూ తేది మరియు సమయం |
|---|---|---|
| 1. | అకౌంటెంట్ (1 ఉద్యోగము) | తేది : 23.07.2024 సమయం : ఉ.10:30 గం.లకు |
| 2. | యంగ్ ప్రొఫెషనల్ - I (2 ఉద్యోగాలు) | |
| 3. | యంగ్ ప్రొఫెషనల్ - II (2 ఉద్యోగాలు) | |
| 4. | రీసెర్చ్ మేనేజర్ - (1 ఉద్యోగము) | |

తదుపరి వివరాలకు మా వెబ్‌సైట్ www.millets.res.in ను దర్శించండి.
సం/- డైరెక్టర్

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును
PUB/0645
దక్షిణ మధ్య రైల్వే, నిర్మాణ సంస్థలో పదవీ విరమణ పొందిన రైల్వే గెజిటెడ్ అధికారుల నియామకం కొరకు సూచనాత్మక ప్రకటన
వేకెన్సీ నోటీస్ నం.02/2024
No. P.Con. SCR/Gaz/Re- engagement/SCR/C/2024 తేది: 03.07.2024
అత్యవసర సేవలలో కాంట్రాక్చువల్ ప్రాతిపదికన చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/నిర్మాణం/దక్షిణ మధ్య రైల్వే/సికింద్రాబాద్ క్రింద పదవీ విరమణ పొందిన రైల్వే గెజిటెడ్ అధికారుల నియామకం
పోస్ట్-కన్సల్టెంట్-సివిల్ ఇంజనీరింగ్ (సి) & ఎలక్ట్రికల్ (సి)
ఖాళీల సంఖ్య :02 (పొజిషన్లు), ఒక్కొక్క శాఖకు ఒకటి
తగువిధంగా పూర్తి చేసిన దరఖాస్తులను చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (నిర్మాణం), గ్రౌండ్ ఫ్లోర్, రైల్ నిర్మాణ్ నిలయం అనుబంధం, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్-500 071 (తెలంగాణ రాష్ట్రం) వారి కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ పర్సనల్ ఆఫీసర్/నిర్మాణం వారికి ఎన్వలప్‌లో పంపవలెను.
ఎన్వలప్‌పై పెద్ద అక్షరాలలో "APPLICATION FOR THE POSITION OF CONSULTANT-Civil Engineering(C) or Electrical (C)అని వ్రాయవలెను.
అర్హత, వయస్సు, వేతనం, నియామక కాలం, దరఖాస్తు నమూనా & ఇతర సవివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in ను చూడగలరు.
దరఖాస్తులు 08.08.2024లోగా చేరవలెను.
A0821 చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/నిర్మాణం, సికింద్రాబాద్





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# సునాక్ నిష్క్రమణ

బ్రిటన్‌లో 'మార్పు' తీవ్రంగా దూసుకువచ్చింది. పద్నాలుగేళ్లుగా అధికారంలో ఉంటూ, ప్రజల వ్యతిరేకతను అపారంగా పోగేసుకున్న కన్సర్వేటివ్ (టోరీ) పార్టీ గురువారం జరిగిన సాధారణ ఎన్నికలలో ఘోరంగా ఓడిపోయింది. రెండు తరాల కింద మాత్రమే తరలివెళ్లిన, భారతీయ మూలాలున్న రిషి సునాక్ ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. ఘనవిజయం సాధించిన లేబర్ పార్టీ నాయకుడు కీర్ స్టార్మర్ నూతన ప్రధానిగా నియమితులయ్యారు. ప్రభుత్వ పతనం ఊహించిందే అయినా, ఈ ప్రభంజనం మాత్రం ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. భారతదేశానికి, ప్రపంచానికి ఈ పరిణామం అనేక ప్రభావాలను కలిగించబోతోంది.

భారత్ ఎన్నికలలో 'చార్ సౌ పార్' లాగానే, బ్రిటన్ ఎన్నికలలో లేబర్ పార్టీ 'సూపర్ మెజారిటీ' నినాదం ఇచ్చింది. నిజానికి, అక్కడ ఎంత పెద్ద నిర్ణయాలకైనా సాధారణ మెజారిటీ చాలు. కన్సర్వేటివ్ పార్టీ కూడా లేబర్ సూపర్ మెజారిటీకి వ్యతిరేకంగా ప్రచారం చేసింది. ఇండియాలో నినాదం సఫలం కాలేదు కానీ, బ్రిటన్‌లో స్టార్మర్ మూడింట రెండు వంతుల సంఖ్యకు దగ్గరగా ఘనవిజయం సాధించారు. 650 మంది సభ్యులుండే బ్రిటన్ దిగువ సభలో లేబర్ పార్టీ 412 స్థానాలు సంపాదించింది. ఇది గత సభ కంటె 214 అధికం. కన్సర్వేటివ్ పార్టీ కేవలం 121 స్థానాల్లోనే గెలుపొందింది. గత ఎన్నికలలో సాధించిన విజయాల కంటె ఇది 251 తక్కువ.

అంకెలలో కనిపిస్తున్న విజయాలను బట్టి, బ్రిటన్ పరిణామాన్ని అర్థం చేసుకోలేము. ఇది లేబర్ పార్టీ విజయం కాదని, టోరీల పరాజయమనీ ముందు తెలుసుకోవాలి. కన్సర్వేటివ్ పార్టీ గత ఎన్నికలలో సాధించిన ఓట్ల కంటె 20 శాతం నష్టపోయి, ప్రస్తుతం కేవలం 24 శాతం ఓట్లతో మిగిలింది. కానీ, లేబర్ పార్టీ అన్ని సీట్లు అదనంగా గెలుచుకున్నప్పటికీ, గత ఎన్నికల కంటె కేవలం అదనంగా పొందింది 2 శాతం కంటె తక్కువ ఓట్లే! యూరోపియన్ యూనియన్ నుంచి ఎటువంటి ఒప్పందమూ లేకుండా వైదొలగాలని వాదించి వెలుగులోకి వచ్చిన తీవ్ర మితవాద పార్టీ 'రిఫామ్ యుకె' ఈ ఎన్నికల్లో కేవలం నాలుగు సీట్లు మాత్రమే సాధించింది. అయినప్పటికీ అది చిన్న విజయమేమీ కాదు, పెద్ద ప్రమాదం దాగి ఉన్న విజయం కూడా. గత ఎన్నికల్లో కేవలం 1.7 శాతం ఓట్లు సంపాదించుకున్న ఈ పార్టీ ఈ సారి 14 శాతం ఓట్లు పొందింది. కన్సర్వేటివ్ పార్టీలోని అతిమితవాదులు ఈ పార్టీ వైపు ఆకర్షితులయినట్టు తెలుస్తోంది. ఫాసిస్టు పోకడలున్న 'రిఫామ్ యుకె' నేత నైజిల్ ఫరాజ్ మొదటిసారి పార్లమెంటులోకి అడుగుపెట్టబోతున్నాడు. కన్సర్వేటివ్ పార్టీలో ఉదారవాదం వైపు మొగ్గుచూపే వారు ఈసారి లిబరల్ డెమొక్రటిక్ పార్టీ వైపు మొగ్గినట్టు కనిపిస్తోంది. గత ఎన్నికల్లో కేవలం 8 సీట్లున్న ఈ పార్టీ ఇప్పుడు 71 స్థానాల్లో గెలిచింది. పాలస్తీనాకు అనుకూలంగా నిలబడిన ఐదుగురు స్వతంత్ర సభ్యులు కూడా ఈ ఎన్నికల్లో గెలిచారు. కన్సర్వేటివ్ ఓట్లు చెల్లా చెదురయినట్టు, లేబర్ పార్టీకి కొత్తగా ఓట్లు పెద్దగా రానట్టు కనిపిస్తున్న ఈ ఎన్నికల్లో ఫలితాలు ఇట్లా ఎందుకు వచ్చాయన్న సందేహం కలుగుతుంది. లేబర్ పార్టీ తాను గెలవడానికి అవసరమైన ఓటింగ్ మీదనే ఆయా నియోజకవర్గాలలో గురిపెట్టిందని, అందువల్ల, తన ప్రయత్నాన్ని ఎక్కువ స్థానాల్లో సమానంగా విస్తరించ గలిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఎక్కువ ఓటింగ్ శాతం ఉండి, తక్కువ స్థానాలు పొందిన పార్టీల ఓట్లు కొన్ని నియోజకవర్గాలలో కేంద్రీకృతమైనట్టు అర్థం చేసుకోవాలి. నాలుగు స్థానాల్లో మాత్రమే గెలిచిన రిఫామ్ యుకె పార్టీ ప్రభావం అనేక నియోజకవర్గాల్లో విస్తరించింది. బ్రిటన్‌లోని మైనారిటీలు, పూర్వ వలసల నుంచి వచ్చి స్థిరపడినవారు, కొత్తగా వలసవచ్చినవారు, ఆర్థికంగా అణగారినవారు ఈ తీవ్రమితవాద పార్టీ ప్రభావం పెరగడం మీద ఆందోళనగా ఉన్నారు.

ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, అశాంతితో పద్నాలుగేళ్లుగా కునారిల్లుతున్న బ్రిటన్ పౌరులు, తమ నిర్ణయాన్ని స్పష్టంగా, కఠినంగా చెప్పారు. "మీ ఆగ్రహం నాకు తెలుస్తోంది" అని సునాక్ తన వీడ్కోలు ప్రసంగంలో అన్నమాట, ప్రజానిర్ణయం వెనుక కారణాలను అంగీకరించడమే. ఎంతో గంభీరంగా, ఉదాత్తంగా సునాక్ చేసిన ప్రసంగం, అక్కడి వ్యాఖ్యాతలు అవహేళన చేస్తున్నా, భారతీయ ప్రజాస్వామిక విలువల నుంచి చూస్తే, విశేషమే అనిపిస్తుంది. నిజానికి, ఓటమికి కారణం సునాక్ 20 నెలల పాలన కాదు. విశ్వసనీయత కోల్పోతున్న ప్రభుత్వాన్ని నిలబెట్టాలని ఆయన ఏదో ప్రయత్నం చేశారు. కానీ, అది ఒకరి సదుద్దేశాలతో బాగుపడే సంక్షోభం కాదు. అంతకు ముందు కంటె, కన్సర్వేటివ్‌లు అధికారం చేపట్టిన 2010 కంటె పరిస్థితి మెరుగ్గానే ఉందని సునాక్ చెప్పుకున్నారు కానీ, అటువంటి సమర్థనలు అనవసరం.

మధ్యేవాద, ఉదారవాద లక్షణాలున్న లేబర్ పార్టీకి భారతదేశ విధానాలతో కొన్ని సమస్యలున్నాయి. ఇటీవలిదాకా, ఆ పార్టీ కశ్మీర్ స్వయంనిర్ణయాధికార హక్కుని సమర్థించేది. ఈ మధ్యే స్టార్మర్ కశ్మీర్ సమస్య భారత్ పాక్‌ల మధ్య తేలవలసినదని, అంతర్గత సమస్యలను భారత్ ప్రజాస్వామ్యం పరిష్కరించుకోగలదని వ్యాఖ్యానించి, వైఖరిలో మార్పును సూచించారు. ఉక్రెయిన్ యుద్ధం వంటి అంశాలు అంతర్జాతీయంగాను, భారత్‌తో సంబంధాల విషయంలోను అవరోధంగా ఉండేవే. ఈ ఎన్నికల్లో గర్భితమై ఉన్న ప్రజాభిప్రాయాన్ని అర్థం చేసుకుని, బ్రిటన్‌ను సమస్యల నుంచి లేబర్ ప్రభుత్వం గట్టెక్కించగలదని ఆశించాలి.

# మనిషి లోపలి బయటి లోకాలకు అద్దం పట్టిన కవులు

నీళ్ల కోసం తపించిన తెలంగాణ గోసను 'తలాపునా పారుతుంది గోదారీ/ నీ చేను నీ చెలుకా ఎడారి' వంటి అనేక ఆర్ద్ర గీతాలలో పలికిన ప్రజాకవి, 'గోదావరి కవి'గా తెలంగాణ ప్రజలు ప్రేమతో పిలుచుకునే మల్లావఝుల సదాశివుడు స్మృతిలో ఆ కవి కుటుంబం గత కొన్ని సంవత్సరాలుగా ఆత్మీయ పురస్కారం అందిస్తున్నది. ఆ పరంపరలో 2022, 2023 సంవత్సరాలకుగాను కవులు మోహన్ రుషి, పసునూరు శ్రీధర్ బాబులకు నేడు సాయంత్రం రవీంద్రభారతిలో ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు.

* * *

కవిత్వం నాకొక సెన్సిటివ్ బిజినెస్, స్పిరిచువల్ యాక్టివిటీ అని రాసుకున్నాడు శ్రీధర్ బాబు. నిదురపోని మెలకువ చెప్పిన కలగా ప్రవహించే కవిత్వాన్ని వర్ణమయ అధివాస్తవిక పదచిత్రాలతో చిత్రిక కట్టి, పాఠకులను విభ్రమకు గురిచేస్తాడు శ్రీధర్ బాబు. తూనిక రాళ్లను మోస్తూ తిరగడం యిష్టం లేక, తనలో ఒక తూనీగను దాచుకుని ప్రయాణిస్తున్న కవి. ఒళ్ళంతా కిటికీలై తెరుచుకున్న తేనెతుట్టె వంటి కవిత్వాన్ని సృజిస్తూ సాగిపోతున్న కవి.

ఇరవై ఏళ్ళ క్రితం శ్రీధర్ బాబు తన తొలి కవితా సంకలనం 'అనేక వచనం'లో 'నేను నీ లోంచి /నీవు నా లోంచి /మనిద్దరమూ మరెవడి లోంచో/ సామూహిక ఆత్మల సహస్ర విచ్ఛేదనల్లోంచి' అంటూ తన కవిత్వ తాత్వికతకు ఒక భూమిక రాసుకున్నాడు. ఇరవై ఏళ్ళ తరువాత వెలువరించిన అనేక వచనం. 2 కవితలో 'లోపలి అద్దంలో మెరిసిన బొమ్మ కోసం /తలుపులు తెరిచి మాయాలాంతరు పట్టుకుని /పరుగులు తీసినవాడి జాడ ఎక్కడైనా కనిపించిందా? / నేనే ఈ జనారణ్యంలో అన్ని వైపులా అసంఖ్యాకంగా' అన్నాడు.



'ఏటి ఒడ్డున' అన్న కవితలో ఏటి ఒడ్డున ఎవరో విడిచి వెళ్లిన కన్నీటి చుక్కలు, విడిచేసిన ఏకాంతపు ముఖాలు, పగిలిన నత్త గుల్లలు, పగిలిన ముఖాలు ఇట్లా ఏవేవో వుంటాయని చెబుతూ, కవిత చివరలో 'ఏటి ఒడ్డున ఇవేవీ పట్టనట్టు /తుళ్ళుతూ పరవళ్ల తొక్కుతూ పారే / ఏరు కూడా వుంటుంది' అంటాడు శ్రీధర్ బాబు.

ఏటి ఒడ్డున వున్న వేటినీ పట్టించుకోకుండా వెళ్లిపోయే ఆ ఏరును కూడా తన కవిత్వంలో భద్రపరుస్తున్నాడు శ్రీధర్ బాబు. ఎందుకంటే, శ్రీధర్ బాబుకు కవిత్వం రాయడమంటే 'దిగుడుబావి లోకి దిగుతూ దిగుతూ /ఆకాశాన్ని మరిచిపోయి /వెను చీకట్లోకి ఈదుకుంటూ పోయే పని /మెట్లెక్కుతూ ఎక్కుతూ /కాళ్ళకింద మెట్లు గల్లంతైనా /ఆగని ఆరోహణ లాంటి పని'. శ్రీధర్ బాబు కవిత్వం చదవడమంటే నక్షత్రపురం తోవలో ఒక విభ్రమతో ప్రయాణించడం.

* * *

స్కాటిష్ కవయిత్రి 'కరోల్ ఆన్ డఫీ' అంటుంది 'నీ రోజువారీ జీవితంలో, నీ జ్ఞాపకాలలో, బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు వినిపించే సంభాషణలలో లేక నీ హృదయం లోపలి ఉద్వేగాలలో నీకు కవిత్వం దొరుకుతుంది'.

కవి మోహన్ రుషి ఇటువంటి సజీవ దృశ్యాలనే తన కవిత్వంలో రికార్డు చేస్తున్నాడు. తెలంగాణలోని ఒక ద్వితీయశ్రేణి పట్టణం నుండి బతుకు తెరువు కోసం హైదరాబాద్ మహానగరానికి వచ్చిన భావుకుడు తనలాగే బతుకు తెరువు కోసం మహానగరానికి వచ్చిన మనుషులు బస్సులలో, షేరింగ్ ఆటోలలో తారసపడి వెళ్లబోసుకునే బాధలు, జీవన సంక్షోభాలు మోహన్ రుషి కవిత్వంలో మనల్ని పలకరించి కలవరపెడతాయి.

సరళమైన భాషతో జీవితాన్ని వ్యాఖ్యానిస్తూ సాగే మోహన్ రుషి కవిత్వంలో ఒక విధమైన వ్యంగ్యం అంతర్లీనంగా గోచరిస్తుంది. అట్లా అని అది వెటకారమూ కాదు, హాస్యమూ కాదు. బహుశా, వాటిని 'చాప్లినిక్ స్టేట్‌మెంట్స్' అనవచ్చేమో! ఉదాహరణకు ఒక కవితలో అంటాడు 'వాహనాల సందుల్లో అతను ప్రవహించినంత సులభంగా అతని జీవితం ప్రవహించదు'.

కవిత్వం మాత్రమే కాదు, సమకాలీన రాజకీయాల మీదా, సామాజిక సంఘటనల మీదా, సినిమాల మీదా 'దిమాగ్ ఖరాబ్' పేరున మోహన్ రుషి రాసిన వన్ లైనర్స్ కూడా చాలా ప్రాచుర్యం పొందాయి.

'గోదావరి కవి' మల్లావఝుల సదాశివుడు పురస్కారం స్వీకరించబోతున్న ఇష్టమైన కవిమిత్రులు ఇద్దరికీ శుభాకాంక్షలు!

**– కోడూరి విజయకుమార్**

# రాబోయే ఐదేళ్లూ ఆ పదేళ్ల పాలనే!

కొత్త లోక్‌సభ తొలి సమావేశాలు నా అనుమానాలను ధ్రువీకరించాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి సంబంధించినంతవరకు ఏమీ మారలేదు సుమా! బహుశా ఏదీ మారబోదు కూడా. ఇది సందేహాతీతం. ఇందుకు స్పష్టమైన సూచనలు ఇప్పటికే కనిపించాయి (జూన్ 29న ఇదే కాలమ్‌లో వచ్చిన 'మార్పు మిథ్య, మోదీయే సత్యం!' మరొక మారు చదవండి). ఎన్నికలకు పూర్వం ప్రభుత్వ సాఫల్యాలపై వక్కాణింపులు, బడాయి మాటలు, విధానాలు, కార్యక్రమాలు, పాలనా శైలి, ప్రభుత్వ నడవడి, ప్రతీకార ధోరణులు మొదలైనవాటిని సమర్థించాలని, పునరుద్ఘాటించాలని, కొనసాగించాలని నరేంద్ర మోదీ దృఢంగా ఆదేశించారు మరి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

విషాదమేమిటంటే పార్లమెంటు ఉభయ సభలలో కూడా మోదీ ఆదేశం ప్రభావం కనిపిస్తోంది. ఉత్తమ పార్లమెంటరీ సంప్రదాయం ప్రకారం ఉభయ సభలను అధిక సంఖ్యాకుల అభీష్టం ప్రకారం కాకుండా ఏకాభిప్రాయంతో నడపవలసి ఉంది. 'సభా కార్యకలాపాలను లంచ్ విరామం లేకుండా కొనసాగిద్దామా?' అన్న చిన్న పాటి విషయంపై సభాపతి లేదా అధికార పక్షం వైఖరి ఎలా ఉన్నా ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవడం అనేది ఒక సదాచారంగా ఉన్నది. అయినప్పటికీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన వృత్తి విద్యా కోర్సుల ఎంట్రెన్స్ టెస్ట్‌లపై నెలకొన్న వివాదాలను చర్చించాలని వందలాది ఎంపీలు మద్దతునిచ్చిన వాయిదా తీర్మానాలను చర్చకు చేపట్టడానికి ఉభయ సభల సభాపతులూ తిరస్కరించారు. గత ఐదేళ్లలో పార్లమెంటులో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిన వైనాన్ని సభాపతుల నిర్ణయం గుర్తుకు తెచ్చింది. ఎంత శోచనీయం!

పార్లమెంటు ఉభయ సభలలో తొలి చర్చ, పార్లమెంటు వెలుపల తీసుకున్న నిర్ణయాలు ప్రభుత్వ ఉద్దేశాలను, పరిపాలనా దిశను స్పష్టం చేశాయి : ఒకే వ్యక్తి ఆదేశాలు, నిర్దేశాల ప్రకారమే దేశ పాలన కొనసాగనున్నది; మోదీ 3.0కు కీలక మద్దతు నిస్తున్న మిత్రపక్షాల (టీడీపీ, జేడీయూ)తో పాటు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు వేటికి కూడా ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించడం మినహా మరెటువంటి పాత్ర ఉండదు; నరేంద్ర మోదీ తన సొంత మంత్రులకు, పార్లమెంటు ఉభయ సభలలోని ప్రతిపక్ష నేతలకు దేశ పాలనా వ్యవహారాలలో పాలు పంచుకునేందుకు ఎటువంటి అవకాశమివ్వబోరు; ఉద్దేశపూర్వకంగా గానీ, అనుద్దేశపూర్వకంగా గానీ తాము చేసిన తప్పులు, పొరపాట్లను మోదీ సర్కార్ ఎటువంటి పరిస్థితులలోను అంగీకరించబోదు; ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని సకల లోపాలు, లొసుగులకు బాధ్యత జవహర్‌లాల్ నెహ్రూతో మొదలుకొని పాలించిన గత ప్రభుత్వాలదేనని మోదీ ప్రభృతులు నిక్కచ్చిగా చెప్పడం తప్పక కొనసాగుతుంది; బీజేపీ అధికార ప్రతినిధులు యథావిధిగా కలహశీల, ఆక్షేపణీయ రీతుల్లో వ్యవహరిస్తారు; జీతభత్యాలపై అధికార పక్షానికి అనుకూలంగా సామాజిక మాధ్యమాలలో చెలరేగిపోయేవారు మరింత క్రియాశీలంగా కొనసాగుతారు; దర్యాప్తు సంస్థలపై ఎటువంటి అదుపులు ఉండబోవు, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అవి వ్యవహరిస్తాయి.

543 లోక్‌సభ నియోజకవర్గాలలో 240ని మాత్రమే బీజేపీ సొంతంగా గెలుచుకున్నది, దాని నేతృత్వంలోని ఎన్డీఏ గెలుచుకున్న స్థానాలు 292 మాత్రమే. అయినప్పటికీ మరోసారి పాలించడానికి ప్రజలు తమకే అధికారమిచ్చారని మోదీ విశ్వసిస్తున్నారు. ప్రజా తీర్పు తమకే అనుకూలంగా ఉందని ఉద్ఘాటిస్తున్నారు. 'ప్రజాస్వామ్యంలో ప్రజలు దృఢ శైలాలే కానీ, లక్క పిడతలు కారు' అన్న సత్యాన్ని ఆయన విస్మరిస్తున్నారు. సరే, ఎంపీల విషయమేమిటి? ఇంత స్వల్ప వ్యవధిలో వారి తీరుపై ఒక కచ్చితమైన అభిప్రాయానికి రావడం కష్టం కానీ కొన్ని ప్రాథమిక సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్‌కు చెందిన ఎన్డీఏ/ బీజేపీ ఎంపీలు భయాందోళనలకు గురవుతున్నారు. ఆ మూడు రాష్ట్రాలలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడమే వారి కలవరపాటుకు ప్రధాన కారణం. ఆ రాష్ట్రాలలో తాము మళ్లీ అధికారానికి రాగలుగుతామా అనే శంక వారిని పీడిస్తోంది. మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం బలహీనపడుతోంది. హర్యానాలోని పది లోక్‌సభ సీట్లను బీజేపీ, కాంగ్రెస్ సరిసమానంగా గెలుచుకున్నాయి. హేమంత్ సోరేన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ జార్ఖండ్ హైకోర్టు వెలువరించిన తీర్పు ఆ మూడు రాష్ట్రాలలోని ఇండియా కూటమిలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపింది. అసెంబ్లీ సమరానికి ఆ కూటమి మహోత్సాహంతో సమాయత్తమవుతోంది. పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్, కర్ణాటకలో ఎన్డీఏ/ బీజేపీ తీవ్రంగా నష్టపోయాయి. కేరళ, తమిళనాడులో ఆ రెండూ దాదాపుగా అంతర్ధానమయ్యాయి. ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ నుంచి ఎన్నికైన ఎన్డీఏ/ బీజేపీ ఎంపీలు ఉల్లాసంగా ఉన్నారు. అయితే తమది 'సంకీర్ణ' ప్రభుత్వం అన్న వాస్తవం వారిని వేదనకు గురి చేస్తోంది. ఈ సంకీర్ణ సర్కార్ ఎంత కాలం మనగలదన్న విషయం కూడా వారిని కలవరపరుస్తోంది.

భారతీయ జనతా పార్టీ ఒక అజేయ శక్తా? ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అజేయుడా? అవునని ఘంటాపథంగా చెప్పుకోవడానికి తాము ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలన్న విషయం బీజేపీకి బాగా తెలుసు. అదే విధంగా కాంగ్రెస్ సైతం నెహ్రూ, ఇందిర నాటి తన పాత వైభవాన్ని సంపూర్ణంగా పునరుద్ధరించుకోవాలంటే బీజేపీ కంటే మరెంతో జనాదరణ పొందవలసి ఉన్నది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ తన 99+2 సీట్లను సాధించుకున్నది. 170 లోక్‌సభ స్థానాలు ఉన్న మరో తొమ్మిది రాష్ట్రాలలో కేవలం నాలుగు సీట్లను మాత్రమే కైవసం చేసుకున్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే 215 నియోజకవర్గాలలో కాంగ్రెస్ అసలు పోటీ చేయలేదు (ఆ నియోజకవర్గాలలో ఇండియా కూటమిలోని కాంగ్రెస్ మిత్రపక్షాలు పోటీ చేశాయి) కాంగ్రెస్, ఇండియా కూటమి కలసి ఒక బలవత్తరమైన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించివేయగల శక్తి వాటికి లేదు. అటువంటి శక్తి లోక్‌సభలో 16 మంది ఎంపీలు ఉన్న తెలుగుదేశం పార్టీకి, 12 మంది సభ్యులు ఉన్న జనతాదళ్ (యునైటెడ్) పార్టీకి ఉన్నాయి. ఆ రెండు పార్టీలు తమకు సరైన సమయం వచ్చే వరకు వేచివుంటాయి. కేంద్ర బడ్జెట్ కోసం ఎదురు చూస్తున్నాయి. తమ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆ రెండు పార్టీలు తప్పక డిమాండ్ చేస్తాయి. అయితే అందుకు మోదీ ససేమిరా అంటారని మరి చెప్పనవసరం లేదు. మరి కొద్ది నెలల్లో జరగనున్న మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడే దాకా వేచివుంటాయి.





గత పది సంవత్సరాలుగా తాము అనుసరించిన పాలనా విధానాలు సమర్థనీయమైనవని, భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దేవని ప్రధానమంత్రి దృఢంగా విశ్వసిస్తారు. అవే విధానాలు యథాతథంగా కొనసాగుతాయని పార్లమెంటులో ఆయన ప్రసంగాలు స్పష్టం చేస్తున్నాయి. కనుక కేవలం అదే ప్రభుత్వానికే కాకుండా, అదే పాలనకు సైతం దేశ ప్రజలు సిద్ధంగా ఉండాలి.

సరే, ఈ అనిశ్చిత రాజకీయ పరిస్థితులు ఆర్థిక విధానాలను ఎలా ప్రభావితం చేయనున్నాయి? కొన్ని ఊహలు చేసేందుకు, అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు సాహసిస్తున్నాను. 1) తన వైఫల్యాలను నిరాకరించే ధోరణి ప్రభుత్వం తప్పక కొనసాగిస్తుంది: నిరుద్యోగిత పెచ్చరిల్లిపోవడాన్ని, ద్రవ్యోల్బణం, ముఖ్యంగా ఆహార పదార్థాల విషయంలో బాగా పెరిగిపోతుందన్న వాస్తవాన్ని ప్రభుత్వం అంగీకరించదు; కార్మికుల వేతనాలు, ఆదాయాలు స్తంభించిపోవడాన్ని ఒప్పుకోదు; దేశ జనాభాలో కింది స్థాయిలో ఉన్న 20 శాతం మంది పేదరికంలో కునారిల్లుతున్నారన్న కఠోర వాస్తవాన్ని గుర్తించదు; అసమానతలు పెరిగిపోవడాన్ని పట్టించుకోదు. మరి ఇటువంటి వైఖరితో ఉన్న మోదీ సర్కార్ ఆర్థిక విధానాలలో మౌలిక మార్పులకు పూనుకుంటుందా? అలా ఆశించడమే అసంబద్ధం. 2) మౌలిక సదుపాయాలు, బుల్లెట్ రైలు ఇత్యాది ఆడంబరపూర్వక ప్రాజెక్టులలో భారీ మదుపులను మోదీ సర్కార్ కొనసాగిస్తుంది. మౌలిక సదుపాయాల రంగంలో ప్రభుత్వ వ్యయాల పెరుగుదల వల్ల ఆర్థిక లబ్ధి సమకూరుతుంది, సందేహం లేదు. అయితే ప్రైవేట్ పెట్టుబడులు కొరవడుతాయి. వృద్ధిరేటు స్వల్పస్థాయిలో ఉంటుంది. అయితేనేం, ప్రభుత్వం అవిశ్వసనీయ గణాంకాలతో వృద్ధిరేటును ఘనంగా పెంచుతుంది. 3) దక్షిణ కొరియా అభివృద్ధి నమూనాను అనుసరించడాన్ని మోదీ సర్కార్ కొనసాగిస్తుంది. కీలక రంగాలలో గుత్తాధిత్యం పెరిగిపోతుంది. తత్ఫలితంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఖాయిలాపడతాయి. కొత్త ఉద్యోగాల సృష్టి మందగిస్తుంది. ఏటా లక్షల సంఖ్యలో ఉద్యోగాల మార్కెట్‌లోకి ప్రవేశించే విద్యావంతులు, అనిపుణ యువజనులు తీవ్రంగా నష్టపోతారు. 4) వృద్ధాప్యం మీదబడుతున్న నాయకుని సారథ్యంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్య, ఆరోగ్య భద్రత, పర్యావరణ రక్షణ, వాతావరణ మార్పు నియంత్రణ, వ్యవసాయం, అడవుల అభివృద్ధి, శాస్త్ర, సాంకేతిక పరిశోధనలు–అభివృద్ధి రంగాలలో మౌలిక మార్పులు సాధించగల ప్రతిభావంతులను ఆకట్టుకుని, వారికి నిర్ణయాత్మక బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువ. మరి ఈ విషయంలో సమర్థంగా వ్యవహరించకపోతే నష్టపోయేది దేశమే కాదూ?

గత పది సంవత్సరాలుగా తాము అనుసరించిన పాలనా విధానాలు సమర్థనీయమైనవని, భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దేవని ప్రధానమంత్రి దృఢంగా విశ్వసిస్తారు. అవే విధానాలు యథాతథంగా కొనసాగుతాయని పార్లమెంటులో ఆయన ప్రసంగాలు స్పష్టం చేస్తున్నాయి. కనుక కేవలం అదే ప్రభుత్వానికే కాకుండా, అదే పాలనకు సైతం దేశ ప్రజలు సిద్ధంగా ఉండాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

# ఆ ఖాళీలనూ డీఎస్సీలో కలపాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ద్వారా ఏర్పడే 10వేల ఉపాధ్యాయ ఖాళీలను కూడా ప్రస్తుత డీఎస్సీ నోటిఫికేషన్‌లో జతచేయాలి. అలాగే టెట్ ఫలితాలకు, డీఎస్సీ పాత షెడ్యూల్ జూలై 17కి తక్కువ సమయం ఉంది. అందువల్ల అభ్యర్థులకు మరొక నెల రోజులు గడువు ఇచ్చి ఆగస్ట్ చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో పరీక్షలు నిర్వహించాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ద్వారా 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. దాంతో పెద్ద ఎత్తున డీఎస్సీ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారు. గత ప్రభుత్వం జారీ చేసిన 5089 టీచర్ పోస్టులకు, మరో 6 వేల టీచర్ పోస్టులు మాత్రమే జత చేసి 11,062 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. గత 8 సంవత్సరాలుగా టీచర్ పోస్టులు భర్తీ కాలేదు. 33 జిల్లాల వారీగా చూస్తే ఇప్పుడు వచ్చిన డీఎస్సీలో స్వల్ప సంఖ్యలోనే పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సింగిల్ డిజిట్‌లోనే ఉన్నాయి. ఎస్జీటీ పోస్టులు కూడా చాలా జిల్లాల్లో తక్కువ సంఖ్యలోనే ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పుడు చేపట్టిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ద్వారా కొత్తగా ఖాళీలు ఏర్పడనున్నాయి. హేతుబద్ధీకరణ అంటూ టీచర్ పోస్టులు కుదించకుండా ఈ ఖాళీలను కూడా ప్రస్తుత డీఎస్సీలో జతచేసి అభ్యర్థులకు న్యాయం చేయాలి. అప్పుడు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద విద్యార్థులకు కూడా టీచర్లు అందుబాటులో ఉంటారు. ప్రభుత్వ స్కూల్స్ కూడా బలోపేతం అవుతాయి. అలాగే డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ విధానంలోనే నిర్వహించాలి.

**– రావుల రామ్మోహన్ రెడ్డి**
డి.ఎడ్, బి.ఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ

# 'ఎయిడెడ్'ను కాపాడండి!

రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు క్రమంగా మూతపడుతున్నాయి. అనేక ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పదవీ విరమణలు మాత్రమే ఉంటున్నాయి తప్ప, కొత్త ఉపాధ్యాయుల భర్తీ లేదు. పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ఉపాధ్యాయుల కొరత ఏర్పడటంతో విద్యార్థులు పాఠశాలల్లో చేరడం లేదు. విద్యార్థులు లేరనే సాకుతో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్నవారిని ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విధుల నిర్వహణకు కేటాయిస్తున్నారు. దశాబ్దాల క్రితం ఎయిడెడ్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అనేకమంది నేడు ఉన్నత స్థానాలకు ఎదిగి సమాజానికి సేవలు అందిస్తున్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలకు దాతలు భారీగా భూదానాలు చేశారు. ఒక్కో పాఠశాలకు మూడు నుండి 10 ఎకరాల వరకూ భూమి కేటాయించారు. ప్రస్తుతం అనేక ఎయిడెడ్ విద్యాసంస్థల భూములు కబ్జాదారుల వశమైనాయి. కొన్ని భూములు రెండు, మూడు చేతులు మారితే, మరికొన్ని ప్రాంతాల్లో పెద్ద పెద్ద భవనాలు కట్టుకున్నారు. కొన్ని చోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సదరు సంస్థల యాజమాన్యం వత్తాసుతో భూకబ్జాదారుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఎయిడెడ్ విద్యాసంస్థల ఆస్తులను, భూములను రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని ఎయిడెడ్ విద్యాసంస్థలన్నింటి స్థితిగతులను లోతుగా సమీక్షించి ఖాళీలను భర్తీ చేయాలి.

**– ఎస్. విజయ భాస్కర్**

# వంగపల్లి దీక్ష

ఎస్సీల వర్గీకరణ ఇంకా పరిష్కారం లభించని అంశంగానే ఉంది. న్యాయబద్ధత, సమాజ మద్దతూ ఉండి కూడా రాజకీయపార్టీల వైఖరి వల్ల మాదిగ సమాజం మోసపోతూనే ఉంది. మొన్నటిమొన్న ప్రధాన మంత్రి హోదాలో మోదీగారు అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ ఇస్తే వర్గీకరణ చేస్తారని ఆశపడ్డాం. అసెంబ్లీ ఎన్నికలు అయిపోయాయి. పార్లమెంట్‌లో బిల్లు పెట్టలేదు. కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఆ పేరుతో మాదిగ ఓట్లకు గాలం వేశారు. ఈ నేపథ్యంలో, ఎస్సీల వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా మాదిగలకు అన్యాయం చేస్తున్న కేంద్రం వైఖరికి నిరసనగా, ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూలై 7న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద వర్గీకరణ సాధనకై రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ దీక్ష నిర్వహిస్తారు.

**– ఎంఆర్‌పిఎస్–టీఎస్**

# చరిత్ర చూసి చిహ్నాలు ఎంచాలి!

కాల గణన, ధర్మం, అధికారం, సామూహిక అస్తిత్వం, వ్యాపారం... వీటిని ప్రకటించేందుకు వరుసగా ఋషులు, మతపెద్దలు, రాజులు, సంఘపెద్దలు, వ్యాపార దిగ్గజాలు ఆయా చారిత్రక యుగాలలో పలుచిహ్నాలను రూపొందించారు. వాటి ద్వారా ఆయా కాలాలకు చెందినవారి విశ్వాసాలు చిరకాలాలు వర్ధిల్లి వారసత్వ సంపదగా మన వరకూ అందివచ్చాయి.

చరిత్రకు తెలిసి మొట్టమొదట ఐదారు వేల సంవత్సరాల క్రితమే సింధూ నాగరికతా కాలంలో ఆనాటి ఋషులు భూభ్రమణం కారణంగా ఆకాశంలో చుక్కలు (నక్షత్రాలు) గమనం చేస్తున్నాయని భావించి ఆ చుక్కల సమూహాలను (వింత) పశువులు / జంతువుల రూపంలో ఊహించి వాటి చిత్రాలను చిహ్నాలుగా ముద్రికలపై గీశారు. అవి ఆయా కాలాల్లో పరిపాలించిన రాజర్షులకు అధికారిక చిహ్నాలు. అదే సింధూ నాగరికతా కాలం నాటికే మనుగడలో ఉన్న ప్రణవ నాద చిహ్నం ఓమ్ లేదా స్వస్తిక తరువాత కాలాలలో జైన మతానుయాయులకు, హిందూ మతస్థులకు పవిత్ర చిహ్నాలయ్యాయి. క్రీ.పూ. ఆరవ శతాబ్దంలో బౌద్ధులు ధర్మచక్రాన్ని తమ చిహ్నంగా గ్రహించారు.

తెలంగాణ విషయానికి వస్తే – దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణలో పుట్టిన సాతవాహన సామ్రాజ్యంలో గణ రాజ్యాల చిహ్నాలైన జంతువుల చిహ్నాలతో పాటు పూర్ణకుంభం చిహ్నం ప్రముఖంగా వ్యాప్తిలోకి వచ్చి దక్కను రాష్ట్రాలలో వెయ్యేండ్లకు పైగా ప్రచారంలో ఉంది. సాతవాహనుల తర్వాత వచ్చిన రాజవంశాలు – ఇక్ష్వాకులు, విష్ణుకుండులు, చాళుక్యులు, కాకతీయుల వరకు – పూర్ణకుంభం చిహ్నాన్ని తమ శిల్పాలలో అవిచ్ఛిన్నంగా చెక్కించాయి. (కాబట్టే 1956 నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్ణకుంభాన్ని అధికారిక చిహ్నంగా స్వీకరించింది).

అయితే పూర్ణకుంభానికి సమాంతరంగా విష్ణుకుండులు (క్రీ.శ. 5 – 6 శతాబ్దాలు) లంఘిస్తున్న సింహాన్ని అధికారిక చిహ్నంగా తమ నాణేలపై, కోటగోడలపై చెక్కించారు. వారి తర్వాత అధికారం చేపట్టిన చాళుక్యులు (6 – 8 శతాబ్దాలు) వరాహాన్ని అధికారిక చిహ్నంగా పాటించారు. తమ మాతృ భూమిని వరాహ విషయం (పాలమూరు జిల్లా ప్రాంతం) అని, తమ నాణేలను వరాహాలు అని పిలిచారు. వారి అనంతరం యావత్ తెలుగు దేశాన్ని పాలించిన కాకతీయులు (12 – 14 శతాబ్దాలు) లంఘిస్తున్న సింహం చిహ్నంతో పాటు 'ఆవు–దూడ, ఖడ్గం'ల చిత్రాలను తమ శాసన స్తంభాలపై చెక్కించారు. లంఘిస్తున్న సింహం, ఖడ్గం అధికార/ రాజ దర్పాన్ని ప్రదర్శించగా ఆవు–దూడ పాడి పంటల అభివృద్ధి కాంక్షకు చిహ్నాలుగా నిలుస్తాయి. కాకతీయుల తర్వాత 14, 15 శతాబ్దాలలో తెలంగాణను పాలించిన పద్మనాయకులు భైరవుణ్ని తమ రాజ చిహ్నంగా తాము కట్టించిన కోటగోడలు, గుడి గోపురాల ముందు చెక్కించారు.

అనంతరం తెలుగు రాష్ట్రాలను పాలించిన కుతుబ్ షాహీలు (16, 17 శతాబ్దాలు) బలిష్ఠ గరుడ చిహ్నాన్ని తమ కోటగోడలపై చెక్కించారు. సామంత రాజులు లంఘిస్తున్న పులులు లేదా సింహాల శిల్పాలను తమ కోటగోడలు, భవంతులు, సనదులు అధికారిక పత్రాలపై చిత్రించుకున్నారు. మొత్తమ్మీద గడచిన రెండు వేల సంవత్సరాల కాలంలో తెలంగాణనేలిన రాజులందరూ అయితే తమ చిహ్నాల వీరత్వాన్ని లేదా దర్పాన్ని లేదా పాడిపంటల సమృద్ధి కాంక్షను ప్రకటించున్నారు.

పైన తెలిపిన చిహ్నాలు కాక సమాంతర కాలాలలో ప్రజలు, ఆయా మతాల పెద్దలు, కొందరు రాజులు కూడా ధర్మస్తంభం లేదా ధ్వజస్తంభాన్ని కూడా తమ విశ్వాస చిహ్నాలుగా ప్రచలితం చేశారు. బృహత్ శిలాయుగపు ప్రజలు రెండు మూడు వేల సంవత్సరాల కిందట పెద్ద పెద్ద నిలువు రాళ్ళను నిలిపారు. ఆ చిహ్నాలు వారి ఆవాస విశ్వాసాలను తెలియజేస్తాయి. జైన మతానుయాయులు మాన స్తంభాలను నిలిపారు. బౌద్ధులు తమ స్తూపాల పైన అయక స్తంభాలను, ధర్మ చక్ర స్తంభాలను నిలిపారు. ఇక్ష్వాకుల కాలం (క్రీ.శ. 3వ శతాబ్దం)లో దేమసేన అనే రాజవైద్యుడు ఇలాంటి ధర్మచక్ర స్తంభాన్ని నిలిపి వేయించిన శాసనం ఇటీవల సూర్యాపేట జిల్లాలోని ఫణిగిరిలో బయల్పడింది.

తెలంగాణ తొలి ప్రభుత్వమేమో తెలంగాణ తల్లిని చేతులలో బతుకమ్మ, మక్కంకి పట్టుకున్నట్లు చిత్రించింది. మక్కంకి తెలంగాణ ప్రాంతానికి ఇటీవల కాలంలో వచ్చిందని శాస్త్రజ్ఞుల ప్రాథమిక నిర్ధారణ. పల్లె ప్రజలు తరతరాల కాలం నుంచి ఇటీవలి కాలం వరకు మక్కంకి కంటే ఎక్కువగా జొన్నకంకిని తమ జీవన స్రవంతిలో భాగం చేసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ తల్లి తలపై కాకతీయ శైలి కిరీటాన్ని, దేహంపై కాకతీయ ఆభరణాలను, మూడవ–నాలుగవ చేతులలో అన్నం కుండ – గరిటె పట్టుకుని వడ్డిస్తున్నట్లుగా చిత్రీకరిస్తే చారిత్రక యుగాల ప్రజా–కళా వారసత్వాన్ని గౌరవించినట్లు అవుతుంది.



వేయేళ్ళ క్రితం ఖమ్మం జిల్లా ప్రాంతం చుట్టు పక్కల ప్రాంతాలను పాలించిన ముదిగొండ చాళుక్యులు బేతాళ ధ్వజం, రావణ ధ్వజాలను పూజించినట్లుగా వారి శాసనాలు ప్రస్తావించాయి. ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో నివసిస్తున్న కోయ గిరిజనులు ఇప్పటికీ ప్రపంచ ప్రసిద్ధమైన మేడారం జాతరలో సమ్మక్క, సారలమ్మల గద్దెలపైన దారు స్తంభాలనే ఆ తల్లుల చిహ్నాలుగా ఆరాధిస్తున్నారు. ఇప్పటికీ గోండు, కోలాం, నాయకపోడ్ తదితర గిరిజన తెగల పెద్దల ఇళ్ళ ముందు, వారి గుళ్ళల్లోనూ ధ్వజ స్తంభం ప్రముఖంగా కనిపిస్తుంది. ఇక గోండులు, వారి ఆశ్రిత తెగలైన పర్ధానులు, తోటీలు నాగోబా దేవున్ని ప్రధానంగా ఆరాధిస్తారు. అదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్‌లో ఏటా పెద్ద ఎత్తున జాతర జరుపుతారు. తెలుగు ప్రజలు కూడా నాటి నుంచి నేటి వరకు నాగ ప్రతిమలను ప్రతిష్ఠించడం, పూజించడం గమనార్హం. ప్రస్తుత ముఖ్యమంత్రి, మంత్రి మండలి మేడారం జాతరతోపాటు నాగోబా జాతరలో పాల్గొనడం, ఆ జాతరల చిహ్నాలకు రాష్ట్ర అధికారిక చిహ్నాలలో చోటు కల్పిస్తామనటం వారు రాష్ట్ర గిరిజన సాంస్కృతిక వారసత్వాలకు ఇచ్చే గౌరవ భావాన్ని తెలుపుతుంది.


ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం కాకతీయుల తోరణాన్ని ప్రధాన అధికారిక చిహ్నంగా గ్రహించింది. కానీ కాకతీయులేమో ఆవు–దూడలను, లంఘిస్తున్న సింహం (గజకేసరి) చిత్రాలను తమ అధికారిక/ రాజ చిహ్నాలుగా వాడారు. గజకేసరి చిత్రాన్ని గోండులు ఇప్పటికీ తమ జాతి అధికార చిహ్నంగా వాడుతుండడం గమనార్హం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు తల్లి విగ్రహాన్ని ప్రసిద్ధ తెలంగాణ చిత్రకారులు ఆచార్య కొండపల్లి శేషగిరిరావు తయారు చేస్తే ఆనాటి ఆంధ్ర ప్రాంత పెద్దలు ఆ విగ్రహం తన సౌష్ఠవాన్ని శృంగారభరితంగా వ్యక్తపరుస్తున్నదని పక్కన పడేశారు. దానితో ఆ విగ్రహాన్ని ఒకప్పుడు నిలిపి ఉంచిన ప్రదేశానికి 'తెలుగుతల్లి ఫ్లైఓవర్' అనే పేరు మాత్రమే ఇప్పటికీ మిగిలి ఉంది. వాస్తు నిర్మాణాలలో కూడా స్త్రీ వాస్తు నిర్మాణాలే అందంగా ఉంటాయని కళారాధనా తత్వం ఏ మాత్రం ఉన్నవారైనా అలాంటి నిర్మాణాలనే నిర్మించుకోవడానికి ఉత్సుకత చూపుతుంటారు. మహాకవులు కూడా అమ్మ తల్లులు, దేవతల అంగాంగ సౌష్ఠవాలను ఇతోధికంగా వర్ణించారు. వారి ఉద్దేశం అశ్లీల భావన కాదు; ఏ పిల్లలైనా తమ తల్లి అంద విహీనురాలు కాకుండా అందమైన ప్రేమమూర్తి అనే భావిస్తారని. ఈ నేపథ్యంలో ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ కళాకారుడు ఆచార్య కొండపల్లి శేషగిరిరావు గారి కళాభినివేశాన్ని అగౌరవపరిచినట్లే అర్థమవుతుంది.

తెలంగాణ తొలి ప్రభుత్వమేమో తెలంగాణ తల్లిని చేతులలో బతుకమ్మ, మక్కంకి పట్టుకున్నట్లు చిత్రించింది. మక్కంకి తెలంగాణ ప్రాంతానికి ఇటీవల కాలంలో వచ్చిందని శాస్త్రజ్ఞుల ప్రాథమిక నిర్ధారణ. పల్లె ప్రజలు తరతరాల కాలం నుంచి ఇటీవలి కాలం వరకు మక్కంకి కంటే ఎక్కువగా జొన్నకంకిని తమ జీవన స్రవంతిలో భాగం చేసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ తల్లి తలపై కాకతీయ శైలి కిరీటాన్ని, దేహంపై కాకతీయ ఆభరణాలను, మూడవ–నాలుగవ చేతులలో అన్నం కుండ – గరిటె పట్టుకుని వడ్డిస్తున్నట్లుగా చిత్రీకరిస్తే చారిత్రక యుగాల ప్రజా–కళా వారసత్వాన్ని గౌరవించినట్లు అవుతుంది. కుండ – గరిటె స్థానంలో బోనమెత్తడాన్ని ప్రత్యామ్నాయ ఆలోచనగా స్వీకరించవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వపు అధికారిక చిహ్నం చిరకాలం నిలిచేలా ఉండాలంటే ప్రస్తుత ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ప్రజల కృషి, త్యాగాలు, ప్రజాస్వామ్య కామనలకు విలువివ్వడం సమంజసం. ఐతే పైన ప్రస్తావించినట్లు అనేక చారిత్రక కోణాలను కూడా విశ్లేషించి తుది నిర్ణయం తీసుకోవాలి. అందుకుగాను చరిత్రకారులు, మేధావుల కమిటీని ఒకదానిని నియమించి దాని సూచనల మేరకు అధికార చిహ్నాలను రూపొందిస్తే సకల జనామోదంగా ఉంటుంది.

■ **డా. ద్యావనపల్లి సత్యనారాయణ**



పోలీసుల అదుపులో
పార్థీ గ్యాంగ్
నగర శివారు కొత్తగూడెం వద్ద ఇద్దరిని పట్టుకున్న నల్లగొండ జిల్లా పోలీసులు 8



# బోనాల పండగను ప్రశాంతంగా జరుపుకోవాలి

● సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

కార్వాన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను ప్రజలంతా శాంతియుతంగా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గోల్కొండ బోనాల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తొట్టెల ఊరేగింపు ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు కోటలో బందోబస్తును పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సుల నేపథ్యంలో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన సిబ్బందికి తెలిపారు. ప్రత్యేక బందోబస్తులో భాగంగా గోల్కొండ కోటలో ఉన్న కెమెరాలతో పాటు కొన్ని ప్రత్యేక కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. మహిళా భక్తులకు రక్షణగా షీ టీమ్‌లు పనిచేస్తాయన్నారు. శ్రీనివాస్ రెడ్డి వెంట అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, పలు శాఖల అధికారులు ఉన్నారు.

**కలెక్టర్‌తో కలిసి**

నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ పనులను పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి వసతిని, బారీకేడ్లను, షెడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ అమ్మవారిని దర్శించుకున్నారు.



మెట్లపూజలో మహిళలు

**మెట్లపూజ**

కార్వాన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆషాఢం అమావాస్య శుక్రవారాన్ని పురస్కరించుకొని భక్తులు మెట్ల పూజను నిర్వహించారు. కోటలోని మెట్లకు పసుపు, కుంకుమతో బొట్లు పెడుతూ అమ్మవారిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సలహాదారులు సిరుగు రాజు వస్తాద్, సంఘ సేవకులు ఉమా రాణి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

**RENTAL > COMMERCIAL**

H 1500 sft commercial furnished office space available for Rent / Lease with 1 Car Parking at Maheshwari Mekins Plaza, Opposite Greenlands Hotel, Ameerpet, Hyderabad. Contact: 9908158617, 8686259283 AJH>97834

**PROPERTY FOR SALE**

H West Facing > 200 sq.yards, Ground Floor (Nearly 1800 sqft) House For Sale @ Plot No.111, Road No.4, Silent Avenue Colony, Dammaiguda, Hyderabad. Cont.No. 9989381390 / 9912229229 AJH>0401

**PLOT FOR SALE**

H ఫాక్స్‌కాన్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ దగ్గరలో 25 ఎ.ల్లో HMDA ప్లాట్లు @ ఎలివి ఎనేదు. స్పాట్ రిజి.Nr ORR, TSIIC, ఫ్రీ సైట్ ట్రిప్. లోన్స్ కలవు. 8978470361 AJH>002427

H చేగుంట హైవేను ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ ఏరియాలో ఓపెన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్రః ఫోన్ : 9849321156 AJH>002428

H VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ.గ. 1,900/- నుండి 18,500/- సంప్ర : 73373 11924 AJB-32

H Near ADIBATLA, TCS, Foxconn, RR Dist Collectorate, 1 KM From MangalPally (V), CVR College Road, E/F, 167 sqyds (30x50) HMDA Layout. No Brokers. Ph: 9948558061 / 6301867623 AJH>4019

**SALE**

H TENDER : OPEN ACTION TO PLASTIC CHAIRS, WOODEN SCRAB and IRON SCRAB, ISW, KHAIRATABAD, TG, HYD. CONTACT NO. 040>23395060, 8712657060 AJH>001972

**అంజనా వాటర్ ప్రూఫింగ్**

H స్లాబ్, టెర్రస్, సైడ్ గోడ, బాత్ రూమ్, వాటర్ ట్యాంక్ లీకేజీలను ఆధునిక కెమికల్స్ ద్వారా అనుభవంగల టెక్నీషియన్స్‌తో అరికట్టబడును. సంప్ర. 9391324850 AJH>344

**FOR RENT / LEASE**

H 20.1 BHK Deluxe Family Accomodation (Built) 13. Furnished Deluxe Rooms. Monthly Basis (A/c & Non AC). 5. Shutters (1265.SFT) 1st Floor & Toilet N.H.Road Face For Bank > Hotel > Commercial Business. Mohan Complex X Road, Sangareddy. [illegible]024627 AJH>189871

**FLAT FOR SALE**

H Hunter Road Warangal 3BHK Flat 1970 Sft 2nd Floor with Wood Work @ Yathiraja Nilayam. Cell : 9849455000, 9490022014. AJH>001968

**BUSINESS**

H నెలకు 2 లక్షలు ఆపైన 1 సం.నకు 50 లక్షలు ఆపైన సంపాదించుకునే అద్భుత అవకాశం. సంప్ర : 99497 96940, విజయా శాండిల్ ఉడ్ ప్రాజెక్ట్స్, విజయవాడ.

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806


**దోమలు.. వ్యాధులు**




ఎర్రగడ్డలోని ఆయుర్వేద ఆస్పత్రి ఎదురుగా రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు

**ఈ దుస్థితికి కారణాలు**

- పలు కాలనీలు, బస్తీల్లో వారానికి ఒకటి, రెండు సార్లు మాత్రమే ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోంది. దీంతో ఆ ఇళ్లలోని వ్యర్థాలు రోడ్లపైకి వస్తున్నాయి.
- బిన్‌లను తొలగించి.. వల్నరబుల్ గార్బేజ్ పాయింట్లు లేకుండా చేయాలని సంకల్పించిన జీహెచ్‌ఎంసీ.. ఆ దిశగా పూర్తిస్థాయి చర్యలు తీసుకోకపోవడంతో రహదారుల పక్కన చెత్త కుప్పలు పెరుగుతున్నాయి.
- పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. రహదారులపై మురుగు ఏరులై పారుతోంది. రోడ్ల పక్కన, ఖాళీస్థలాల్లో మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.
- సివరేజీ వాటర్ చేరుతున్న చెరువుల్లో గుర్రపు డెక్క పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇది డెంగీ, మలేరియా వ్యాప్తికి దారితీస్తోంది.



# ప్రమాదంలో ప్రజారోగ్యం

## అపరిశుభ్రతకు ఆలవాలంగా మహానగరం

- బస్తీలు, కాలనీలు, ప్రధాన రహదారులు.. అంతటా మురుగు పరుగులే..
- కుప్పలుగా పేరుకుపోతున్న చెత్తతో ప్రమాదంలో పడుతున్న ప్రజారోగ్యం
- చెరువుల్లో వ్యర్థాలు.. గుర్రపుడెక్క విస్తరణ
- దోమల విజృంభణతో డెంగీ, మలేరియా జ్వరాల వ్యాప్తి
- పట్టించుకోని కౌన్సిల్.. సమావేశాలకే పరిమితమైన సభ్యులు

**అంతర్జాతీయ చిత్రపటంపై హైదరాబాద్‌ను సగర్వంగా నిలుపుతామని, రాష్ట్ర కీర్తి ప్రతిష్టలు పెంచేలా మహానగరాన్ని తీర్చిదిద్దుతామని ఓవైపు ప్రభుత్వం ప్రకటిస్తుండగా, క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు విరుద్ధంగా మారుతున్నాయి. జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డుల నిర్లక్ష్యంతో అడ్డగుట్ట నుంచి ఐటీ కారిడార్ వరకు అధ్వానంగా తయారవుతున్నాయి. బస్తీలు కంపుకొడుతున్నాయి. చెత్తాచెదారం మురుగునీటితో కాలనీలు, ప్రధాన రహదారులూ అసహ్యంగా మారుతున్నాయి. తద్వారా దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలుతున్నాయి.**

హైదరాబాద్ సిటీ నెట్‌వర్క్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో దోమ కారక వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా కేసులు నగరంలో కిందటి సంవత్సరంతో పోలిస్తే పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసులకు రెండుమూడింతలు అధికంగా గ్రేటర్‌లో డెంగీ కేసులుంటున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### కౌన్సిల్‌లో చర్చ..

జీహెచ్‌ఎంసీలో ఇప్పటి వరకు జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో పారిశుధ్య నిర్వహణపై చర్చ జరిగింది. క్షేత్రస్థాయిలో అధ్వాన పరిస్థితులను ప్రస్తావిస్తూ అధికారులపై కార్పొరేటర్లు మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే ఫిబ్రవరిలో జరిగిన మీటింగ్‌లో అడ్‌హాక్ కమిటీని వేశారు. మెరుగుదల సంగతి దేవుడెరుగు.. ఆ కమిటీ ఎలాంటి సూచనలూ చేయలేదు. ఎంటమాలజీ విభాగం వైఫల్యాన్ని మెజార్టీ సమావేశాల్లో ఎండగట్టారు. దోమలతో ప్రాణాలు పోతున్నాయని ఉదాహరణలతో సహా ఏకరువు పెట్టారు. అయినా పరిస్థితి మారలేదు. 'చర్యలు తీసుకుంటాం. మాతృ సంస్థలకు సరెండర్ చేస్తాం' అన్న సభ్యుల హెచ్చరికలనూ వారు ఖాతరు చేయలేదు. కౌన్సిల్

మిగతా 6వ పేజీలో..



రామంతాపూర్ డివిజన్ ఇందిరా నగర్‌లో రోడ్డుపై మురుగు

**అనారోగ్యానికి గురవుతున్నాం**



మా బస్తీలో చెత్త ఊడ్చిన దాఖలాలు ఉండడం లేదు. రోడ్లపైనే డ్రైనేజీ, మురుగునీరు ప్రవహిస్తోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అపరిశుభ్ర వాతావరణంతో అనారోగ్యానికి గురవుతున్నాం. సంపాదించిన దాంట్లో సగం ఆసుపత్రుల ఖర్చులకు వెచ్చించాల్సి వస్తోంది.

- నరసింహ, ఛత్రపతి శివాజీనగర్, ఎర్రగడ్డ.

**మారిన పదవులు.. 'మహా' వ్యూహాలు..!**

- నేడు జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం
- మేయర్, డిప్యూటీ మేయర్ పార్టీ మారిన నేపథ్యంలో ఆసక్తి

6



ఉప్పల్ పీహెచ్‌సీలో కలెక్టర్ గౌతమ్

### అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

ఉప్పల్, జూలై5(ఆంధ్రజ్యోతి): మలేరియా, డెంగీ కేసులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసదుపాయాల గురించి ఆరా తీశారు. అవసరమైన వైద్యపరికరాలను తక్షణమే సమకూర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీల సంఖ్య పెంచాలని అన్నారు. నాణ్యమైన వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం చూపించొద్దన్నారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌ఓ రఘునాథ స్వామి, డీసీహెచ్ కోటీనాయక్, వైద్యాధికారి సౌందర్యలత ఉన్నారు.

**గ్రాండ్ వెల్‌కమ్**





ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు హైదరాబాద్‌లో పెద్దఎత్తున స్వాగతం పలికారు. బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వరకూ భారీ ర్యాలీగా వెంట కదిలివచ్చారు. మరోవైపు టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు సొంతగడ్డ హైదరాబాద్‌పై అపూర్వ స్వాగతం లభించింది. శుక్రవారం సాయంత్రం నగరానికి విచ్చేసిన సిరాజ్‌కు శంషాబాద్ విమానాశ్రయం వద్ద అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలికారు.



## భారీ వర్షం

- రహదారులపై నిలిచిన వరదనీరు
- బండ్లగూడ ఇందిరానగర్‌లో 3.0 సెం.మీ
- మరో రెండు రోజులూ వర్షాలు

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అరగంటపాటు భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు చెట్లకొమ్మలు, కటౌట్లు విరిగి పడ్డాయి. బండ్లగూడ ఇందిరా నగర్‌లో 3.0, కాంచన్‌బాగ్‌లో 2.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, షేక్‌పేట, మాదాపూర్, యూసుఫ్‌గూడ, బండ్లగూడ, సరూర్‌నగర్, గచ్చిబౌలి,

మిగతా 6వ పేజీలో..

**పలు ప్రాంతాల్లో వర్షపాతం ఇలా..**

| ప్రాంతం | వర్షపాతం (సెం.మీ) |
| --- | --- |
| బండ్లగూడ - ఇందిరానగర్ | 3.0 |
| కాంచన్‌బాగ్ | 2.8 |
| కందికల్ గేట్ | 2.6 |
| చందులాల్ బారదరి | 2.6 |
| సరూర్‌నగర్ | 2.6 |
| ఎస్‌బీఐ కాలనీ | 2.5 |
| హఫీజ్‌పేట | 2.5 |
| చార్మినార్-ఫూల్‌బాగ్ | 2.5 |
| గచ్చిబౌలి | 2.4 |
| మాదాపూర్ | 2.4 |
| బోరబండ | 2.3 |
| రాజేంద్రనగర్ | 2.5 |

# ట్రాఫిక్ జాంఝాటం

- భారీ ర్యాలీలతో వాహనాల బారులు
- ఓ వైపు ఏపీ సీఎం చంద్రబాబు, మరోవైపు క్రికెటర్ సిరాజ్
- ర్యాలీలకు తోడైన వర్షంతో అస్తవ్యస్తం

హైదరాబాద్ సిటీ, జూలై5 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం సాయంత్రం పలు ప్రాంతాలు ట్రాఫిక్ జాంఝాటంగా మారాయి. ముఖ్యంగా సాయంత్రం వేళ నగరానికి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు రావడంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ చేపట్టారు. అదేవిధంగా ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ గెలుపులో భాగస్వామి అయిన హైదరాబాద్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు స్వాగతం తెలుపుతూ ర్యాలీ చేపట్టారు. నగరంలో రెండు భారీ ర్యాలీలు కావడంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ర్యాలీలకు తోడు సాయంత్రం వేళ నగరంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపైకి నీళ్లు చేరడంతో వాహనాలు నెమ్మదిగా కదలడంతో ట్రాఫిక్ తీవ్రతను మరింత పెంచింది.

### ఎయిర్‌పోర్టు నుంచి..

చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు బేగంపేట ఎయిర్‌పోర్టు వద్దకు టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా చేరారు. అక్కడి నుంచి కార్లు, బైకులతో ర్యాలీగా బేగంపేట ఫ్లైఓవర్, ప్రజాభవన్, పంజాగుట్ట, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1, కేబీఆర్ పార్కు వరకు సాగారు. బాబు రాక నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించి వాహనాలను దారి మళ్లించారు. దాంతో వివిధ ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తాయి.

### మెహిదీపట్నంలో..

క్రికెటర్ మహ్మద్ సిరాజ్ ర్యాలీ నేపథ్యంలో మెహిదీపట్నం ప్రాంతంలో పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. మాసబ్‌ట్యాంక్, బంజారాహిల్స్, లక్డీకాపూల్ ప్రాంతాలపై ట్రాఫిక్ ప్రభావం చూపింది. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై కూడా వాహనాలు బారులు తీరాయి. నగరంలో రెండు భారీ ర్యాలీలతో తలెత్తిన ట్రాఫిక్ ఇబ్బందులకు తోడు అదే సమయంలో భారీ వర్షం కురిసింది. దీంతో సాయంత్రం వేళ వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తాయి. రోడ్లపై నీరు చేరడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి.



మెహిదీపట్నంలో ట్రాఫిక్ జామ్

## సిరాజ్ రోడ్‌షోలో భారీగా ఫ్యాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): క్రికెటర్ సిరాజ్ మెహిదీపట్నంలోని సరోజిని దేవి కంటి ఆస్పత్రి నుంచి ఈద్గా మైదానం వరకు రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోలో భారీ ఎత్తున ఫ్యాన్స్ పాల్గొన్నారు. తొలుత జాతీయ జెండాను చేతబూని, అభిమానులకు అభివాదం చేయగా, ఆతర్వాత మువ్వన్నెల పతాకాన్ని శరీరానికి చుట్టుకొని, కొద్దిసేపు ఉద్వేగానికి లోనయ్యాడు. 'బడే మియా, హైదరాబాద్ పేస్ గన్' అంటూ అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆ ప్రాంతమంతా హోరెత్తించారు. డీజే సౌండ్స్, బ్యాండ్ మోత, బాణాసంచా వెలుగుజిలుగులు, అభిమానుల కోలాహలంతో మెహిదీపట్నమంతా సందడిగా మారిపోయింది. సిరాజ్‌కు స్వాగతం పలికేందుకు రోడ్డుకు ఇరువైపులా అభిమానులు బారులుతీరడంతో ఆ ప్రాంతమంతా జనసందోహంతో నిండిపోయింది. చిన్న, పెద్ద, ఆడ, మగ తారతమ్యం లేకుండా సిరాజ్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు సరైన రోప్ పార్టీని కూడా తొలుత ఏర్పాటు చేయలేదు. సాయంత్రం ఆరు గంటల తర్వాత అంతకంతకూ అభిమానులు పెరుగుతుండడంతో అప్పటికప్పుడు రోప్ పార్టీని తెప్పించినా, వాళ్లు ఫ్యాన్స్‌ను నియంత్రించలేక స్వల్పంగా లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది.

# మారిన పదవులు.. మహా వ్యూహాలు..!

● నేడు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ● మీటింగ్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ చర్చ
● మేయర్, డిప్యూటీ మేయర్ పార్టీ మారిన నేపథ్యంలో ఆసక్తి ● ప్రతిపక్షాలతో పోలిస్తే అధికార పార్టీ సంఖ్యాబలం తక్కువ




హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలల అనంతరం నేడు జరుగుతోన్న జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి పార్టీ మారిన నేపథ్యంలో మీటింగ్ నిర్వహణపై ఆసక్తి నెలకొంది. గత కౌన్సిల్ సమావేశం సమయంలో బీఆర్ఎస్‌లో ఉన్న విజయలక్ష్మి, శ్రీలతా రెడ్డిలు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. కౌన్సిల్‌లో అధికార పార్టీకి అంత బలం లేకపోవడం.. ప్రశ్నోత్తరాలపై చర్చ జరుగునున్న నేపథ్యంలో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలను వారు ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది. సాధారణంగా పార్లమెంట్, అసెంబ్లీల్లో అధికార పార్టీకి సంఖ్యాబలం ఎక్కువగా ఉంటోంది. ఈ క్రమంలో ప్రతిపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పి కొడుతారు. కానీ ఇక్కడ అందుకు భిన్నమైన పరిస్థితి. కాంగ్రెస్‌కు 19మంది సభ్యులుండగా.. బీఆర్ఎస్‌కు 47 మంది, ఎంఐఎంకు 42, బీజేపీ నుంచి 39 మంది సభ్యులు ఉన్నారు. గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలూ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా సమావేశానికి హాజరయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీ బలం మరింత పెరగనుంది. ఉదయం 10.30 గంటలకు సమావేశం మొదలుకానుంది.

### వ్యూహాలకు పదును..

ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా గతంలో ఎప్పుడూ లేని విధంగా సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ముందస్తుగా చర్చించాయి. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఉదయం గ్రేటర్‌లోని ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమావేశమయ్యారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం.. ప్రజా సమస్యల పరిష్కారంలో వైఫల్యంపై నిలదీయాలని నిర్ణయించారు. గత సర్కారు మంజూరు చేసిన పనుల రద్దుపైనా ప్రశ్నించనున్నారు. అదే సమయంలో పార్టీ మారిన విజయలక్ష్మి, శ్రీలతారెడ్డి పదవుల రాజీనామాకు పట్టుబట్టాలని.. అవసరమైతే సమావేశాన్ని స్తంభింపచేయాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్టు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో తాజ్‌కృష్ణ హోటల్‌లో కాంగ్రెస్ కార్పొరేటర్లతో మేయర్ అత్యవసరంగా సమావేశమయ్యారు. ప్రతిపక్ష పార్టీలను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలన్న దానిపై చర్చించారు. సభ్యులు పరిధి దాటి ప్రవర్తిస్తే కౌన్సిల్ నుంచి బయటకు పంపాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో నేటి మీటింగ్‌లో ప్రజాసమస్యలపై చర్చ జరుగుతుందా..? అర్ధాంతరంగా ముగుస్తుందా..? చూడాలి. ఇదిలా ఉంటే సమావేశానికి మూడు పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యే అవకాశముంది.





నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్‌వీ విద్యార్థి విభాగం, బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులు వేర్వేరుగా శుక్రవారం టీజీపీఎస్సీ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆందోళనకారులను బేగంబజార్ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

చార్మినార్ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులపై భారీగా వరద నీరు నిలిచిపోయింది. వర్షంతో ఐటీకారిడార్‌లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షంతో ఉప్పల్, రామంతాపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి. మరో రెండురోజులపాటు మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

## ప్రమాదంలో ప్రజారోగ్యం

(5వ పేజీ తరువాయి)

వరకే కార్పొరేటర్ల లొల్లి.. అంతకుమించి ఏం చేస్తారులే అన్న ధీమానో..? మీటింగ్‌లో ప్రశ్నిస్తారు.. పనుల కోసం వచ్చి విజ్ఞప్తి చేస్తారన్న భావనో కానీ.. అధికారులు కౌన్సిల్ ఆదేశాలను సీరియస్‌గా తీసుకోవడం లేదు. నేడు కౌన్సిల్ సమావేశం జరుగనున్న నేపథ్యంలో ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ జరుగుతుందా..? సమావేశంలో చేసిన తీర్మానాలు, తీసుకున్న నిర్ణయాలు ఇక ముందైనా అమలవుతాయా..? చూడాలి.

### దోమలతో చస్తున్నాం



అన్నానగర్, భవానీనగర్ ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. నాలాలో పూడికతీత పనులు చేపట్టలేదు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. డెంగీ కేసులు పెరిగాయంటున్నారు. ఈ దోమలను చూస్తే చాలా భయమేస్తోంది. సాయంత్రమైందంటే తలుపులు, కిటికీలు మూసుకోవాల్సిన పరిస్థితి.

- శ్రీలత, శ్రీనివాసనగర్

## నేడు క్యాపిటల్ ఫౌండేషన్ అవార్డుల ప్రదానం

● పాల్గొననున్న సీఎం రేవంత్, అటార్నీ జనరల్, హైకోర్టు సీజే

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక క్యాపిటల్ ఫౌండేషన్ వార్షికోపన్యాసం, అవార్డుల కార్యక్రమం శనివారం సాయంత్రం 4 గంటలకు శామీర్‌పేట్ నల్సార్ యూనివర్సిటీలో జరగనుంది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్, నల్సార్ చాన్స్‌లర్ జస్టిస్ అలోక్ అరాధే, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్, క్యాపిటల్ ఫౌండేషన్ సెక్రటరీ జనరల్ వినోద్ సేథి పాల్గొననున్నారు. 'టెక్నాలజీ, లా అండ్ హ్యూమానిటీ' అంశంపై అటార్నీ జనరల్ కీలక ప్రసంగం చేయనున్నారు. క్యాపిటల్ ఫౌండేషన్ రాజ్యాంగంపై రూపొందించిన కోర్సులు, పలు పుస్తకాలను సీఎం రేవంత్‌రెడ్డి సహా ఇతర ప్రముఖులు ఆవిష్కరిస్తారు.

## హైకోర్టుకు హాజరైన పెద్దఅంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్

● ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను నిరాకరిస్తుండడంపై ధర్మాసనం ఆగ్రహం

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పూర్తి వివరాలు సమర్పించినా ఎలాంటి వివాదాలు లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా తిరస్కరించిన పెద్దఅంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్ శుక్రవారం హైకోర్టు ఎదుట హాజరయ్యారు. ఇలా ఎందుకు చేస్తున్నారో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆయనకు ఆదేశాలు జారీచేసింది. జీవితాంతం కష్టపడి చిన్న చిన్న ప్లాట్లు కొనుగోలు చేసే పౌరులను రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కొర్రీలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. రిజిస్ట్రేషన్ చార్జీలతోపాటు కోర్టు ఖర్చులు, ఫీజులు భరించాల్సి రావడం బాధాకరమని పేర్కొంది. ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేస్తే రాష్ట్రం మొత్తానికి వర్తించేలా ఆదేశాలు జారీచేస్తామని పేర్కొంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్ పేటలోని 265, 256 తదితర సర్వే నెంబర్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించడంపై దాదాపు 23 పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఆగ్రహం వ్యక్తంచేసిన హైకోర్టు సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగత హాజరుకు ఆదేశించింది. దీంతో సంబంధిత అధికారి జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. కోర్టు తీర్పులను అర్థం చేసుకోకుండా మళ్లీ తాజా ఆర్డర్స్ తీసుకురావాలని చెబుతుండడంపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. తదుపరి విచారణను ఈనెల 9కి వాయిదా వేశారు.

## మైనర్ గర్భం తొలగించాలని హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఓ బాలిక గర్భం తొలగించాలని గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్, కింగ్‌కోఠి ప్రభుత్వాసుపత్రి డైరెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ - 1971 నిబంధనల ప్రకారం మైనర్ గర్భం తొలగించాలని విజ్ఞప్తి చేసినా గాంధీ ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆ బాలిక తల్లి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. గైనకాలజిస్టులతో మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి, వివరాలు సీల్డ్ కవర్‌లో సమర్పించాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు తొలుత ఆదేశాలు జారీచేసింది. ఆ నివేదికను పరిశీలించిన ధర్మాసనం గర్భస్రావానికి అనుమతి ఇచ్చింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలని, తల్లీ పిల్లల గుర్తింపును ఎక్కడా బయటపెట్టరాదని ఆదేశించింది.

## మంత్రుల ఆదాయపు పన్ను ప్రభుత్వం చెల్లించడమా?

● హైకోర్టులో పిటిషన్


హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులకు సంబంధించిన ఆదాయపు పన్నును ప్రభుత్వమే భరించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఫోరంఫర్ గుడ్ గవర్నెన్స్ స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్ దాఖలు చేసింది. 'ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్క్వాలిఫికేషన్ యాక్ట్- 1953' లోని సెక్షన్ 3 (4) ప్రకారం వారి ఆదాయపు పన్నును ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిబంధన రాజ్యాంగ వ్యతిరేకంగా ఉందని, దీనిని కొట్టేయాలని ప్రజాప్రయోజన వ్యాజ్యంలో కోరారు.


UNANIMOUS EPIC BLOCKBUSTER
విజయవంతమైన 2వ వారం
తగ్గించబడిన టికెట్ రేట్స్
మల్టీప్లెక్స్: 295/-, 350/-, సింగిల్ స్క్రీన్: 175/-, 110/-, 50/-




సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
తారకరామ 70 - కాచిగూడ 10.45,2.15,5.45,9.15
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ (3D) 11.00,2.30,6.00,9.30
మల్లిఖార్జున 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
భ్రమరాంబ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
తెలుగు 2D
తెలుగు 3D
హిందీ 3D
GLOBAL CINEMAS RELEASE

UNANIMOUS EPIC BLOCKBUSTER
విజయవంతమైన 2వ వారం




వరంగల్
నిజామాబాద్
ఆదిలాబాద్
మహబూబ్‌నగర్
ఖమ్మం
కరీంనగర్
నల్గొండ
మెదక్
రంగారెడ్డి
రాయచూర్

ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల




సుదర్శన్ 35ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GLOBAL CINEMAS RELEASE

ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల




దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
SUCHIN CINEMAS 9030161717

FAMILY ENTERTAINMENT విజయవంతమైన 3వ వారం




శ్రీరామ 70ఎంఎం ఎ/సి - వనపర్తి
భువనేశ్వరి 70ఎంఎం ఎ/సి - విజా
పరమేశ్వరి 70ఎంఎం ఎ/సి - కొత్తకోట
PARAM JYOTHI FILMS 9848028739

మనీ లాండరింగ్, డ్రగ్స్ కేసుల పేరుతో బెదిరించి

## రూ.12 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** మీ పేరున ఉన్న బ్యాంకు ఖాతాల ద్వారా విదేశాలకు అక్రమంగా డబ్బు తరలించారని బెదిరించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ.12 లక్షల కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి(23)కి ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ముంబై కొరియర్ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నాన్నాని చెప్పిన వ్యక్తి మీ పేరుతో ముంబై నుంచి సౌదీకి పంపిన కొరియర్‌లో 50 గ్రాముల ఎండీఎంఏ, 5 కిలోల డయాబెటిక్ టాబ్లెట్‌లు గుర్తించామని చెప్పాడు. దీనికి సంబంధించి ముంబై క్రైం బ్రాంచ్ అధికారులతో మాట్లాడాలంటూ కాల్ కలిపాడు. పోలీస్ డ్రస్‌లో ఉన్న సైబర్ నేరగాడు స్కైప్ కాల్‌లో బాధితుడితో మాట్లాడి ఆధార్, పాన్ ఇతర వివరాలు సేకరించాడు. మీపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసు నమోదైందని చెప్పాడు. అంతే కాకుండా ఆధార్‌కు లింక్ ఉన్న పలు బ్యాంకు ఖాతాల ద్వారా విదేశాలకు డబ్బు తరలిందని, దీనిపై మనీ లాండరింగ్ కేసు నమోదయ్యాయని బెదిరించాడు. ఆదాయం గురించి తెలపాలని ఆర్‌బీఐ వెరిఫికేషన్ కోసం సూచించిన ఖాతాలో రూ.12 లక్షలు (రీఫండబుల్ ఎమోంట్) జమ చేయాలని, లేని పక్షంలో అరెస్ట్ తప్పదని భయపెట్టాడు. సైబర్ నేరగాడి మాటలను నమ్మిన బాధితుడు అతడు సూచించిన బ్యాంకు ఖాతాకు రూ.12 లక్షలు బదిలీ చేశాడు. తర్వాత డబ్బు రాకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.


బంగారు బొమ్మ ఆల్బమ్‌ను విడుదల చేస్తున్న రచయిత చంద్రబోస్

## సంగీత ప్రియులను ఆకట్టుకొనే బంగారు బొమ్మ

**నార్సింగ్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** మణికొండలో బంగారపు బొమ్మ ఆల్బమ్‌ను ప్రముఖ సినీ గీత రచయిత చంద్రబోస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ ఇండిపెండెంట్ ఆల్బమ్‌లను సంగీత ప్రియులు ఆదరిస్తున్నారని ఆయన అన్నారు. బంగారు బొమ్మ విజువల్స్, కన్సెప్ట్ కళ్లు చెదిరేలా, మనస్సుకు హత్తుకునేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇది తప్పకుండా సంగీత ప్రియుల హృదయాలను గెలుచుకుంటుందని అన్నారు.



సర్వసభ్య సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు

## బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

**చాంద్రాయణగుట్ట, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భారతమాత దేవాలయం, కోట మైసమ్మ దేవాలయ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మని కైలాష్ గంగపుత్ర అన్నారు. బోనాలు సమీపిస్తున్న తరుణంలో శుక్రవారం ఆలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 19 నుంచి 29 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్. ఆనంద్‌రావు, ఉమ్మడి దేవాలయాల కమిటీ మాజీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, సలహాదారులు పాశం సురేందర్, కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ గిరి, సుమన్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కోశాధికారి బొడ్డు సాయిబాబా, రమేశ్, రాజు, రుషికేశ్, రాము, జానకిరామ్, రమేశ్ పాల్గొన్నారు.


వర్షపు నీటి ప్రవాహానికి కొట్టుకోపోయిన బ్రిడ్జిను చూపుతున్న స్థానికుడు

## బిందెనల్ల వాగుపై బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి

**పహాడిషరీఫ్ జూలై 5 (ఆంధ్రజ్యోతి):** బడంగ్ పేట్ కార్పొరేషన్ మామిడి పల్లిలోని బాలాజీ కాలనీ ప్రక్క నుంచి ప్రవహించే బిందెనల్ల వాగు మామిడిపల్లి నుంచి జల్‌పల్లికి వెళ్లే వాగుపై నిర్మించిన బ్రిడ్జి నాలుగు సంవత్సరాలు క్రితం వచ్చిన భారీ వర్షానికి కొట్టుక పోయింది. అప్పటినుంచి ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడినప్పుడు శంషాబాద్ ఎయిర్ పోర్ట్, మామిడిపల్లి వర్షపు నీరు మామిడిపల్లి నల్ల వాగు నుంచి జల్‌పల్లి చెరువులోకి వెలుతాయన్నారు. బిందెనల్ల వాగుపై తిరిగి బ్రిడ్జి నిర్మించాలని ప్రజా ప్రతినిధులకు అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్‌ను పరిశీలించిన ఆ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ శరత్

## విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

**రాజేంద్రనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్‌ను శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ ఎ.శరత్ తనిఖీ చేశారు. రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఐటీ, ఎన్‌ఐటీ, మెడిసిన్, ఇంటర్ ఫలితాలను, కళాశాల టైం టేబుల్‌ను ప్రిన్సిపాల్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించడానికి ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సరైన విదానంలో ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. డైనింగ్‌హాల్‌ను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హరితహారంలో బాగంగా మొక్కలు నాటారు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎ.శరత్, డిప్యూటీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచార యత్నం

**రాజేంద్రనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** బాలికపై శివరాంపల్లికి చెందిన ఓ యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన గురువారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఒకే ప్రాంతంలో ఉండే ఓ బాలిక, యువకుని మధ్య కొంతకాలంగా పరిచయం ఏర్పడింది. వాట్సాప్‌లో వారు చాటింగ్ కూడా చేసుకుంటున్నారు. గురువారం బాలికకు మాయమాటలు చెప్పి తమ ఇంటి సమీపంలో అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లైంగిక దాడి కేసులో వ్యక్తికి 10 సంవత్సరాల జైలు

**రాజేంద్రనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** పోక్సో కేసులో ఓ వ్యక్తికి రాజేంద్రనగర్ కోర్టు శుక్రవారం 10 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో శంషాబాద్‌కు చెందిన బాలికను జర్పుల శివ మోసం చేసి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో రాజేంద్రనగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.అంజనేయులు నేరం రుజువు కావడంతో ముద్దాయికి 10 సంవత్సరాల జైలు, రూ. 10 వేల జరిమానా విధించారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తమ వాదనలు వినిపించారు. తప్పుచేసే వారిపై చట్టం కఠిన చర్యలు తీసుకుంటుందని న్యాయమూర్తి పి.అంజనేయులు తెలిపారు.

# దోమలు బాబోయ్.. దోమలు!

- రోడ్లపై పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- ఇళ్లమధ్య నిలుస్తున్న మురుగునీరు
- కాలనీలలో విజృంభిస్తున్న దోమలు
- మొక్కుబడి చర్యలతో అధికారులు

**రాజేంద్రనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** అత్తాపూర్, హైదర్‌గూడ పరిసర బస్తీలలో దోమల బెడద విపరీతంగా ఉంది. ఈ ప్రాంతంలో మూసీ విస్తరించి ఉండటం, మూసీలోకి డ్రైనేజీ నీరు వదులుతుండటంతో అత్తాపూర్, హైదర్‌గూడ పరిసరాల నుంచి విస్తరించి ఉన్న మూసీనది పరిసర కాలనీలలో నివసించే ప్రజలు దోమలతో బాదపడుతున్నారు. తలుపులకు మెష్ డోర్లు పెట్టుకుంటే గాని ఇక్కడ ఉండలేని పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. బుద్వేల్ న్యూ గ్రీన్ సిటీ, బాగవతీగూడ, హైదర్‌గూడ పరిసర బస్తీలు, అత్తాపూర్‌లో దోమల బెడద కారణంగా ప్రజలు డెంగీ లాంటి వ్యాధుల బారిన పడుతున్నారు. మూసీని శుభ్రం చేస్తున్నప్పటికి రోజూ వచ్చే మురుగునీటితో దోమలు విపరీతంగా వృద్ధి చెంది ప్రజలను అనారోగ్యాల బారిన పడేస్తున్నాయి.

### కిషన్‌బాగ్, అసద్‌బాబానగర్‌లలో

**మదీన, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమల బెడద తీవ్రమైంది. బహదూర్‌పురాలోని కిషన్‌బాగ్, నందిముస్లైగూడ, అసద్‌బాబానగర్‌లలో దోమల బెడద ఎక్కువగా ఉంది. అసద్ బాబానగర్ కింది భాగంలో మూసీ నది ఉండడంతో పరిసర బస్తీలలో దోమలు ఎక్కువగా వృద్ధి చెందాయి. ఈ బస్తీలలో బల్దియా ప్రవేశపెట్టిన చెత్త సేకరణ వాహనాలు, రిక్షాలు ఇంటింటికి తిరగవు. తిరిగినా చాలా తక్కువ. దీంతో స్థానికులు చెత్తను రోడ్లపైన, ఎక్కడపడితే అక్కడే పడవేస్తున్నారు. దీంతో ఆ చెత్త పేరుకుపోతున్నది. ఇక్కడ కూడా దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమలు వృద్ధి చెందితే మలేరియా, డెంగీ, ఇతర వైరల్ ఫీవర్‌లు వ్యాపించే అవకాశముంది. అధికారులు ఈ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గౌలిపురా పోలీస్ ఔట్‌పోస్ట్ వద్ద పేరుకుపోయిన చెత్త

### దోమలు వృద్ధి చెందకుండా చర్యలు కరువు

**చాంద్రాయణగుట్ట, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ప్రస్తుతం వర్షాకాలం మొదలు కావడంతో దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మురికివాడలలో నివసించే ప్రజలు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో పేరుకుపోయిన చెత్తకుప్పలు తడిసి దుర్వాసన వెదజల్లే ప్రమాదముంది. పాతబస్తీలో ఉన్న మురికివాడల్లో దోమలు వ్యాప్తి చెందకుండా నియంత్రించేందుకు చేపట్టాల్సిన స్పెషల్ డ్రైవ్‌ను మునిసిపల్ అధికారులు ఏనాడో విస్మరించినట్లు కనబడుతోంది.

### కనిపించని ఫాగింగ్

దోమలు వ్యాప్తి చెందుతున్న బస్తీలలో సంబంధిత అధికారులు సాయంత్రం ఆరు తరువాత ఫాగింగ్ చేసేవారు. దీంతో రాత్రివేళల్లో కొంతమేరకు దోమల బెడద తప్పేది. ప్రస్తుతం అధికారులు ఫాగింగ్ చేస్తున్న సందర్భాలు కానరావడం లేదు. దీంతో అధికారుల తీరుపై బస్తీల ప్రజలు మండిపడుతున్నారు.


షేక్‌పేట్ మారుతీకాలనీ వద్ద రోడ్లుపై పడేసిన చెత్త

### కార్వాన్‌లో దుర్గంధం

**కార్వాన్, జూలై 5(ఆంధ్రజ్యోతి):** కార్వాన్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా దోమలు సమస్యల విపరీతంగా ఉంది. ఉదయం, సాయంత్రం, మధ్యాహ్నం తేడా లేకుండా దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శానిటేషన్ విభాగం అధికారులు పర్యవేక్షణ లోపం, చెత్త తరలించే కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం కారణంగా వీధుల వెంట చెత్త పెరిగిపోతుంది. మురికి కాలువాలు శుభ్రం చేయడం లేదు. కార్వాన్ నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్, కార్వాన్, లంగర్‌హౌజ్, గోల్కొండ, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్, మారుతీనగర్, వినోబానగర్, వినాయక్ నగర్ ప్రాంతాల్లో చెత్త దర్శనమిస్తుంది. చెత్త రిక్షాల సిబ్బంది దుకాణాలు, రోడ్లపై చెత్తను తొలగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇళ్లకు రాకపోవడంతో జనాలు రోడ్లపై చెత్త పడేస్తున్నారు.

### పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**గోషామహల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దాబాలపై పాత వస్తువుల్లో నీరు నిలువ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచినప్పుడే దోమల నివారణ సాధ్యమవుతుందని జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ అన్నారు. శుక్రవారం జాంబాగ్‌లోని జీహెచ్‌ఎంసీ, వీవీ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో దోమల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి రాకేశ్ జైస్వాల్ హాజరై మాట్లాడుతూ... ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎల్లప్పుడు రోడ్లపై చెత్త చెదారం తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో రేణుక, డాక్టర్ సుభాష్, రామకృష్ణ, దిలీప్ రాజశేఖర్, ప్రవీణ్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


అత్తాపూర్ వద్ద విస్తరించిన మూసీ నది


దోమల నివారణపై అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్

# ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

- ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

**బర్కత్‌పుర, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** వైద్యులు, సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించి ప్రమాదాలను నివారించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రై నింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్యులు ప్రమాదాలను నివారించడంలో ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని హోప్ ఆస్పత్రి వైద్య సిబ్బందికి ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. రెడ్ సిగ్నల్ పడినప్పుడు వాహనాలను ఆపే ఓపిక కొంత మందికి లేదని, దీని వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. 2022లో హైదరాబాద్‌లో 42 వేల 261 సిగ్నల్ జంపింగ్ కేసులు, 2023లో 65 వేల 413 సిగ్నల్ జంపింగ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5 వేల జరిమానా 3 నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ సంవత్సరం జూలై 3వ తేదీ నాటికి 3 వేల 300 మంది డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి బేగంపేటలో కౌన్సిలింగ్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హోప్ ఆస్పత్రి ఎండీ మదన్‌మోహన్, వైస్ ప్రెసిడెంట్ భవానీ తదితరులు పాల్గొన్నారు.


హోప్ ఆస్పత్రి సిబ్బందికి ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు


విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్

### విద్యార్థులకు అవగాహన

**చార్మినార్ జూలై 5 (ఆంధ్రజ్యోతి) :** వేగంగా ప్రయాణించడం కన్నా సురక్షితంగ తమ గమ్యం చేరుకోవం చాలా ముఖ్యమని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ అన్నారు. శుక్రవారం పాతబస్తీ పురాని హవేలిలోని ముక్రమ్ జా స్కూల్‌లో రోడ్డు ప్రమాదాలు.. నివారణ అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ద్యార్థులు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు.. నివారణ పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వాహనం నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ వాదే, ముదశిర్, మీర్ చౌక్ ట్రాఫిక్ ఎస్ఐ అమరనాథ్ రెడ్డి, సిబంది మొహమ్మద్ అయాన్, కృష్ణ, అరువందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న మధుసూదనాచారి

## ఆంగ్లనాటక స్థాయిలో ఇనాక్ నాటకాలు

**చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ఇనాక్ తెలుగు నాటకాలు షేక్స్పియర్ ఆంగ్లనాటక స్థాయిలో ఉంటాయని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహంలో భాగంగా ఇనాక్ నాటక రచనపై ప్రసంగ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. మధుసూదనాచారి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా ప్రతికూల వాతావరణంలో తనను తాను తీర్చిదిద్దుకున్న శిల్పి ఇనాక్ అని అన్నారు. ప్రముఖ నాటక రచయిత ప్రయోక్త పాటిబండ్ల ఆనందరావు కీలకప్రసంగం చేస్తూ వర్తమాన సమాజానికి దారి, దీపం చూపని రచనలు వ్యర్థం అన్న ఆలోచన ఇనాక్ తన ప్రతి నాటకంలో నిర్భయంగా తెలిపారని విశ్లేషించారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డా.నాళేశ్వరం శంకరం మాట్లాడారు. గానసభ కార్యవర్గసభ్యులు జంగంరావుగౌడ్, ప్రసాద్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. మల్లాదిఉష బృందం త్యాగరాజ స్వామి కీర్తనల గోష్ఠి గానం నిర్వహించారు.

## 'గ్రోయి ఎక్స్' అప్లికేషన్ అందుబాటులోకి

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** కృత్రిమ మేధ వినియోగించి పంటలకు వచ్చే తెగులు, చీడపీడలతోపాటు వచ్చే వ్యాధులను కచ్చితంగా గుర్తించడం, వాతావరణ వివరాలను అందించే 'గ్రోయి ఎక్స్' అప్లికేషన్‌ను గ్రోవిరో సంస్థ అందుబాటులోకి తెచ్చింది. గ్రోవిరో సంస్థ ఎండీ దేవేంద్ర దాసరి అప్లికేషన్‌ను ప్రారంభించారు. అప్లికేషన్ సాయంతో వ్యవసాయం, వాతావరణ మార్పుల సవాళ్లను సమర్థవంతంగా అంచనా వేయగలమని చెప్పారు. ఉపగ్రహం నుంచి అందిన సమాచారంతో పంటలకు నీటి అవసరాన్ని 50 శాతం తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్ మేనేజర్ తరుణ్ పాంటాతోపాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


హరితహారం కార్యక్రమంలో ఏసీపీ తుల శ్రీనివాస్

## విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

**రాజేంద్రనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో శుక్రవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ పాల్గొని విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను పెంచేలా విద్యార్థులు చొరవ తీసుకోవాలన్నారు. చెట్లతో అనేక ఉపయోగాలు ఉంటాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పుష్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్టార్ కార్పొరేట్ క్లినిక్ ప్రారంభం

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** కార్పొరేట్ ఉద్యోగులకు వైద్యసేవలు అందించడానికి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆస్పత్రిలో వేవ్‌రాక్ సెజ్‌తో భాగస్వామ్యంగా కలిసి వేవ్‌రాక్ ఫెసిలిటీలో స్టార్ కార్పొరేట్ క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. స్టార్ ట్రామా యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్ మద్దతుతో సమగ్ర వైద్య సేవలను అందిస్తుందని, అన్ని రకాల అత్యవసర పరిస్థితులకు తక్షణ సహాయాన్ని పొందచ్చునని తెలిపారు. అత్యవసర సేవల కోసం బాధితులు 9071104108 నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐ బిజినెస్ పార్క్స్ (హైదరాబాద్) ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ హెడ్ కల్నల్ సంజయ్ భరద్వాజ్, స్టార్ ఆస్పత్రి గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ మెదక్కర్, వాకా భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.


వేవ్రాక్ ఫెసిలిటీలో స్టార్ కార్పొరేట్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం



పురస్కారాలను ప్రదానం చేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

## రావూరి భరద్వాజ, కాంతమ్మ స్మారకపురస్కారాల ప్రదానం

**చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్‌కు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం, ప్రముఖ గాయని డి.సురేఖామూర్తికి రావూరి కాంతమ్మ స్మారక సంగీత సేవా పురస్కారం ప్రదానం చేశారు. శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి బహూకరించి ప్రశంసించారు. అనంతరం జస్టిస్ శేషశయనారెడ్డి మాట్లాడుతూ రావూరి భరద్వాజ సాహితీసేవలు విలువైనవన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె. చెన్నయ్య, రావూరి వెంకట కోటేశ్వరరావు, సైదులు పాల్గొన్నారు.

## రేపు ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో రథయాత్ర

**గోషామహల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఆదివారం రథయాత్ర నిర్వహిస్తున్నామని... ఈ రథయాత్రకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై ప్రారంభిస్తారని ఇస్కాన్ దేవాలయం మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సభ్యులు వేదాంత చైతన్యదాస్ అన్నారు. శుక్రవారం అబిడ్స్‌లోని ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాత్ర 7వ తేదీన ఎన్టీఆర్ స్టేడియం నుంచి 11.30 గంటలకు రథయాత్ర ప్రారంభమవుతుందని జీపీఓ, ఎంజే మార్కెట్, గాంధీభవన్ మీదుగా సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కచేరి, మహా హారతి ఉంటుందని, ఊరేగింపులో లక్షకు పైగా భక్తులు పాల్గొంటారని తెలిపారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/l6o7kbN లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/ set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

## ఫ్లోరింగ్ క్లీన్.. లిఫ్ట్ ఆన్

- కలెక్టరేట్‌లో కనిపించిన స్వచ్ఛత

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** కలెక్టరేట్‌లో పరిసరాలు పరిశుభ్రమయ్యాయి. ఫ్లోరింగ్‌పై పేరుకుపోయిన దుమ్ము, ధూళిని తొలగించారు. నాలుగు రోజులుగా ఆగిపోయిన లిఫ్ట్ ఎట్టకేలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో అధికారులు, ఉద్యోగులు, సీనియర్ సిటీజన్లు, సాధారణ ప్రజలు సంతోషపడ్డారు. కలెక్టరేట్‌లోని స్నేహ సిల్వర్‌జూబ్లీ భవనం నిర్వహణ అధ్వానంగా మారడంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో క్లీనింగ్ చేయరు..! లిఫ్ట్ పనిచేయదు..!! అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టరేట్‌లోని పరిపాలన విభాగం అధికారులు స్పందించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రత్యేక సిబ్బందితో భవనం పరిసరాలను, మెట్లను శుభ్రం చేయించారు. ఫ్లోరింగ్‌పై పేరుకుపోయిన దుమ్ము, పావురాల వ్యర్థాలను తొలగించారు. ప్రధానంగా లిఫ్ట్‌కు మరమ్మతు చేయించి మధ్యాహ్నం వరకు అందుబాటులోకి తీసుకురావడంతో ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చిన పౌరులు సాఫీగా వెళ్లారు. నిన్న, మొన్నటి వరకు వాటర్‌క్యాన్లు లేకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడిన ఉద్యోగులు శుక్రవారం లిఫ్ట్ పనిచేయడంతో తెప్పించుకున్నారు. కాగా, భవన నిర్వహణ పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'ఆంధ్రజ్యోతి'కి అధికారులు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.


వినియోగంలోకి వచ్చిన లిఫ్ట్


హనుమాన్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న జలమండలి అధికారులు

## బస్తీలో పర్యటించిన అధికారులు

**చాంద్రాయణగుట్ట, జులై 5 (ఆంధ్రజ్యోతి):** పాతబస్తీ హనుమాన్ నగర్‌లో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన వాటర్‌వర్క్స్ జీఎం సంతోష్ కుమార్, ఆలియాబాద్ డీజీఎం విద్యాసాగర్‌లు హనుమాన్‌నగర్ బస్తీలో పర్యటించి సమస్యను తెలుసుకున్నారు. మురుగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తేవాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మేనేజర్ ముకర్రం బాబా, రమేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సర్వేశ్, రవి పాల్గొన్నారు.


జోషివాడిలో అమ్మవారి దేవాలయం వద్ద బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు కోటి శైలేష్

## ఆలయం వద్ద బీటీ రోడ్డు పనులు ప్రారంభం

**గోషామహల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** గోషామహల్‌లో త్వరలో జరగబోయే బోనాల ఉత్సవాల సందర్భంగా జోషివాడి ఆర్య సమాజ్ వద్ద ఉన్న అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది రోడ్లకు మరమ్మతులు చేశారు. శుక్రవారం గోషామహల్ బీఆర్ఎస్ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి శైలేష్ బీటీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. పలు ఆలయాల వద్ద బీటీ రోడ్లు వేయడంతో పేరుకుపోయిన చెత్తకుప్పలు, మట్టి దిబ్బలను తొలగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.


ఇమ్లిబన్ గోశాలలో తెలంగాణ కాంగ్రెస్ టీపీసీసీ సెక్రటరీ మనీలాల్ షా, విశాల్ షా, గజానందల ఆధ్వర్యంలో గోమాతలకు పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో గోమాత నిషేధ చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు.
-గోషామహల్, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389
కె. అనిల్ కుమార్: 99854 03628

## ఏసీబీ దాడిలో ఏఈ పట్టివేత


ఏఈ బల్వంత్‌రెడ్డి

**రాజేంద్రనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ ముజాహిద్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ బృందం ఈ దాడిలో పాల్గొన్నారు. ఓ వ్యక్తి నుంచి రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఇంజనీరింగ్ విభాగం ఏఈ బల్వంత్‌రెడ్డిని రెండ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బండ్లగూడ ఖాళీమందిర్ ప్రాంతంలో నివాసం ఉండే ఏఈ బల్వంత్‌రెడ్డి గతంలో హౌసింగ్ కార్పొరేషన్‌లో పనిచేసేవారు. హౌసింగ్ కార్పొరేషన్‌ను గత ప్రభుత్వం రద్దు చేశాక బల్వంత్‌రెడ్డి రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఏఈగా చేరారు. మైలార్ దేవుపల్లి డివిజన్ ఆరాంఘర్ ఆదర్శకాలనీలో సంతోష్‌నగర్‌కు చెందిన ముజఫరుద్దీన్ రూ.6 లక్షల విలువ చేసే సీసీ రోడ్డు వేశారు. దానికిగాను రూ. 5 లక్షలకు మంజూరీ లభించింది. ఈ మొత్తం ఇవ్వడంతో పాటు మిగిలిన లక్ష రూపాయలకు కూడా బిల్లు కావాలని కోరగా, అందుకు రూ. 24 వేలు ఇవ్వాలని ఏఈ బల్వంత్‌రెడ్డి చెప్పారు. ముజఫరుద్దీన్ బేరమాడి రూ. 15 వేలు ఇచ్చేందుకు ఒప్పుకొన్నాడు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏఈ బల్వంత్‌రెడ్డికి రూ. 15 వేలు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ ముజాహిద్ అలీఖాన్, ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## తగ్గిన రిజిస్ట్రేషన్లు.. పెరిగిన ఆదాయం

● గతేడాది జూన్‌తో పోల్చితే స్వల్పంగా పెరుగుదల

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** గ్రేటర్ పరిధిలో రిజిస్ట్రేషన్ల ఆదాయం స్థిరంగా కొనసాగుతోంది. గతేడాది జూన్‌తో పోల్చితే ఈ ఏడాది జూన్‌లో సుమారు రూ.13.31కోట్ల మేర అదనపు ఆదాయం వచ్చిందని రిజిస్ట్రేషన్ల వర్గాలంటున్నాయి. అయితే, రిజిస్ట్రేషన్ల సంఖ్యలో మాత్రం గతేడాది జూన్‌తో పోల్చితే ఈ ఏడాది జూన్‌లో కాస్త తగ్గినట్లుగానే కనిపిస్తున్నాయి. గతేడాది జూన్‌లో మొత్తం 40 వేల 367 రిజిస్ట్రేషన్లు కాగా, రూ.695.48 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో 39 వేల 411 రిజిస్ట్రేషన్లకుగాను రూ.708.79 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గ్రేటర్ పరిధిలో రిజిస్ట్రేషన్ల శాఖకు 4 జిల్లాలు ఉండగా, వీటిలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లా నుంచి గత జూన్‌లో 368 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ తర్వాత మేడ్చల్ నుంచి రూ.210.32 కోట్లు, హైదరాబాద్ సౌత్ నుంచి రూ.91.06 కోట్లు, అత్యల్పంగా హైదరాబాద్ జిల్లా నుంచి రూ.39.38 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా, గ్రేటర్‌వ్యాప్తంగా మొత్తం రిజిస్ట్రేషన్ అయిన 39,411 డాక్యుమెంట్లలో సగానికి(21,099)పైగా రంగారెడ్డి జిల్లా నుంచే ఉండడం విశేషం.


కులాంతర వివాహ జంటకు చెక్కు అందజేస్తున్న అధికారులు

## కులాంతర వివాహితులు ఆదర్శంగా నిలవాలి

● అదనపు కలెక్టర్(రెవెన్యూ) వెంకటాచారి

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** కులాంతర వివాహాలు చేసుకున్న జంటలు సమాజంలో ఆదర్శంగా నిలవాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వెంకటాచారి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కులాంతర వివాహాలు చేసుకున్న 33 జంటలకు శుక్రవారం ప్రోత్సాహక బహుమతి కింద ఒక్కొక్కరికి రూ. 2.50 లక్షల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ సమస్యలను సమష్టిగా ఎదుర్కొని ధైర్యంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) కదిరవన్, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి పెరిక యాదయ్య, చార్మినార్ ఏఎస్‌డబ్ల్యూఓ గట్టుమల్లు, శ్రీనివాస్‌బాబు, అరవింద్ మూర్తి, శ్రీశైలం, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


మహిళల రక్షణపై బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బుర్రా వెంకటేశం, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

## నగరాన్ని సురక్షితంగా మార్చుదాం

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** మహిళలు, బాలికలపై దాడులను, వేధింపులను నిరోధించడం ద్వారా హైదరాబాద్‌ను దేశంలోనే సురక్షిత నగరంగా మార్చాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉమెన్, చైల్డ్ సేఫ్టీ వింగ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎస్ఎస్ఎస్ కేడెట్ల అవగాహన సదస్సులో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థులకు పిల్లలపై వేధింపులు, డ్రగ్స్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు, స్పై కెమెరాలను గుర్తించడం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లోనూ, మాల్స్‌లోనూ మహిళలకు రక్షణగా షీ టీమ్స్ అందుబాటులో ఉంచామన్నారు. శిక్షణ పొందిన ఎస్ఎస్ఎస్ అభ్యర్థులు ఆయా ప్రాంతాల్లో విద్యార్థులకు, మహిళలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైం డీసీపీ కవిత దారతోపాటు పలువురు అధికారులు, ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్ అభ్యర్థులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్లు ప్రజల మన్ననలు పొందాలి

● బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

**బర్కత్‌పుర, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్పొరేటర్లు పని చేయాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ప్రజలతో నిత్యం సంబంధాలు పెంపొందించుకుంటూ వారి మన్ననలు పొందాలని సూచించారు. జీహెచ్‌ఎంసీకి ఎప్పుడు ఎన్నికలు జరిగినా కమలం జెండా ఎగిరి తీరాలని పిలుపునిచ్చారు. శుక్రవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో బీజేపీ గ్రేటర్ కార్పొరేటర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణ్ మాట్లాడుతూ 2020 ఎన్నికల్లో బీజేపీ 48 డివిజన్లను కైవసం చేసుకుందని, అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని వంద స్థానాల్లో విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

నెలాఖరు వరకు

## మేడ్చల్-సికింద్రాబాద్ మధ్య 8 ఎంఎంటీఎస్‌లు రద్దు

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** గ్రేటర్ పరిధిలోని లింగంపల్లి-మేడ్చల్, మేడ్చల్-సికింద్రాబాద్ మార్గాల్లో నడిచే 8 ఎంఎంటీఎస్ సర్వీసులను సోమవారం నుంచి ఈ నెల 31 వరకు రద్దు చేసినట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి 6 వరకు ఈ మార్గాల్లో ఇవే ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దు చేసిన రైల్వే అధికారులు, తాజాగా మరోమారు నెలాఖరు వరకు రద్దు చేయడంపై ప్రయాణీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతి చవకైన ప్రయాణాన్ని నగరంలోని పేదలకు దూరం చేస్తున్నారని ఆరోపించారు.

# పోలీసుల అదుపులో పార్థీ గ్యాంగ్

- విజయవాడ-హైదరాబాద్ హైవేపై దారిదోపిడీల ముఠా
- వరుస ఘటనలతో అప్రమత్తమైన నల్లగొండ జిల్లా పోలీసులు
- ఎస్పీ శరత్‌చంద్రపవార్ నేతృత్వంలో ప్రత్యేక బృందం
- కొత్తగూడెం వద్ద ఇద్దరి అరెస్ట్
- కత్తులతో ఎదురుదాడికి దిగడంతో గాల్లోకి కాల్పులు
- నల్లగొండలో నిందితుల విచారణ


పార్థీ గ్యాంగ్ సభ్యులు

**అబ్దుల్లాపూర్‌మెట్/నల్లగొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** శివారు ప్రాంతంలో ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడడం, అవసరమైతే ఒంటరిగా ఉన్న వారిని హత్య చేసే నేర ప్రవృత్తి ఉన్న మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ఇద్దరు పార్థీ గ్యాంగ్ ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం రాత్రి చిట్యాల శివారులో దోపిడీ చేసేందుకు వచ్చిన వారికి పోలీసులు కంటపడడంతో హైదరాబాద్ వైపు వాహనంలో పరారయ్యారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం వద్ద ఓ ఆటో ఎక్కి ఎల్‌బీనగర్ వైపు వెళ్తుండగా, పెద్దఅంబర్‌పేట రింగ్ రోడ్డు వద్ద ప్రయాణికురాలు దిగే ప్రయత్నంలో నల్లగొండ జిల్లా పోలీసులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో నిందితులు కత్తులతో దాడి చేసే ప్రయత్నంలో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు.

### దోపిడీకి వచ్చి పోలీసులకు చిక్కి..

నల్లగొండ జిల్లా చిట్యాల పరిసరాల్లో దోపిడీ చేసేందుకు వచ్చిన పార్థీ గ్యాంగ్ ముఠా పోలీసులను చూసి పరారైంది. ఈ క్రమంలో వాహనంలో పారిపోతుండడంతో పోలీసులు ఆ వాహనాన్ని వెంబడించారు. చివరకు హైదరాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద పార్థీగ్యాంగ్ వెళ్తున్న వాహనాన్ని పోలీసులు అటకాయించారు. దీంతో వాహనాన్ని నిలిపిన నిందితులు పరారయ్యే ప్రయత్నం చేయడంతో పాటు పోలీసులపై కత్తులతో దాడికి యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు ఆత్మరక్షణ కోసం గాల్లోకి కాల్పులు జరపడంతో పాటు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ గ్యాంగ్‌పై పదుల సంఖ్యలో కేసులు నమోదైనట్లు సమాచారం.

### దేవలమ్మనాగారంలో చోరీ

యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన వరకాంతం బాలమ్మ(55) హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కుమారుడి ఇంటికి వెళ్లింది. ఇంటికి సమీపంలో ఉన్న పడమటి మహేష్‌రెడ్డి శుక్రవారం ఉదయం ఇంటి ముందు నుంచి వెళ్తుండగా తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే బాలమ్మ కుమారుడు సందీప్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఉదయం 9 గంటలకు బాలమ్మ ఇంటికి వెళ్లి చూసేసరికి బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న తులం బంగారు అభరణం, రూ.20వేల నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. ఇక్కడ నుంచి పరారైన దొంగలు ఎల్‌బీనగర్ వైపు పారిపోయారు.

### పక్కా సమాచారంతో..

పార్థీ గ్యాంగ్ దొంగలు హైదరాబాద్ శివారులో ఉన్నట్లు తెలుసుకున్న నల్గొండ సీసీఎస్ పోలీసులు అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం ఇచ్చారు. దీంతో గురువారం రాత్రి ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వాహన తనిఖీలతో పాటు పెట్రోలింగ్, హోటల్, లాడ్జీలలో తనిఖీలు చేసినట్లు సమాచారం. పార్థీ గ్యాంగ్ దొంగలు నగర శివారు కొత్తగూడెంలో ఉన్నట్లు పక్కా సమాచారం అందుకున్న సీసీఎస్ పోలీసులు వారిని పట్టుకునేందుకు అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ పోలీసుల సహకారం కోరారు.

### ఆటో ఎక్కినప్పటి నుంచి వెంబడిస్తూ..

గ్యాంగ్‌లోని ఇద్దరు దొంగలు బాటసింగారం కొత్తగూడెం వద్ద శుక్రవారం ఉదయం 8.45 గంటలకు చౌటుప్పల్ నుంచి నగరానికి వస్తున్న టాటా ఏస్ ఆటోలో ఎల్‌బీనగర్‌కు వెళ్లాలని ఎక్కారు. అప్పటికే అక్కడ నల్గొండ సీసీఎస్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు వారిని గమనించారు. అక్కడి నుంచి వారు ఓ కారులో ఆటోను వెంబడిస్తూ వస్తున్నారు. ఆటో రామోజీఫిల్మ్ సిటీ ప్రధాన గేటు దాటగానే జాతీయ రహదారిపై నగరం వైపునకు వెళ్లే ఇతర వాహనాలను పోలీసులు కొద్దిసేపు నిలిపేశారు. 9 గంటలకు ఆటో పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ సమీపానికి చేరుకుంది. సంపూర్ణ హోటల్ ఎదురుగా జాతీయ రహదారిపై ఆటోలో ఉన్న మహిళ దిగుతాననడంతో డ్రైవర్ ఆటోను స్లో చేశాడు. ఆ వెంటనే కారులో ఉన్న ఇద్దరు సీసీఎస్ పోలీసులు దిగి ఆటో ముందు, వెనక సీట్లో కూర్చున్న ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. దీంతో వారు తప్పించుకునే ప్రయత్నం చేస్తుండడంతో ఓ కానిస్టేబుల్ తన వద్ద ఉన్న పిస్తోల్‌తో ఒక రౌండు గాల్లోకి కాల్పులు జరిపాడు. వెంటనే ఇద్దరిని పట్టుకుని చేతులకు బేడీలను వేశారు. గ్యాంగ్‌లో మొత్తం ముగ్గురు దొంగలు ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరో వ్యక్తి ఎక్కడికి వెళ్లాడనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

### నలుగురు అదుపులో ఉన్నారు

జిల్లాలో జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో పార్థీ గ్యాంగ్‌కు సంబంధించిన నలుగురు నిందితులు అదుపులో ఉన్నారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని పూర్తి విచారణ చేస్తున్నాం. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం.

\- శరత్‌చంద్రపవార్, నల్లగొండ ఎస్పీ

### గత సంఘటనలతో భయం..

- మే 18వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రు మండలం చట్టవారిపురం గ్రామానికి చెందిన రాజవర్ధన్‌ను కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం వద్ద కొందరు వ్యక్తుల కాళ్లకు తాళ్లు కట్టి హత్య చేసి పరారయ్యారు.
- జూన్ నెలాఖరులో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై నల్లగొండకు వస్తున్న సమయంలో నార్కట్‌పల్లి వద్ద ఇద్దరు దుండగులు ఆ వ్యక్తి వాహనాన్ని ఆపి చితకబాదడంతో పాటు సుమారు రూ.2,500ను ఎత్తుకెళ్లారు.
- రెండు నెలల క్రితం హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు ఆర్టీసీ బస్సులో వెళ్తున్న ఓ మహిళను నార్కట్‌పల్లి బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పరిచయం చేసుకుని ఆమె వద్ద ఉన్న 8తులాల బంగారు గొలుసును లాక్కుని పరారీ అయ్యారు.
- ఆరు నెలల క్రితం నార్కట్‌పల్లి శివారులో ఉన్న హోటల్ వద్ద ఆగి ఉన్న బస్సులో ప్రయాణికుల నుంచి కిలో బంగారం ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనకు కొన్నిరోజుల ముందు మరో వ్యక్తి నుంచి రూ.50 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు కూడా వెళ్లాయి.
- జూన్ రెండో వారంలో చిట్యాల మండలం చిన్నకాపర్తి సమీపంలో ఏపీ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న ఓ కుటుంబ సభ్యులు విశ్రాంతి కోసం పార్కింగ్ చేసి నిద్రపోయారు. తెల్లవారుజామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వారిని చితకబాది 8 తులాలకు పైగా బంగారాన్ని ఎత్తుకెళ్లారు.

### ఎవరీ పార్థీ గ్యాంగ్..

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై రెండు నెలలుగా డీజిల్ చోరీలు, ప్రయాణికుల దారిదోపిడీ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. జూన్ 9వ తేదీన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి సమీపంలో ఏపీ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న ఓ కుటుంబం విశ్రాంతి కోసం వాహనాన్ని రహదారి పక్కన పార్కింగ్ చేసి నిద్రపోయారు. తెల్లవారుజామున కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వారిని చితకబాది 8తులాలకు పైగా బంగారాన్ని ఎత్తుకెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆధ్వర్యంలో మహారాష్ట్రకు చెందిన ఈ పార్థీ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు స్పెషల్ ఆపరేషన్ టీం రంగంలోకి దిగింది. హైదరాబాద్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ గ్యాంగ్ ప్రజలను గడగడలాడిస్తూ దోపిడీలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ సిలబస్ చేపట్టాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ సిలబస్ ప్రకారం నెలవారీ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం గోల్కొండ మండలంలోని బాపూనగర్ మందిర్‌బస్తీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలు నిర్వహించే విషయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలను బలోపేతం చేసేలా శిక్షణ, సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేంద్రం వద్ద ఉన్న టాయిలెట్ల మరమ్మతుకు ఎస్టిమేషన్ ఇవ్వాలని, వీలైన చోట్ల ఆధార్ క్యాంపులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి అక్కేశ్వర్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విద్య, అంగన్‌వాడీ కార్యకర్త జయంతిరాణి తదితరులు పాల్గొన్నారు.

### బోనాలను ఘనంగా నిర్వహించాలి

నగరంలో ఆషాఢమాసం బోనాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం గోల్కొండ కోటలోని ఎల్లమ్మ(జగదాంబిక) ఆలయాన్ని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7న గోల్కొండ కోటలో తొలి పూజ ప్రారంభమవుతున్నందున భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### కొత్త వారికి 'గృహజ్యోతి' ఎప్పుడో..!

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** తెల్లరేషన్ కార్డు ఉండి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకంతో జీరో బిల్లు అందుబాటులోకి తెచ్చింది. గ్రేటర్‌జోన్ 10 సర్కిళ్లలో వేలమందికి అర్హత ఉన్నా గృహజ్యోతి పథకం రావడం లేదంటూ వినియోగదారులు విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గృహజ్యోతి లబ్ధిదారుల వివరాల నమోదులో తప్పుల కారణంగా పలువురికి జీరో బిల్లులు రావడం లేదు. ప్రజపాలన దరఖాస్తు నంబర్, తెల్లరేషన్ కార్డు నంబర్, కరెంట్ బిల్లుతో విద్యుత్ కార్యాలయాలకు వెళ్తే జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాలకు వెళ్లాలని చెబుతున్నారని అక్కడకు వెళ్తే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలంటున్నారంటూ యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌కు చెందిన నాగరాజు తెలిపారు. తమకు అన్ని అర్హతలున్నా నాలుగు నెలలుగా జీరో బిల్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్ జోన్‌లో ఇప్పటి వరకు 7.5 లక్షల మంది గృహజ్యోతి కింద లబ్ధి పొందుతున్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే మరో 2-3 లక్షలమంది పెరిగే అవకాశముంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## డ్రగ్ టెస్ట్.. ఇద్దరు జూనియర్ వైద్యులకు పాజిటివ్

● గంజాయి కొనుగోలు చేస్తుండగా అరెస్ట్ చేసిన పోలీసులు


పట్టుబడిన ఇద్దరు జూనియర్ వైద్యులు

**హైదరాబాద్ సిటీ/మంగళ్‌హాట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** జూనియర్ వైద్యులకు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితోపాటు అతడి వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్న ఇద్దరు జూనియర్ వైద్యులను టీజీన్యాబ్, సుల్తాన్‌బజార్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. ధూల్‌పేట జాలీహనుమాన్ ప్రాంతానికి చెందిన సురేష్‌సింగ్ అలియాస్ టింకూసింగ్(38) 2016 నుంచి గంజాయి దందా చేస్తున్నాడు. ఇతడిపై ధూల్‌పేట ఎక్సైజ్, మంగళ్‌హాట్, టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లలో ఐదు కేసులు నమోదయ్యాయి. రెండేళ్లుగా ధూల్‌పేటకు చెందిన దినేష్‌సింగ్, పంకజ్‌సింగ్‌ల వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి, చిన్న పాకెట్లలో ప్యాక్ చేసి జూనియర్ వైద్యులకు విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారమందుకున్న టీజీన్యాబ్ పోలీసులు శుక్రవారం గంజాయి విక్రయించేందుకు కోఠి ప్రాంతానికి వచ్చిన సురేష్‌సింగ్‌పై నిఘా పెట్టారు. ఈ సమయంలో సురేష్‌సింగ్ నుంచి గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన ఉస్మానియా వైద్య కళాశాల జూనియర్ వైద్యులు కె.మణికందన్, వి.అరవింద్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 80 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మణికందన్, అరవింద్‌లకు డ్రగ్ టెస్ట్ నిర్వహించగా, పాజిటివ్ వచ్చింది. కళాశాల విశ్రాంతి గృహంలోని మరికొంతమంది వైద్యులను విచారించనున్నట్లు పోలీసులు తెలిపారు.


సదస్సులో పాల్గొన్న యూనియన్ లేబర్ సెక్రటరీ సుమితా దార్వాతోపాటు రాష్ట్ర ప్రతినిధులు

## ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెరగాలి

● ఉపాధి, కార్మిక సంస్కరణల సదస్సులో సుమితా దార్వా

**హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** కార్మిక చట్టాలపై అవగాహన పెంచడంతోపాటు సులభ వ్యాపార విధానం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)ను పెంచాల్సిన అవసరముందని కేంద్ర లేబర్ ఎంపవర్‌మెంట్ సెక్రటరీ సుమితా దార్వా అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ), తెలంగాణ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఈఎఫ్ఐ), రాష్ట్ర కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హోటల్ ట్రైడెంట్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా సుమితా దార్వా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, కార్మిక సంక్షేమ చట్టాలు, ఎంప్లాయి స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ), ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ), ఇంటర్నేషనల్ నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌సీఎస్), ఇండియా స్కిల్ రిపోర్ట్ తదితర అంశాలపై సుమితా దార్వా ప్రసంగించారు. కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రిన్సిపల్ లేబర్ సెక్రటరీ సంజయ్ కుమార్, సీఐఐ సీటీటీ సభ్యులు సౌగుతా రాయ్‌చౌదరి, ఈఎఫ్ఐ సభ్యులు మధు దామోదరన్, ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డు సభ్యులు సుంకరి మల్లేశం, అదనపు కమిషనర్ ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ, తెలంగాణ సెంట్రల్ కమిషనర్ ఆరిఫ్ లోహానీ, ఆర్‌పీఎఫ్‌సీ ఆర్ఓ డాక్టర్ శివకుమార్, అశ్విని కుమార్‌గుప్తా, విశాల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.


టీఎస్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా ఎన్నికైన మారం జగదీశ్వర్, ముజీబ్‌లను రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ చంద్రశేఖర్, ఉద్యోగులు తెలంగాణ ఎన్జీవోస్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో పలు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.
● హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

## అడ్డాకూలీ దారుణ హత్య

● దప్పిక తీర్చుకునేందుకు వెళ్తే గొడవ ● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు?


సాయిలు(ఫైల్)

**మియాపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** అడ్డాకూలీతో ఘర్షణ పడిన ముగ్గురు యువకులు కొట్టి ప్రాణాలు తీశారు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లాకు చెందిన సాయిలు(33) నగరశివారు పటాన్‌చెరు బీరంగూడ ప్రాంతంలో భార్య మీనా, ఇద్దరు కుమారులతో నివాసం ఉంటున్నారు. బతుకుదెరువు కోసం మియాపూర్‌లో జాతీయ రహదారిపై అర్ధరాత్రి వచ్చే ఇసుక లారీల లోడును అన్‌లోడ్ చేసేందుకు ప్రతీ రోజు రాత్రి 10 గంటలకు వెళ్లి తెల్లవారుజామున 4 గంటలకు తిరిగి ఇంటికి వస్తుంటాడు. రోజులాగే గురువారం రాత్రి కూడా మియాపూర్‌కు పనికోసం వచ్చాడు. తెల్లవారుజామున 4గంటల వరకు ఇసుక అన్‌లోడ్ చేశాడు. అనంతరం దాహం కావడంతో మంచినీళ్ల కోసం మియాపూర్ క్రాస్ రోడ్‌లోని సంతోష్‌దాబా పక్కన ఉన్న అక్షర టీస్టాల్‌కు వెళ్లాడు. మంచినీళ్లు వాటర్‌బాటిల్‌లో పట్టుకుంటుండగా టీస్టాల్ వర్కర్, రాజమండ్రికి చెందిన సతీష్ వద్దని వారించాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం సాయిలు మియాపూర్‌లోని అడ్డావద్దకు వచ్చి ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురు చూస్తున్నాడు. గొడవ జరిగిన విషయం సతీష్ స్నేహితులు భాను, లక్ష్మణ్‌కు చెప్పాడు. ముగ్గురు కలిసి స్కూటీపై వచ్చి సాయిలును ఎక్కించుకుని టీస్టాల్ వద్దకు తీసుకువెళ్లి విచక్షణా రహితంగా కొట్టారు. దీంతో సాయిలు అక్కడికక్కడే మృతిచెందాడు. ముగ్గురూ అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

## అంబులెన్స్ వ్యాపారి హత్య కేసు

● భార్యతో పాటు ముగ్గురి అరెస్ట్
● పరారీలో మరో ఇద్దరు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్, సీఐ క్రాంతికుమార్

**జీడిమెట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి):** అంబులెన్స్ వ్యాపారి అనిల్ కుమార్ హత్య కేసును జగద్గిరిగుట్ట పోలీసులు చేధించారు. నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా అల్లాదుర్గానికి చెందిన గాజుల అనిల్‌కుమార్ అలియాస్ అనిల్(35)కు 2008లో భాగ్యలక్ష్మితో వివాహమైంది. భార్యతో హైదరాబాద్ వచ్చి కూకట్‌పల్లిలోని అద్దె ఇంట్లో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనిల్‌కు బంధువైన కృష్ణవేణి గోషామహల్‌లో భర్త, పిల్లలతో కలిసి ఉండేది. కరోనా సమయంలో అనిల్ కుటుంబసభ్యులు సొంతూరుకు వెళ్లారు. ఈ క్రమంలో కృష్ణవేణి అనిల్‌కు దగ్గరైంది. భర్తను వదిలేసి కూకట్‌పల్లికి పిల్లలతో కలిసి వచ్చింది. అనిల్‌తో కలిసి ఉన్నది. ఈ విషయం తెలుసుకున్న భాగ్యలక్ష్మి భర్తను నిలదీయడంతో శ్రీనివాస్‌నగర్‌లో ఇల్లు కొనుగోలు చేసి కృష్ణవేణిని అక్కడ ఉంచాడు. మియాపూర్‌లో టిఫిన్ సెంటర్ పెట్టాడు. దీనిని కృష్ణవేణి, భాగ్యలక్ష్మి కలిసి నిర్వహించేవారు. ఇందులో ఆల్విన్‌కాలనీకి చెందిన మార్తాండ మల్లేష్(28) వంటమాస్టర్. టిఫిన్ సెంటర్‌ను జగద్గిరిగుట్ట వెంకటేశ్వరనగర్‌కు మార్చారు. అనిల్ కృష్ణవేణితోనే ఎక్కువ సమయం గడుపుతుండడంతో భాగ్యలక్ష్మి మల్లేష్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. కృష్ణవేణికి అంబులెన్స్‌లు, శ్రీనివాస్‌నగర్ ఇంట్లో భాగం ఇస్తానని చెప్పడంతో భాగ్యలక్ష్మి కోపం పెంచుకుంది. మల్లేష్‌తో కలిసి అనిల్‌కుమార్ హత్యకు ప్రణాళిక రూపొందించింది. అనిల్ దగ్గర డ్రైవర్లుగా పనిచేస్తూ వివేకానందనగర్ కాలనీలో ఉంటున్న నర్సింహ అలియాస్ నాని(27), సూరారానికి చెందిన నీరుడి నవీన్(26)ను సంప్రదించింది. రెండు లక్షలు ఇస్తానని ఒప్పుకుని రూ.50 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చింది. నాని తన స్నేహితులు రాజు, సంజులను కలుపుకుని ఈ నెల 28న రాత్రి 9 గంటల సమయంలో అనిల్‌తో మద్యం తాగారు. ఈ క్రమంలో అనిల్‌ను మద్యం సీసాలు పగులగొట్టి కడుపులో పొడిచి, బ్లేడ్‌తో గొంతుకోసి హత్య చేశారు. రక్తపుదుస్తులను ఎల్లమ్మబండ శ్మశానవాటికలో పడేశారు. విషయం తెలుసుకున్న కృష్ణవేణి పోలీసులకు సమాచారం ఇవ్వడానికి ప్రయత్నించగా మల్లేష్, భాగ్యలక్ష్మి బెదిరించారు. రక్తపు మరకలను కడిగి అనిల్‌కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. భార్య భాగ్యలక్ష్మితో పాటు మల్లేష్, నర్సింహ, నవీన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీసీపీ తెలిపారు.

## గెట్ సెట్ గో!

**ఏ మోటర్‌సైకిల్?**
బిఎస్6 హిమాలయన్ (441సిసి). ఇది ఆఫ్ రోడ్స్‌కు చాలా బాగా పనికొస్తుంది. ఎత్తైన ప్రదేశాలకు తగిన వాహనం.

**అద్దె ఎంత?**
నాన్ సీజన్‌లో రోజుకు 1500. సీజన్‌లో రోజుకు 2,500 నుంచి 3,000 ఉంటుంది. నార్త్‌లో జూన్ నుంచి సెప్టెంబరు వరకూ వేసవి కాలం. అప్పుడు తాపమానాలు ప్రయాణాలకు అనుకూలం కాబట్టి ఎక్కువ మంది సందర్శిస్తూ ఉంటారు.

**డ్రైవింగ్ గేర్ సంగతేంటి?**
మోకాళ్లకు నీ ప్యాడ్స్, తలకు హెల్మెట్, ఒంటికి జాకెట్

**వెంట తీసుకెళ్లిన ఆహారం?**
రెడీ టు ఈట్ ఉప్మా, పోహ. అక్కడ ఎవర్ని అడిగినా వేడి నీళ్లు ఇస్తారు. డబ్బాలో ఉన్న ఉప్మా, లేదా పోహాలో వేడినీళ్లు పోసి, ఐదు నిమిషాలు మూత పెట్టి ఉంచితే అవి తినడానికి రెడీ అయిపోతాయి.

**పెట్రోల్ నిల్వ చేసుకున్నారా?**
బండిలో ట్యాంకు నిండా పెట్రోల్ నింపినా, ఎక్కువ దూరం సెకండ్ గేర్‌లోనే వెళ్లాల్సి ఉంటుంది కాబట్టి, మైలేజ్ తగ్గిపోతుంది. అందుకని 10 లీటర్ల పెట్రోల్ క్యాన్‌లు రెండు కొని, వాటి నిండా పెట్రోల్ నింపుకుని వెంట తీసుకెళ్లాను.

**ఎలా సిద్ధపడాలి?**
ప్రాణాయామం సాధన చేయాలి. నడపబోయే వాహనం మీద పట్టు పెంచుకోవాలి. ముందుగానే వెళ్లబోతున్న ప్రాంతం గురించి లోతుగా పరిశోధించుకోవాలి. లగ్జరీ కంటే భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఊహించని పరిణామాలకు ధైర్యంగా ఎదుర్కోగలిగే ఆత్మస్థయిర్యం పెంచుకోవాలి.

న్యూస్ మేకర్



**గడ్డకట్టే చలి, ఇసుక గాలులు, కళ్లు తిరిగే లోయలు... ఇవేవీ ఆమెను వెనక్కి లాగలేదు. బండి జారి కింద పడినా, ఏమాత్రం తొణకకుండా ప్రయాణాన్ని కొనసాగించి పట్టుదలగా గమ్యం చేరిందామె. ఆమే హైదరాబాద్‌కు చెందిన హారిక మందలపు. తాజాగా లడాక్‌లోని ఉమ్లింగ్ లా పాస్‌కు మోటర్‌సైకిల్ నడిపిన హారిక 'నవ్య'తో తన సాహసోపేత ప్రయాణ విశేషాలను ఇలా పంచుకుంది.**

# లడాక్‌లో.. ఒంటరి ప్రయాణం

ఉమ్లింగ్ లా చూడాలన్నది నా కల. అయితే మోటార్‌సైకిల్ మీద వెళ్లాలనే ఆలోచన ముందు నుంచీ లేదు. కనీసం కార్‌లో అయినా అక్కడకు వెళ్లి రావాలని అనుకుంటూ ఉండేదాన్ని. లేహ్, లడాక్ చూడాలనే కోరికతో స్నేహితురాలితో కలిసి శ్రీనగర్ వెళ్లాను. అక్కడున్న వారం రోజుల్లో చూడవలసిన పర్యాటక ప్రదేశాన్నీ చూసేశాం. తర్వాత నా స్నేహితురాలు తిరుగు ప్రయాణమైంది. నేను మాత్రం ఉమ్లింగ్ లా చూడాలనే కోరికతో లేహ్‌లోనే ఉండిపోయాను. నాకు మోటర్‌సైకిల్ నడపడం వచ్చు. అలాంటప్పుడు ఉమ్లింగ్ లాకు, కారులో కాకుండా మోటర్‌సైకిల్ మీద ఎందుకు వెళ్లకూడదు? అనే ఆలోచన వచ్చింది. దాంతో మంచి కండిషన్‌లో ఉన్న మోటార్‌సైకిల్ కోసం స్థానికంగా ఉన్న రెంటల్ ఏజెన్సీలను కలిశాను. ఒక చోట కొత్త వెహికల్స్ అద్దెకు ఇస్తున్నారు. వాటిలో ఆఫ్‌రోడ్ జర్నీకి ఉపయోగపడే, హిమాలయన్‌ను ఎంచుకున్నాను. అయితే ఆ మోటర్‌సైకిల్‌ను నేను అంతకు ముందు నడపలేదు. కాబట్టి అలవాటు పడడం కోసం స్థానికంగానే రెండు, మూడు రోజులు ఆ బండి మీద తిరిగి డ్రైవింగ్ మీద పట్టు పెంచుకుని తర్వాతే ఉమ్లింగ్ లాకు బయల్దేరాను.

### భయం గుప్పిట్లో...


లేహ్ నుంచి ఉమ్లింగ్ లా 375 కిలోమీటర్లు. కాబట్టి ఎక్కడా ఆగకుండా నేరుగా అక్కడి వరకూ ప్రయాణించడం కష్టం. అందుకే నేను మొదటి మజిలీగా హాన్లేను ఎంచుకున్నాను. అలా గత మే 24న ఉదయం నాలుగున్నరకు బయల్దేరి సాయంత్రానికి హాన్లే చేరుకుని, ఆ మరుసటి రోజు ఉమ్లింగ్ లాకు బయల్దేరాను. చలి ఎక్కువగా ఉండడంతో ఉదయం 7 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12:30కి ఉమ్లింగ్ లా చేరుకున్నాను. అక్కడ తట్టుకోలేనంత చలి, పైగా గాలిలో ఆక్సిజన్ తక్కువ. దాంతో 15 నిమిషాలు గడిపి, తిరుగు ప్రయాణమయ్యాను. హాన్లే నుంచి ఉమ్లింగ్ లా వెళ్లి రావడానికి రెండు రోడ్లు ఉంటాయి. ఒకటి తారు రోడ్డు, ఇంకొకటి ఆఫ్ రోడ్. వెళ్లేటప్పుడు తారు రోడ్డు మీద వెళ్లినా, వచ్చేటప్పుడు ఆఫ్ రోడ్‌ను ఎంచుకున్నాను. నిజం చెప్పాలంటే ఇది నా మొట్టమొదటి రిస్కీ జర్నీ. మనకి మనం ఎంత ధైర్యం చెప్పుకున్నా, ఊహించని ప్రమాదాలు, వాతావరణ పరిస్థితులు మనల్ని భయాందోళనలకు గురి చేస్తూనే ఉంటాయి. ఇలాంటి ప్రయాణాల్లో ఇవన్నీ సహజం.

### గుండెలు ఝల్లుమన్నాయి

నాకు ఎత్తైన ప్రదేశాలంటే భయం. ఉమ్లింగ్ లా ప్రయాణమంతా ఎత్తుకే సాగుతూ ఉంటుంది. పైగా రోడ్డు అంచునే లోయ, తల పక్కకి తిప్పి చూస్తే, కళ్లు తిరగడం ఖాయం. ఏటవాలుగా బండిని కిందకు దింపేటప్పుడు, మలుపులు తిప్పేటప్పుడు గుండెలు ఝల్లుమంటూ ఉంటాయి. అయినా ధైర్యాన్ని కూడదీసుకుని వీలైనంత నెమ్మదిగా బండిని నడపడం మొదలుపెట్టాను. వీచే గాలులతో పాటు ఇసుక లేచి, రోడ్డు మీద పడిపోతూ ఉంది. అలా ఒక మలుపులో రోడ్డు మీద పడి ఉన్న ఆ ఇసుక వల్ల మోటర్‌సైకిల్ స్కిడ్ అయి, పడిపోయింది. దాంతో ఇక నా పని అయిపోయింది అనుకున్నాను. విపరీతంగా భయపడ్డాను. కానీ అదృష్టవశాత్తూ బండికీ, నాకూ ఎలాంటి ప్రమాదం జరగలేదు. మళ్లీ బండి లేపి, ప్రయాణాన్ని కొనసాగించాను. తిరిగొచ్చేటప్పుడు చలికి నా కుడి చేయి మొద్దు బారింది. అప్పుడు బండిని ఆపేసి, నాకు తెలిసిన ఆక్యుపంక్చర్ చికిత్సతో సమస్యను సరిదిద్దుకున్నాను. ఇలాంటి అవసరాలకు అక్కరకొస్తుందనే నా జాకెట్‌లో ఆక్యుపంక్చర్ కిట్‌ను ఉంచుకున్నాను. ఈ ప్రయాణంలో నాకూ, బండికీ ఇద్దరికీ ఇంధనాన్ని నిల్వ చేసుకున్నాను. ఆ మార్గంలో హోటళ్లూ, పెట్రోల్ బంకులూ ఉండవు కాబట్టి రెడీ టు ఈట్ ఉప్మా, పోహా లాంటివి ప్యాక్ చేసుకున్నాను. బండి కోసం రెండు పది లీటర్ల క్యాన్స్‌లో పెట్రోల్ నింపుకున్నాను. బండి అద్దెకిచ్చిన అతనే నాకొక రైడర్స్ జాకెట్ ఇచ్చాడు. అది చలికి చాలా బాగా ఉపయోగపడింది.

ఉమ్లింగ్ లా లాంటి ప్రదేశాలకు మోటర్‌సైకిల్ మీద వెళ్లాలంటే ఎంతో ముందుగానే సిద్ధపడాలి. స్వతహాగానే మోటర్‌సైకిళ్లను నడుపుతూ ఉండే నేను వాటి మైనర్ రిపేర్ల గురించి ముందుగానే అవగాహన పెంచుకున్నాను. అలాగే బరువైన బండి కింద పడిపోతే దాన్ని సునాయాసంగా లేపగలిగే టెక్నిక్స్ నేర్చుకున్నాను. బ్రీదింగ్ ఎక్సర్‌సైజెస్ సాధన చేశాను.

మాది హైదరాబాదే! కానీ 2013లో నాన్నగారు పోయాక, అమ్మ హిమ, నేనూ బెంగుళూరులో స్థిరపడ్డాం! అమ్మానాన్న, చిన్నప్పటి నుంచీ నన్నెంతో ధైర్యంగా పెంచారు. ఈ ప్రయాణం గురించి చెప్పినప్పుడు మొదట అమ్మ కంగారుపడినా, తర్వాత ప్రోత్సహించింది. హాన్లే నుంచీ ఫోన్ సిగ్నల్స్ ఉండవు. అప్పటివరకూ అమ్మతో మాట్లాడుతూనే ఉన్నాను. ఇక ముందు విదేశాలకు కూడా రైడింగ్, డ్రైవింగ్ చేయాలని ఉంది. అలాగే ఆక్యుపంక్చర్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కూడా ఉంది. ఈ జర్నీలో హాన్లే వెళ్లే దార్లో కనిపించిన నీలం రంగు ఇండస్ నది, బౌద్ధారామాలను జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. లడాక్ మహిళల సోలో ట్రావెలింగ్‌కు ఎంతో సురక్షితమైన ప్రదేశం. అక్కడి ప్రజలు మంచివాళ్లు, వినమ్రంగా ఉంటారు. ఆడదాన్ని అనే కారణంగా అక్కడ నేనెలాంటి ఇబ్బందులూ ఎదుర్కోలేదు. మహిళలు బైక్ మీద ఉమ్లింగ్ లా వెళ్లాలనుకుంటే, స్వీయ శక్తినీ, సామర్థ్యాన్నీ అవసరానికి మించి ఊహించుకోకుండా, వాస్తవికంగా ఆలోచించాలి. గుండెధైర్యం ఉండాలి, కానీ తెగింపు ఉండకూడదు.




● గోగుమళ్ల కవిత

మేకప్

## కాస్మటిక్స్ కాలమెంత?

కాస్మటిక్స్ రకం, వాటిని నిల్వ చేసే ప్రదేశం, నిల్వ చేసే విధానాలను బట్టి అవి రెండేళ్ల నుంచీ, మూడు నెలలలోపే కాలం చెల్లిపోతాయి. కాబట్టి ఏ సౌందర్యసాధనాన్ని ఎంత కాలం వాడుకోవచ్చో తెలుసుకుందాం!

**ఎక్స్‌పైరీ డేట్ అర్థం?**

మేకప్ సామాగ్రి పైన 'పిఎఒ'(పీరియడ్ ఆఫ్ ఓపెనింగ్), కొన్ని నంబర్ల పక్కన 'ఎమ్'(మంత్స్) అనే అక్షరాలు ముద్రించి ఉంటాయి. వీటిని బట్టి ఆ కాస్మటిక్‌ను తెరిచిన రోజు నుంచి ఇంకా ఎన్ని నెలలు మిగిలి ఉన్నాయో లెక్కించి, వాడుకోవాలి. అదే వాటి షెల్ఫ్ లైఫ్. కాలం చెల్లిన కాస్మటిక్స్ వాటి నాణ్యతను కోల్పోతాయి. కాబట్టి ఉపయోగించినా ఫలితం ఉండదు. లిప్ లైనర్, ఐ లైనర్ లాంటి వాటిని చెక్కుకుని, వాడుకునే వెసులుబాటు ఉంటుంది కాబట్టి, వాటికి దీర్ఘకాల ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది.

**ఇలా కనిపెట్టాలి**



మస్కారా, ఐ మేకప్‌ల షెల్ఫ్ లైఫ్ తక్కువ. కన్‌సీలర్లకు 12 నెలలు, ఫ్రాగ్రెన్స్‌లకు ఐదేళ్ల షెల్ఫ్ లైఫ్ ఉంటుంది. అయితే ఈ ఎక్స్‌పైరీ డేట్లు కాస్మటిక్స్ పైన కాకుండా, ప్యాకేజింగ్‌ల మీద ముద్రించి ఉంటాయి. కాబట్టి వాటిని పారేసే ముందు, ఈ డేట్లను గమనించాలి. ఒకవేళ కాస్మటిక్స్ ఎక్స్‌పైరీ డేట్ గురించిన అయోమయం ఉంటే, అవి పాడైపోయాయని నిర్ధారించుకోవడం కోసం వాటిలో ఈ తేడాలను గమనించాలి.

- **వాసన:** వాటి నుంచి మంచి వాసన రావడం లేదంటే వెంటనే వాటిని పారేయాలి.
- **రంగు:** చాలావరకూ కన్‌సీలర్లు గాల్లోని ఆక్సిజన్‌తో రసాయనిక చర్య జరిగి ఆక్సిడైజ్ అవుతాయి. దాంతో లేత నారింజ రంగులోకి మారతాయి.
- **టెక్స్‌చర్:** కాలంతో పాటు కాస్మటిక్స్ టెక్స్‌చర్ కూడా మారుతుంది. అప్లై చేసుకున్నప్పుడు తేడాను గ్రహిస్తే, వాటిని పారేయడమే మంచిది.

**ఎప్పుడు పారేయాలి?**

- **సీరం:** డ్రాపర్‌ను కలిగి ఉండే ఇలాంటి కాస్మటిక్స్ తరచుగా గాలికి బహిర్గతమవుతూ ఉంటాయి కాబట్టి వీటిని 9 నెలలకు విుంచి వాడకూడదు. డ్రాపర్ బదులుగా పంప్ లాంటి ఏర్పాటు ఉన్నవి ఏడాది పాటు మన్నుతాయి.
- **ఐ మేకప్:** ఈ కాస్మటిక్స్‌తో కళ్లు మండినా, దురదలు పెట్టినా, ఐ ఇన్‌ఫెక్షన్ మొదలైనా వాటిని వెంటనే పారేయాలి.
- **ఫౌండేషన్:** దీనికి 6 నుంచి 12 నెలల్లోగా కాలం చెల్లుతుంది.
- **పౌడర్ కన్‌సీలర్:** రెండేళ్ల షెల్ఫ్ లైఫ్ కలిగి ఉంటుంది.
- **లిక్విడ్ ఐలైనర్:** దీని షెల్ఫ్ లైఫ్ ఆరు నెలలు
- **ఐబ్రో జెల్:** ఏడాది
- **ఐ షాడో:** రెండేళ్లు
- **బ్లష్:** రెండేళ్లు
- **లిప్‌స్టిక్:** రెండేళ్లు
- **లిప్ గ్లాస్:** ఏడాది.

# వాక్కాయ షర్బత్

*లవంగార్ద్రక సంయుక్తం సుపిష్టం వారిణాయుతమ్!*
*కారమర్ద కరైర్మర్ద్య సప్తభాగ సితాన్వితా!!*

వాక్కాయని 'వాక కాయ' అంటారు. 'వాకం' అంటే అనుకూలంగా పని చేసేదని. పొదలాగా ఎత్తుగా పెరిగే ముళ్లతో కూడిన అడవి మొక్క ఇది. రోడ్డు పక్కన కూడా పెరుగుతుంది. 'అశోకుడు రహదారులకు ఇరువైపులా చెట్లు నాటించెను' అని చదువుకున్నాం. కానీ ఆధునికత పేరుతో రోడ్డు పక్కన ఇప్పుడు చెట్లు అరుదైపోయాయి. అడవుల్ని కూడా ఇష్టారాజ్యంగా నరికేస్తున్నాం. వీటివల్ల పర్యావరణానికి హాని జరుగుతోంది. విరివిగా దొరికే వాక్కాయ లాంటి ఔషధ గుణాలున్న చెట్లు కనిపించకుండా పోతున్నాయి. వాక్కాయ అందరికీ అనుకూలంగా ఉండే ఫలం. దీనికి 'కలిమి' కాయలనే మరో పేరుంది. 'కలే చెట్టు, కరండ, కలే కాయలు, కలివి కాయలు' అని కూడా వీటిని పిలుస్తారు. కరీంనగర్ జిల్లాలో 'ఊడుగు' పండ్లు అంటారు. ఉత్తరాదిలో 'కరోండా'గా పిలుస్తారు.

పచ్చి కాయలు లేత ఆకుపచ్చ రంగులో, ముదిరినవి తెలుపు, గులాబీ రంగుల్లో ఉంటాయి. లోపల గుజ్జు ఎర్రగా ఉంటుంది. పండిన తరువాత నలుపు రంగుకు మారుతుంది. అందుకని 'కృష్ణ పాక ఫలం' అంటారు. చెర్రీ పండ్లకు బదులుగా వాక్కాయల్నే ఎర్ర రంగు కలిసిన పంచదార పాకంలో ఉడికించి వాడుతుంటారు. తీపి కలిసిన వాక్కాయ మంచిదే గానీ ఆ ఎర్ర రంగే ప్రమాదకరం.

పచ్చి వాక్కాయల్ని ఎండిస్తే ఎండు ద్రాక్షలా నల్లగా ఉంటాయి. వగరుగా, తియ్యగా, పులపుల్లగా రాతి ఉసిరి కాయ రుచిలో ఉంటాయి. ఆలస్యంగా అరుగుతాయి. జీర్ణం అయ్యాక ఎసిడిటీని పెంచుతాయి. వాత వ్యాధుల్లో మేలు చేస్తాయి. గుండెకి మంచిది. జీర్ణశక్తిని పెంచి, ఆకలిని కలిగిస్తాయి. నాలుక మీద జిగురు తగ్గించి, అన్నహితవు పుట్టిస్తాయి. పచ్చికాయ తింటే గొంతు నుసగా అనిపిస్తుంది. గొంతుకు సంబంధించిన వ్యాధులతో బాధపడేవారు వీటిని తినవద్దు. పండితే ఎక్కువ మేలు చేసే గుణాలున్నాయి. తేలికగా అరుగుతాయి. ఎసిడిటీని కలిగించవు. వాతాన్ని, పైత్యాన్ని, కఫాన్ని తగ్గిస్తాయి. అందుకని సాధ్యమైనంత పండిన వాటినే ఎంచుకోండి.

పచ్చి కాయలతో పప్పు, పచ్చడి, చేసుకుంటారు. ఊరుగాయ పచ్చడి కూడా పెట్టుకుంటారు. జామ్, షర్బత్తులు చేసుకోవటానికి వాకపండు ఎక్కువ తోడ్పడుతుంది. బాగా ముదురు ఎరుపు లేదా నలుపుగా ఉండే వాకపండ్లే మేలు చేస్తాయని గుర్తుంచుకోవాలి. లేత పిందెలుగా ఉన్న వాక్కాయలు వగరు, పులుపు రుచి వల్ల షుగరు వ్యాధి ఉన్నవారికి అనుకూలం.

**వాక పండ్లకు వాపుని తగ్గించి, మెదడుకి ఉత్తేజం కలిగించే గుణం, కడుపులో నులిపురుగుల్ని చంపే శక్తి ఉన్నాయని ఆధునిక పరిశోధనలు చెబుతున్నాయి. రక్త పుష్టినిచ్చి, నిస్సత్తువను తగ్గిస్తాయి.**

*వాతహృద్ధచిదం బల్యం హృద్యమ్ అమ్లతరం స్మృతమ్!*
*రక్తపిత్తకరం చోక్తమకత్యంకార మర్దకమ్!*

వాకపండు పానకం వాతాన్ని తక్షణం తగ్గిస్తుంది. ఆకలిని పెంచుతుంది. బలాన్ని, శక్తినీ ఇస్తుంది. కానీ రక్తం పలుచబడేలా చేస్తుంది. బ్లడ్ థిన్నర్లతో సమానంగా పని చేస్తుంది. గుండెకు మేలు చేస్తుంది. రక్తస్రావాలు అవుతున్నప్పుడు దీన్ని తీసుకోకుండా ఉంటేనే మంచిది.

వాక్కాయల్లో ఒక విధమైన జిగురు ఉంటుంది. అదీ మేలు కలిగించేదే. పచ్చికాయ పుల్లగా ఉన్నప్పటికీ దప్పిక తగ్గిస్తుంది. పురుషుల్లో అమితమైన వేడివల్ల వీర్యంలో జీవ కణాలు నశించిపోతుంటాయి. అలాంటి వాళ్లకు ఈ వాక్కాయ షర్బత్తు మంచి ఫలితం ఇస్తుంది. జీవకణాలు పెరుగుతాయి. మన పూర్వులు ప్రకృతిలో ఎన్నిటినో ఆహార యోగ్యంగా మలచుకున్నారు. సీజన్లో దొరికే అన్నిటినీ తినటానికి ప్రయత్నించేవారు. అదే అసలైన జీవన విధానం.

**పానకం ఎలాగంటే...**

వాక పండుతో పానకం తయారు చేసుకొనే విధానాన్ని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో ఇలా వివరించాడు:

- వాక పండుని శుభ్రపరిచి, ముక్కలుగా తరిగి, మిక్సీ పట్టి గుజ్జులా చేయండి. లోపల గింజ తీసేయండి.
- ఈ గుజ్జుకు ఏడు రెట్లు నీళ్లు కలిపి తగినంత అల్లం, ఉప్పు కూడా వేసి మరోసారి మిక్సీ పట్టండి. ఈ రసం మొత్తం ఏడు కప్పులైతే... దానికి పంచదార ఒక కప్పు కలిపి బాగా చిలకండి.

ఇదే వాకపండు పానకం... లేదా షర్బత్. దీన్ని అప్పటికప్పుడు చేసుకుని తాగటమే ఉత్తమం. ఫ్రిజ్జులో పెట్టుకుని అయినా వాడుకోవచ్చు. ఎక్కువసేపు బయట ఉంటే పులిసిపోతుంది.



● గంగరాజు అరుణాదేవి

వంటిల్లు



కొన్ని వంటలను తింటే ఆహా.. అంటూ మైమరిచిపోవాల్సిందే. అలాంటి వంటలు కొందరే చేయగలరు. అథెంటిక్ స్టయిల్‌లో వంటలు చేయటంలో ఒకొక్కరిదీ ఒక్కో స్టయిల్. రాజుగారి కోడిపులావ్, పుదీనా పనీర్ వేపుడు, అమృత ఫల్.. డిష్‌లనూ మీరూ సులువుగా చేసుకోవచ్చు ఇలా..

### అమృత ఫల్

**కావాల్సిన పదార్థాలు**

మామిడికాయ- 1, వాటర్ మిలన్- 1 కివీ ఫ్రూట్-1, నానబెట్టిన సబ్జా గింజలు- టేబుల్ స్పూన్

**తయారీ విధానం**

ముందుగా మామిడికాయ, వాటర్ మిలన్, కివీ పండ్లను వేరువేరుగా ముక్కలు కోసి ప్లేట్‌లో ఉంచుకోవాలి. ఆ ముక్కలను వేరువేరు జార్‌లలో వేసి మిక్సీ పట్టుకుని పక్కన ఉంచుకోవాలి.

మొదట గ్లాసు తీసుకుని అందులో సబ్జా గింజలు వేసి కింద కివీ జ్యూస్ వేసి దాని మీద మామిడి పండు రసం.. చివరగా వాటర్ మిలన్ జ్యూస్ వేయాలి. ఈ మూడు రంగుల అమృత ఫల్ రుచిగా ఉంటుంది.

# ఆహా.. ఏమి రుచి!

### రాజుగారి కోడిపులావ్

**కావాల్సిన పదార్థాలు**

చికెన్- ముప్పావు కేజీ, పచ్చిమిర్చి- 6, ఉల్లిపాయ- 1 (పొడవుగా కట్ చేసుకోవాలి), బాస్మతి బియ్యం- 2 కప్పులు, నెయ్యి- 2 టేబుల్ స్పూన్లు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, యాలకులు-4, లవంగాలు-4, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, బిర్యానీ ఆకు-1, జీడిపప్పులు- 12, ఉల్లిపాయ ముక్కలు- 1 కప్పు, అల్లం, వెల్లుల్లి పేస్ట్- 2 టేబుల్ స్పూన్లు, పసుపు- చిటికెడు, కారం పొడి- టేబుల్ స్పూన్, గరం మసాలా- అర టీస్పూన్, ఉప్పు- తగినంత, పెరుగు- మూడు టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- టేబుల్ స్పూన్, పుదీనా- పావు కప్పు

**తయారీ విధానం**

ముందుగా చికెన్‌ను శుభ్రంగా కడిగి ఉంచుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయను పొడవుగా కట్ చేసుకుని వేయించుకోవాలి. వేయించిన చల్లార్చిన ఉల్లిపాయ మిశ్రమంతో పాటు పచ్చిమిర్చిని జార్‌లో వేసి మిక్సీ పట్టుకోవాలి. ఈ మెత్తటి పేస్ట్‌ను పక్కన ఉంచుకోవాలి.

ఇపుడు బౌల్‌లో బియ్యం వేసి నీళ్లు పోయాలి. ఇరవై నిముషాలు నానబెట్టాలి. ఆ తర్వాత కుక్కర్‌లో నెయ్యి వేసి, నూనె వేసి గరిటెతో కలపాలి. యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు వేసి కలిపాక జీడిపప్పులు, ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. ఉల్లిపాయ ముక్కలు బంగారు రంగు వచ్చిన తర్వాత అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేయాలి. ఆ తర్వాత ముందు మిక్సీ పట్టిన పచ్చిమిర్చి పేస్ట్ వేసి కలపాలి. ఇందులో కొద్దిగా పసుపు, కారంపొడి, గరం మసాలా, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిముషాలయ్యాక చికెన్ వేసి కలపాలి. నాలుగు నిముషాల తర్వాత పెరుగు, కొత్తిమీర, పుదీనా వేసి కలిపి ఆరు నిముషాల పాటు కుక్ చేయాలి. ఆ తర్వాత నాలుగు గ్లాసుల వేడి నీళ్లు పోయాలి. కుక్ చేస్తే పొంగు వస్తుంది. చికెన్ ఉడికిన తర్వాత నానబెట్టుకున్న బియ్యం ఇందులో వేయాలి. మంటను తగ్గించి కుక్కర్ మూత ఉంచి ఒక్క విజిల్ వచ్చేంత వరకూ కుక్ చేయాలి. రాజుగారి కోడి పులావ్ రెడీ. వేయించిన ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని వడ్డించుకోవాలి.



### పుదీనా పనీర్ వేపుడు

**కావాల్సిన పదార్థాలు**

పనీర్- 300 గ్రాములు, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి- 6 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 4 (పొడవుగా సన్నగా కట్ చేసుకోవాలి), క్యాప్సికం- 1 (చతురస్రాకారంలో కట్ చేసుకోవాలి), పుదీనా- కప్పు, కొత్తిమీర- టేబుల్ స్పూన్, ఉప్పు- తగినంత, నల్లమిరియాల పొడి- కొద్దిగా, గరం మసాలా- అర టీస్పూన్, పసుపు- కొద్దిగా, కారంపొడి- 1 టీస్పూన్, చాట్ మసాలా- టీస్పూన్, నిమ్మరసం- అరటీస్పూన్

**తయారీ విధానం**

ముందుగా పనీర్ ముక్కలను పొడవుగా కట్ చేసుకోవాలి. ఆ తర్వాత వాటిని సగానికి అడ్డంగా కట్ చేయాలి. స్టవ్‌మీద కడాయిని ఉంచి కాస్త వేడయ్యాక నూనె వేయాలి. నిముషం తర్వాత వెల్లుల్లి ముక్కలు, పచ్చిమిర్చి, క్యాప్సికం వేసి రెండు నిముషాల పాటు కలపాలి. శుభ్రంగా కడిగిన పుదీనా, కొత్తిమీర వేసి కలపాలి. నల్లమిరియాల పొడి, ఉప్పు వేసి నిముషం పాటు కలపాలి. గరం మసాలా, పసుపు, కారంపొడి, చాట్ మసాలా వేసి నిముషం పాటు కలిపాక పనీర్ ముక్కలను వేసి కొద్దిగా నిమ్మరసం వేసి నిముషం పాటు కలపాలి.

పనీర్ ముక్కలు పసుపు రంగులోకి మారుతాయి. పుదీనా పనీర్ వేపుడు రెడీ.





**చెఫ్ యాదగిరి**, 99899 61488
వివాహ భోజనంబు, జూబ్లీహిల్స్, హైదరాబాద్

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 6 జూలై 2024
cinema@andhrajyothy.com

# పుట్టిన రోజు.. రెండు అప్‌డేట్స్



నందమూరి కల్యాణ్ రామ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 21వ చిత్రం లుక్ పోస్టర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. తన పిడికిలి బిగించి ఫైర్‌తో, కుర్చీలో కూర్చున కల్యాణ్ రామ్ తన చుట్టూ ఉన్న గూండాలని ఇంటెన్స్‌గా చూస్తున్నట్లు పోస్టర్ పవర్ ఫుల్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఈ సినిమాలో కల్యాణ్‌రామ్ కొన్ని డేర్ డెవిల్ స్టంట్స్ చేయనున్నారు. అలాగే ఫైర్ యాక్షన్ ఎపిసోడ్ ప్రధాన ఆకర్షణగా ఉంటుందని దర్శకుడు ప్రదీప్ చిలుకూరి చెప్పారు. సీనియర్ నటి విజయశాంతి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

### బింబిసారకు సీక్వెల్

అలాగే కల్యాణ్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగానే 'బింబిసార 2' కాన్సెప్ట్ పోస్టర్ విడుదల చేశారు. కల్యాణ్‌రామ్ కెరీర్‌లోనే అత్యంత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'బింబిసార' చిత్రానికి సీక్వెల్ ఉంటుందని మేకర్స్ ఎప్పుడో ప్రకటించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆ చిత్రం వివరాలను వెల్లడించారు. బింబసార కంటే యుగాల ముందు త్రిగర్తల రాజ్యాన్ని ఏలిన లెజెండ్‌ను చూడడానికి సిద్ధంగా ఉండండి' అని శుక్రవారం అనౌన్స్ చేశారు. స్క్రీన్ మీద ఇప్పటిదాకా ఎవరూ చూడనటువంటి స్థాయిలో త్రిగర్తలను ప్రదర్శించడానికి సన్నాహాలు ప్రారంభించారు. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థ నిర్మించే ఈ చిత్రానికి అనిల్ పాదూరి దర్శకుడు.

# రజనీ రాజసం



లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం 'కూలీ'. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ సాగుతోంది. నెల రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో పాల్గొనేందుకు రజనీకాంత్ ఇటీవలే హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం చిత్రీకరణ మొదలుపెట్టినట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. దీంతో పాటు రజనీకాంత్ స్టైల్‌గా కుర్చీలో కూర్చొని రాజసం ఉట్టిపడే లుక్‌లో ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. అనిరుధ్ రవిచంద్రన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

### కూలీలో శ్రుతి ఖాయం


'కూలీ' చిత్రంలో శ్రుతీహాసన్ నటించబోతున్నారనే మాట కొన్నాళ్లుగా మీడియాలో వినిపిస్తోంది. కానీ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. శుక్రవారం శ్రుతీహాసన్ ఈ సస్పెన్స్‌కు తెరదించారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తన ఫొటోను పోస్ట్ చేసిన శ్రుతీ 'కూలీ డే 1 షూటింగ్' అని రాసుకొచ్చారు. దీంతో ఈ చిత్రంలో ఆమె నటించడం ఖాయమైనట్టే. శ్రుతీహాసన్ ప్రస్తుతం అడివిశేష్ సరసన 'డెకాయిట్' చిత్రంలో నటిస్తున్నారు.

# పవర్‌ఫుల్ పెదకాపు



హాస్య నటుడు అలీ కుటుంబానికి చెందిన సదన్ హీరోగా పరిచయమవుతున్న 'ప్రణయ గోదారి' చిత్రంలో పెదకాపుగా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు సాయికుమార్. ఆయన లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విడుదల చేశారు. తమ మునుగోడు ప్రాంతానికి చెందిన పారుమళ్ల లింగయ్య నిర్మిస్తున్న 'ప్రణయగోదారి' విజయం సాధించాలని రాజగోపాల్‌రెడ్డి కోరుకున్నారు. 'ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. అన్నివర్గాల వారినీ అలరించే అంశాలు చిత్రంలో ఉన్నాయి. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానాలు ప్రేక్షకులను అలరిస్తాయి. అతి త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు నిర్మాత పారుమళ్ల లింగయ్య. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

# భవిష్యత్తు కాశీలోకి...











విడుదలై వారమైనా హౌస్‌ఫుల్ కలెక్షన్లతో 'కల్కి 2898 ఏ.డీ' బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. శుక్రవారం చిత్రబృందం మూవీ సెట్స్ టూర్‌కు మీడియాను ఆహ్వానించింది. ఈ సందర్భంగా సినిమాలోని భవిష్యత్తు కాశీ సెట్స్‌తో పాటు.. చిత్రంలో పాత్రధారులు వాడిన వివిధ రకాల ఫ్యూచరిస్టిక్ వెహికల్స్‌ను మీడియాకు ప్రదర్శించింది. భవిష్యత్తు కాశీ నగరం సెట్లు..మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఉన్నాయి. ఈ కాల్పనిక జగత్తును చూడటానికి రెండు కళ్లు సరిపోవు అన్నంత అబ్బురపరిచేలా ఆ నిర్మాణాలు ఉన్నాయి. ఆ కాశీ సెట్లలో సినిమాలో భైరవ క్యారెక్టర్ పోషించిన ప్రభాస్ ఉండే పరిసరాలను.. విరామ ఘట్టానికి ముందు ప్రభాస్ భారీ చక్రాన్ని ప్రజల మీద పడకుండా అడ్డుకునే సన్నివేశానికి సంబంధించిన సెట్ ప్రాపర్టీస్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు. అలాగే చిత్రంలో వాడిన వాహనాల నమూనాలు.. భవిష్యత్తులో మనుషులు ప్రయాణానికి, రవాణాకు వాడేందుకు ఎంతో సౌకర్యంగా, ముచ్చటగొలిపేలా.. సాంకేతికంగా ఉన్నతంగా ఉన్నాయి. ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత హంగులతో అత్యంత సహజత్వం ఉట్టిపడేలా నిర్మించిన ఆ సెట్లు నిజంగానే మరో ప్రపంచాన్ని పరిచయం చేసి.. భవిష్యత్తు ఎలా ఉంటుందో కళ్లకు కట్టాయి. ఆ సెట్లలో మరో విశేషం ఏంటంటే.. అశ్వత్థామ పాత్రలో ఆకట్టుకున్న అమితాబ్ విగ్రహం. ఆజానుబాహుడంటే ఎలా ఉంటాడో ఆ విగ్రహాన్ని చూస్తే తెలిసేలా ఉంది.

### టికెట్ ధరల పెంపుపై సీఎంతో పవన్ చర్చిస్తానన్నారు

సి. అశ్వనీదత్



కొత్త సినిమాలు విడుదలైన ప్రతిసారీ టిక్కెట్ ధరల పెంచాలని ప్రభుత్వాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా శాశ్వత ప్రాతిపదికన ఓ విధానం తీసుకురావాలనేదే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిమతమని నిర్మాత సి. అశ్వనీదత్ అన్నారు. టిక్కెట్ ధరల పెంపు అంశం గురించి ఇటీవల ఆయన ఓ ఇంటర్వ్యూలో వెలిబుచ్చిన అభిప్రాయాలపై కొన్ని అపోహలు ఏర్పడిన నేపథ్యంలో శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వాటిపై స్పష్టతనిచ్చారు. 'బడ్జెట్‌ను బట్టి టిక్కెట్ ధరలు ఎంతవరకూ పెంచవచ్చు, అలాగే ధరల పెంపు పది రోజులా?, వారమా? అనేది నిర్మాతలంతా కూర్చొని, చర్చించుకొని వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారితో స్వయంగా చర్చిస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు' అని తెలిపారు.








# డబుల్ ఇస్మార్ట్ ముగించారు

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' చిత్రానికి ఇది కొనసాగింపు. 'డబుల్ ఇస్మార్ట్' చిత్రీకరణ పూర్తయినట్లు యూనిట్ శుక్రవారం ప్రకటించింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రంలో రామ్‌కు జోడీగా కావ్యథాపర్ కథానాయికగా నటిస్తున్నారు. సంజయ్‌దత్ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు. అలీ, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీకౌర్‌తో కలసి పూరి జగన్నాథ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సామ్ కె నాయుడు, జియాని గియోన్నెల్లి.



# అడవిలో అందాల భామ

తమిళ హీరో ధనుష్, టాలీవుడ్ మన్మథుడు నాగార్జున కలయికలో తెరకెక్కుతోన్న మల్టీస్టారర్ 'కుబేర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోంది. రష్మిక మందన్న కథానాయిక. శుక్రవారం చిత్రబృందం రష్మిక ఫస్ట్ లుక్, క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఫస్ట్‌లుక్‌లో రాత్రిపూట డబ్బుతో ఉన్న ట్రాలీ బ్యాగ్‌తో అడవిలో నడుచుకుంటూ వెళ్తున్న రష్మిక లుక్ ఆసక్తికరంగా ఉంది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



# హాని చేయాలనే తలంపు లేదు



సమంత

టాలీవుడ్ అగ్ర కథానాయిక సమంత వివాదంలో చిక్కుకున్నారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఓ పోస్ట్ వైద్య వర్గాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. గత వారం సమంత నెబ్యులైజర్‌ను ఉపయోగిస్తున్న ఫోటోను షేర్ చేసి, 'వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు మందులకు బదులుగా హైడ్రోజన్ పెరాక్సైడ్, డిస్టిల్డ్ వాటర్ కలిపి పీల్చితే మేజిక్‌లాగా పనిచేస్తుంది' అని సూచించారు. అయితే ఈ విధానాన్ని కొంతమంది వైద్యులు సోషల్ మీడియాలో తప్పుపట్టారు. అప్పటికే దెబ్బ తిన్న ఊపిరి తిత్తులలోకి హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్రవేశిస్తే, న్యుమోనియా సహా పలు వ్యాధులను కలగజేస్తుంది. కొన్నిసార్లు మరణానికి దారి తీస్తుందని హెచ్చరించారు. 'ఇంతకంటే బుద్ధి తక్కువ పని లేదు. సమంతకు ఆరోగ్యం, విజ్ఞానశాస్త్రం గురించి ఏమీ తెలియదు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందుకు ఆమెను జైలుకు పంపాల'ని ఫిలిప్స్ అనే వైద్యుడు సమంతను ఘాటుగా విమర్శించారు. స్పందించాడు. తనపై విమర్శలు రావడంతో స్పందించిన సమంత, మర్యాదకరమైన భాష ఉపయోగించాలని ఆ డాక్టర్‌ను కోరారు. 'ఇవన్నీ నాకు వైద్యులు చెప్పిన సలహాలే , ఎవరికీ చెడు చేయాలనే తలంపు నాకు లేదు. నన్ను లక్ష్యంగా చేసుకునే బదులు, ఈ విధానాన్ని నాకు సూచించిన డాక్టర్‌తో మీరు చర్చ జరిపితే బావుండేద'న్నారు. సమంత వివరణపై శుక్రవారం డాక్టర్ ఫిలిప్స్ స్పందిస్తూ, బాధితురాలిగా చూపించుకునే ప్రయత్నం మానుకోని, నిజా నిజాలు తెలుసుకొనేందుకు ప్రయత్నం చేయాలని సమంతకు సూచించారు. మానిటైజేషన్ కోసమే కొంతమంది సెలబ్రిటీలు ఇలాంటివి చేస్తున్నారని, వారికి ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యత లేదన్నారు.

# ఆడపిల్ల తిరగబడితే...



నటి లావణ్య ప్రధాన పాత్ర పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఇజ్జత్'. పరువు హత్యల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. ఉపేంద్ర ఎస్‌పీ దర్శకత్వంలో శ్రీను కందుల నిర్మిస్తున్నారు. శుక్రవారం దర్శకుడు సునీల్‌కుమార్ రెడ్డి 'ఇజ్జత్' టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ 'ఒక మధ్య తరగతి అమ్మాయి కథే 'ఇజ్జత్' చిత్రం. పరువు హత్యకు సిద్ధపడిన తల్లీతండ్రులకు ఎదురు తిరిగే ధైర్యవంతురాలిగా కథానాయిక కనిపిస్తుంది. ఒక ఆడపిల్ల తిరగబడితే ఎలా ఉంటుందో చెప్పే చిత్రమే మా 'ఇజ్జత్' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'గతంలో పరువు హత్యల మీద వచ్చిన చిత్రాలకు 'ఇజ్జత్' భిన్నంగా ఉంటుంది. కొత్త తరహా కథనంతో క్వాలిటీ విజువల్స్‌తో నిర్మిస్తున్నాం. ఫస్ట్ కాపీ సిద్ధమవుతోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేశ్ బొబ్బిలి. సినిమాటోగ్రఫీ: వీఆర్‌కే నాయుడు.

# మనకథ విననిది రా...



హర్షరోహన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య పాత్రలు పోషించిన ఫన్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకుడు. ఈ సినిమా నుంచి 'వరల్డ్ టూర్ నజభజ జజర కథలెన్నో వినరా.. మనకథ విననిది రా' అనే పాటను శుక్రవారం విడుదల చేశారు. దర్శకుడు సుప్రీత్ రాసిన ఈ పాటకు సంగీత దర్శకుడు సంతు ఓంకార్ స్వరాలు అందించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఉండే సరికొత్త ఫాంటసీ ఎలిమెంట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. చిత్రంలోని ప్రతి సన్నివేశం ఆడియన్స్‌ని ఎంటర్‌టైన్ చేస్తుంది.' అని చెప్పారు. రాహుల్ రెడ్డి, లోక్కు, శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణ ఈ చిత్రానికి నిర్మాతలు.



# పాత సంప్రదాయలను ప్రశ్నించే పౌరుషం

షెరాజ్ మెహ్ది దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పౌరుషం.. ది మ్యాన్ హుడ్'. అమెరికాకు చెందిన యూవీటీ హాలీవుడ్ స్టూడియో, శ్రేయ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమా ట్రైలర్‌ను ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో విడుదల చేశారు. ఉమ్మడి కుటుంబంలో ఎదురయ్యే సమస్యలు, పాత సంప్రదాయాలను ప్రశ్నించేలా సినిమా ఉంటుందని ట్రైలర్ చూడగానే అర్థమవుతుంది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ రెండూ ఉంటాయని ట్రైలర్ ద్వారా స్పష్టం చేశారు మేకర్స్. సుమన్, మేకా రామకృష్ణ, షెరాజ్, అశోక్ ఖుల్లార్, ఆమని, గీతారెడ్డి, జ్యోతిరెడ్డి, శైలజా తివారి, అనంత్, కనక తదితరులు నటించిన ఈ చిత్రాన్ని అశోక్ ఖుల్లార్, దేవేంద్ర నేగి నిర్మిస్తున్నారు.

## ఆసియా బిలియర్డ్స్ ఫైనల్లో పంకజ్



రియాద్: స్టార్ క్యూయిస్ట్ పంకజ్ ఆడ్వాణీ ఆసియా బిలియర్డ్స్ టోర్నమెంట్‌లో హ్యాట్రిక్ టైటిల్ సాధించేం దుకు అడుగుదూరంలో నిలిచాడు. ఈ వెటరన్ ఆటగా డు వరుసగా మూడోసారి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో పంకజ్ 5-0తో భారత్‌కే చెందిన సౌరవ్ కొఠారిని చిత్తుగా ఓడించాడు.

## క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

### రజావత్ కూడా .. కెనడా ఓపెన్

కాల్గరీ (కెనడా): తెలుగమ్మాయి గాయత్రీ గోపీ చంద్ కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం రాత్రి జరిగిన డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో గాయత్రి-ట్రీసా జాలీ జంట 17-21, 21-7, 21-8తో ఆంథోనీ సెన్ (డెన్మార్క్)-అలిసా (నెదర్లాండ్స్) జోడీపై గెలిచింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో యువ కెరటం ప్రియాన్షు రజావత్ తన జోరు కొనసాగిస్తూ క్వార్టర్స్ చేరాడు. ప్రపంచ 39వ ర్యాంకరైన రజావత్ 21-19, 21-11తో 33వ ర్యాంకర్ టకుమా ఒబయాషి (జపాన్)ని చిత్తు చేశాడు. రజావత్, గాయత్రీ జోడీలు మినహా మిగతా భారత షట్లర్లంతా ప్రీక్వార్టర్స్‌లోనే నిష్క్రమించారు. సింగిల్స్‌లో అనుపమ, తాన్య, డబుల్స్‌లో కృష్ణప్రసాద్-సాయి ప్రతీక్ ద్వయం, మిక్స్‌డ్‌లో రోహన్-రుత్విక జంట పరాజయం పాలయ్యారు.

# కుర్రాళ్లకు భలే చాన్స్

జింబాబ్వేతో భారత్ టీ20 సిరీస్ నేటి నుంచి

సాయంత్రం 4.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

హరారే: టీ20 ప్రపంచకప్ విజయం ఇంకా తాజాగా ఉండగానే.. భారత జట్టు కొత్త తరం ఆటగాళ్లతో మరో పొట్టి సిరీస్‌కు సిద్ధమైంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో పూర్తిగా యువ ఆటగాళ్లతో కూడిన ఈ టీమ్ నేటి నుంచి జింబాబ్వేతో ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. రెండేళ్ల తర్వాత ఇరు జట్లు తలపడబోతున్నాయి. అలాగే 2026లో జరిగే మరో టీ20 మెగా టోర్నీ వరకు భారత్ 34 మ్యాచ్‌లు ఆడనుంది. వెటరన్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజా రిటైర్మెంట్ తర్వాత భారత జట్టు ఆడుతున్న తొలి ద్వైపాక్షిక సిరీస్ ఇదే. దీంతో ఇప్పటినుంచే టీమిండియా తమ భవిష్యత్ స్టార్ల వేటలో పడింది. సీనియర్లందరికీ విశ్రాంతినివ్వడంతో తాజా జట్టులో చాలామంది ఆశావహులకు చోటు దక్కింది. జట్టులో తమ స్థానం సుస్థిరం చేసుకునేందుకు వారికిది సువర్ణావకాశం. ముఖ్యంగా తొలిసారిగా జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న ఐపీఎల్ హీరోలు అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్‌లపై అందరి దృష్టీ నెలకొంది. తొలి టీ20 మ్యాచ్‌లోనూ తుది జట్టులో వీరికి చోటు దక్కే అవకాశం ఉంది. గిల్‌తో అతడి చిన్ననాటి స్నేహితుడు అభిషేక్ శర్మ ఓపెనింగ్ చేయనున్నాడు. సన్‌రైజర్స్ తరఫున అభిషేక్ మెరుపు ఆరంభాలను అందించిన విషయం తెలిసిందే. ఇక, రుతురాజ్ వన్‌డౌన్‌లో దిగుతాడు. పరాగ్ నాలుగు, రింకూ ఐదో స్థానాల్లో మిడిలార్డర్‌లో ఇన్నింగ్స్‌ను కదం తొక్కించగలరు. వికెట్ కీపర్‌గా జితేశ్, జురెల్ మధ్య పోటీ ఉంది. ప్రస్తుతం భారత్‌లో ఉన్న దూబే, జైస్వాల్, శాంసన్ మూడో మ్యాచ్‌నుంచి అందుబాటులో ఉంటారు. వీరి రాకకు ముందే పలువురు యువ ఆటగాళ్లు తమ నైపుణ్యాన్ని పరీక్షించుకునే చాన్స్ ఉంటుంది. అవేశ్, ఖలీల్, ముకేశ్‌లతో కూడిన పేస్ త్రయం సవాల్‌గా మారనున్నారు. మరోవైపు స్టార్ ఆల్‌రౌండర్ సికందర్ రజా కెప్టెన్సీలో జింబాబ్వే సంచలన ఫలితం కోసం ఎదురుచూస్తోంది. రజా ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఆడినవాడే కావడంతో భారత ఆటగాళ్లపై అవగాహన ఉంటుంది. చటారా, మసకద్జ, మధెవెరె, క్యాంప్‌బెల్ ఇతర కీలక ఆటగాళ్లు. ఇప్పటిదాకా ఇరు జట్ల మధ్య 8 మ్యాచ్‌లు జరగగా, 6-2తో భారత్ ఆధిక్యంలో ఉంది.


జింబాబ్వే సారథి సికందర్


కోచ్ లక్ష్మణ్, కెప్టెన్ గిల్

### తుది జట్లు (అంచనా)

**భారత్:** గిల్ (కెప్టెన్), అభిషేక్, రుతురాజ్, పరాగ్, రింకూ సింగ్, జురెల్, సుందర్, బిష్ణోయ్, అవేశ్, ఖలీల్, ముకేశ్.

**జింబాబ్వే:** సికందర్ రజా (కెప్టెన్), మరుమని, ఇన్నోసెంట్, బ్రయాన్, మధెవెరె, మడండె, క్యాంప్‌బెల్, జోంగ్వే, మసకద్జ, ఎన్‌గరవ, ముజరబాని.

# సఫారీల బోణీ

తొలి టీ20లో భారత్ ఓటమి
పోరాడిన జెమీమా, మంధాన


బ్రిట్స్ (81)

చెన్నై: భారత పర్యటనలో దక్షిణాఫ్రికా మహిళల జట్టు ఎట్టకేలకు విజయం రుచి చూసింది. శుక్రవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో సఫారీలు ఆల్‌రౌండ్‌షోతో భారత్‌పై 12 పరుగుల తేడాతో నెగ్గారు. ఇంతకుముందు మూడు వన్డేలు, ఓ టెస్టులో పర్యాటక జట్టు చిత్తయిన విషయం తెలిసిందే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 189 పరుగులు చేసింది. ఓపెనర్ తజ్‌మిన్ బ్రిట్స్ (81) కీలక ఇన్నింగ్స్‌తో ఆఖరి బంతికి వెనుదిరిగింది. మరో ఓపెనర్, కెప్టెన్ వోల్వార్ట్ (33) వేగంగా ఆడడంతో తొలి వికెట్‌కు 50 రన్స్ జత చేరాయి. ఆ తర్వాత బ్రిట్స్‌కు మరిజానె కాప్ (57) జత కట్టడంతో భారత బౌలర్లు వికెట్ కోసం చెమటోడ్చాల్సి వచ్చింది. 30 బంతుల్లో కాప్, 40 బంతుల్లో బ్రిట్స్ అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. రెండో వికెట్‌కు 90 పరుగులు జత చేశాక 17వ ఓవర్‌లో కాప్‌ను రాధా యాదవ్ అవుట్ చేసింది. అదే ఓవర్‌లో బ్రిట్స్ రెండు సిక్సర్లు, తర్వాతి ఓవర్‌లో రెండు ఫోర్లతో మొత్తం 32 రన్స్ రాబట్టింది. కానీ చివరి రెండు ఓవర్లలో భారత బౌలర్లు 12 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీయడం విశేషం. పూజా వస్త్రాకర్, రాధా యాదవ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

**జెమీమా పోరాటం:** ఛేదనలో భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 177 పరుగులు చేసి ఓడింది. స్మృతి మంధాన (46) మెరుపు ఆటతీరుకు జట్టు పవర్‌ప్లేలోనే 61 రన్స్ చేసినా మధ్య ఓవర్లలో తడబడింది. 7-14 ఓవర్ల మధ్యలో 49 పరుగులే చేయడం దెబ్బతీసింది. ఆఖర్లో జెమీమా రోడ్రిగ్స్ (53 నాటౌట్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (35) నాలుగో వికెట్‌కు 90 రన్స్ జోడించారు.

**దక్షిణాఫ్రికా:** 20 ఓవర్లలో 189/4 (తజ్‌మిన్ బ్రిట్స్ 81, కాప్ 57, వోల్వార్ట్ 33; పూజా వస్త్రాకర్ 2/23, రాధా యాదవ్ 2/40).
**భారత్:** 20 ఓవర్లలో 177/4 (జెమీమా 53 నాటౌట్, మంధాన 46, హర్మన్ 35; డి క్లార్క్ 1/30, మలబ 1/32).

# జాస్మిన్.. అదిరెన్!

### ప్రీక్వార్టర్స్‌కు అల్కారజ్, గాఫ్, కీస్

వింబుల్డన్


జాస్మిన్

లండన్: వింబుల్డన్‌లో సీడెడ్ ప్లేయర్ల జోరు కొనసాగుతోంది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్, 12వ సీడ్ టామీ పాల్, 10వ సీడ్ దిమిత్రోవ్, మహిళల్లో 2వ సీడ్ కొకొ గాఫ్, 7వ సీడ్ జాస్మిన్ పావొలిని, 12వ సీడ్ మాడిసన్ కీస్, 19వ సీడ్ ఎమ్మా నవారో ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు. ఐదుసెట్ల పాటు ఉత్కంఠగా సాగిన మూడోరౌండ్ పోరులో మూడోసీడ్ అల్కారజ్ 5-7, 6-2, 4-6, 7-6(2), 6-2తో అమెరికాకు చెందిన 29వ సీడ్ ఫ్రాన్సెస్ టియాఫోపై విజయం సాధించాడు. అల్కారజ్ రెండుసెట్లు కోల్పోయినా, కీలక సమయాల్లో పాయింట్లు రాబట్టి ప్రత్యర్థిపై పైచేయి సాధించాడు. పాల్ 6-3, 6-4, 6-2తో బబ్లిక్ (కజకిస్థాన్)ను, దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-4, 6-3తో మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)ను ఓడించారు. ఇక, తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలోనున్న జర్మన్ స్టార్, 4వ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-2, 6-1, 6-4తో మార్కోస్ గిరోన్ (అమెరికా)పై గెలిచి మూడోరౌండ్ చేరాడు. మహిళల మూడోరౌండ్లో ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్టు జాస్మిన్ (ఇటలీ) 7-6(4), 6-1తో బియాంక ఆండ్రెస్కూపై, గాఫ్ (అమెరికా) 6-4, 6-0తో సోనే కర్తల్ (ఇంగ్లండ్)పై, కీస్ (అమెరికా) 6-4, 6-3తో 18వ సీడ్ మార్టా కొస్త్యుక్ (ఉక్రెయిన్)పై, నవారో (అమెరికా) 2-6, 6-3, 6-4తో ష్నీదెర్ (రష్యా)పై నెగ్గగా.. అన్‌సీడెడ్ పౌలా బడోసా (స్పెయిన్) 7-6(6), 4-6, 6-4తో 14వ సీడ్ కసత్కినా (రష్యా)కు షాకిచ్చింది.

**యుకీ జోడీ అవుట్:** వింబుల్డన్‌లో భారత ఆటగాడు యుకీ భాంబ్రీ పోరాటం ముగిసింది పురుషుల డబుల్స్ రెండోరౌండ్లో యుకీ-అల్బానో (ఫ్రాన్స్) జోడీ 6-4, 4-6, 3-6తో జర్మనీకి చెందిన 8వ సీడ్ ద్వయం టిమ్-కెవిన్ జంట చేతిలో ఓటమిపాలైంది. ఇక, సోదరుడు జేమీ మర్రేతో కలిసి డబుల్స్ బరిలోకి దిగిన లోకల్ స్టార్ ఆండీ మర్రేకు నిరాశే ఎదురైంది. ముర్రే సోదర ద్వయం 6-7(8), 4-6తో రింకీ హిజికట-జాన్ పీర్స్ జంట చేతిలో ఓడింది. మర్రే ఆశలన్నీ మిక్స్‌డ్ డబుల్స్‌పైనే. రదుకానుతో కలిసి మిక్స్‌డ్‌లో ఆడనున్నాడు.

## నా కల నెరవేరింది


మహ్మద్ సిరాజ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టీ20 వరల్డ్‌కప్ సాధించిన భారత జట్టు సభ్యుడు, పేసర్ మహ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్‌లో అభిమానులు బ్రహ్మరథం పట్టారు. శుక్రవారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న సిరాజ్ మాట్లాడుతూ అభిమానుల ప్రేమ, మద్దతు చూస్తుంటే మనసు పులకరిస్తోందన్నాడు. టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించడం గర్వంగా ఉందని, వరల్డ్‌కప్ ముద్దాడాలన్న తన కల నెరవేరినందుకు ఆనందంగా ఉందని చెప్పాడు. అనంతరం మెహిదీపట్నం నుంచి దాదాపు 2 కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. అంతకుముందు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో హెచ్‌సీఏ సీఈఓ సునీల్..సిరాజ్‌కు స్వాగతం పలికాడు.

## ప్రజ్ఞానంద, గుకేశ్‌లకు తప్పని డ్రా

బుఖారెస్ట్ (రొమేనియా): సూపర్ బెట్ క్లాసిక్ చెస్ టోర్నమెంట్ ఎనిమిదో రౌండ్లోనూ డ్రాల పరంపరే కొనసాగింది. ఒక్క గేమ్‌లో కూడా ఫలితం రాలేదు. ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన ఎనిమిదో రౌండ్‌ను ప్రజ్ఞానంద్ల డ్రాగా ముగించాడు. అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో గేమ్‌ను గుకేశ్ డ్రా చేసుకున్నాడు. అలీరెజాతో నెపోమ్నియాచి, నోదిర్‌బెక్‌తో డీక్ బోగ్డాన్, మాగ్జిమ్‌తో వెస్లీ పాయింట్ పంచుకున్నారు. మరొక్క రౌండ్ మిగిలున్న టోర్నీలో కరువానా (5) టాప్‌లో కొనసాగుతుండగా, ప్రజ్ఞానంద, గుకేశ్, అలీరెజా తలా 4.5 పాయింట్లతో సంయుక్తంగా రెండోస్థానంలో ఉన్నారు.

## సెమీస్‌లో స్పెయిన్

జర్మనీపై 2-1తో గెలుపు ● యూరో కప్

హాంబర్గ్: యూరో కప్ ఫుట్‌బాల్ సమరంలో స్పెయిన్ సత్తా చాటింది. జర్మనీపై మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుతూ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం ఉత్కంఠగా సాగిన క్వార్టర్‌ఫైనల్ పోరులో స్పెయిన్ 2-1తో జర్మనీపై గెలుపొందింది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. స్పెయిన్ తరఫున డాని ఓల్మో (51వ), జర్మనీ నుంచి ఫ్లోరియన్ (89వ) చెరో గోల్ కొట్టారు. దీంతో ఫలితం కోసం దారితీసిన ఎక్స్‌ట్రా టైమ్‌లో మికెల్ మెరినో 119వ నిమిషంలో గోల్ సాధించి స్పెయిన్‌కు విజయాన్ని అందించాడు. శనివారం జరిగే క్వార్టర్‌ఫైనల్స్‌లో ఇంగ్లండ్‌తో స్విట్జర్లాండ్ (రా. 9.30 నుంచి), నెదర్లాండ్స్‌తో టర్కీ (అర్ధరాత్రి 12.30 నుంచి) తలపడనున్నాయి.

## టీమిండియాకు 'మహా' నజరానా రూ. 11 కోట్లు

ముంబై: టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే రూ. 11 కోట్లు నజరానా ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం విధానసభలో జరిగిన కార్యక్రమంలో తమ రాష్ట్రానికి చెందిన విజేత జట్టులోని సభ్యులు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, యశస్వి జైస్వాల్‌లను షిండే సత్కరించారు.

# జియో నుంచి బాహుబలి ఐపీఓ!

రూ.55,500 కోట్ల సమీకరణ.. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏజీఎంలో స్పష్టత


రూ.11.11 లక్షల కోట్ల వాల్యుయేషన్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో భారీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సన్నాహాలు చేస్తోంది. వచ్చే ఏడాది మార్కెట్‌కు వచ్చే ఈ ఐపీఓ సైజు ఎంత లేదన్నా రూ.55,500 కోట్ల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా. దేశ ఐపీఓ మార్కెట్ చరిత్రలో ఇప్పటి వరకు మరే కంపెనీ ఇంత భారీ ఐపీఓ జారీ చేయలేదు. 2022లో మార్కెట్‌కు వచ్చిన రూ.21,000 కోట్ల ఎల్ఐసీ పబ్లిక్ ఇష్యూనే ఇప్పటి వరకు మన దేశ ఐపీఓ చరిత్రలో అతి పెద్ద ఐపీఓ. రిలయన్స్ జియో ఐపీఓ గురించి ముకేశ్ అంబానీ వచ్చే నెలలో జరిగే రిలయన్స్ ఇండస్ట్రీస్ అసాధారణ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఒక ప్రకటన చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**సంకేతాలు ఇవే:** జియో ఇటీవలే టారిఫ్‌లను 11 నుంచి 27 శాతం వరకు పెంచింది. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వెంటనే ఈ విషయంలో జియోను అనుసరించాయి. 5జీ పెట్టుబడులను సొమ్ము చేసుకునేందుకు జియో ప్రయత్నిస్తోంది. వీటికి తోడు జియో వచ్చే ఏడాది ప్రారంభంలో మరోసారి టారిఫ్‌లు పెంచుతుందని అంచనా. ఇవన్నీ జియో ఐపీఓకు సిద్ధమవుతోందనేందుకు సంకేతాలని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చర్యలతో జియో ఏఆర్‌పీయూ మరింత పెరిగి.. ఐపీఓకి పెద్దఎత్తున మదుపరులను ఆకర్షించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

జెఫ్రీస్ సంస్థ అంచనాల ప్రకారం ప్రస్తుతం రిలయన్స్ జియో విలువ 13,300 కోట్ల డాలర్లు. ప్రస్తుత మారకం రేటు ప్రకారం ఇది దాదాపు రూ.11.11 లక్షల కోట్లకు సమానం. సెబీ నిబంధనల ప్రకారం రూ.లక్ష కోట్ల కంటే అధిక విలువ ఉన్న కంపెనీలు ఐపీఓకు వస్తే కనీసం 5 శాతం ఈక్విటీని జారీ చేయాలి. రూ.11.11 లక్షల కోట్ల వాల్యుయేషన్‌ని ప్రాతిపదికగా తీసుకుంటే జియో తన ఈక్విటీలో ఐదు శాతాన్ని పబ్లిక్ ఇష్యూ ద్వారా జారీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత వాల్యుయేషన్ ప్రకారం అప్పుడు జియో ఐపీఓ విలువ రూ.55,500 కోట్ల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా.

# స్టీల్ రంగానికి మంచి భవిష్యత్

### చైనా దిగుమతులను కట్టడి చేయాలి

### సెయిల్ చైర్మన్ అమరేందు ప్రకాశ్




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌లో స్టీల్ రంగానికి మంచి భవిష్యత్ ఉందని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) చైర్మన్ అమరేందు ప్రకాశ్ అన్నారు. ఇండియన్ స్టీల్ అసోసియేషన్ (ఐఎస్ఏ) శుక్రవారం నాడిక్కడ నిర్వహించిన 'స్టీల్ ఇన్‌ఫ్రాబిల్డ్ సదస్సు'లో ఆయన ఈ విషయం చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పట్టణ, నగర ప్రాంతాల్లో స్టీల్ వినియోగం ఎక్కువగానే ఉన్నా, ఈ రెండు రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం స్టీల్ వినియోగాన్ని మరింత పెంచాల్సి ఉందన్నారు. ఇందుకోసం సివిల్ ఇంజనీర్లతో పాటు తాపీ పని వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలు మౌలిక సదుపాయాల కంపెనీలకు కేంద్రంగా మారిన హైదరాబాద్.. స్టీల్ పరిశ్రమకు అత్యంత కీలకమైనదని ప్రకాశ్ తెలిపారు.

**స్టీల్ సగటు వినియోగం 97 కిలోలే:** సదస్సు అనంతరం సెయిల్ చైర్మన్ ప్రకాశ్ మీడియాతో మాట్లాడుతూ.. మన దేశంలో స్టీల్ పరిశ్రమ భవిష్యత్‌కు ఢోకా లేదన్నారు. ప్రపంచ వార్షిక తలసరి సగటు స్టీల్ వినియోగం ప్రస్తుతం 220 కిలోలు ఉంటే, మన దేశంలో ఇది 97 కిలోలు మాత్రమేనన్నారు. 2030 నాటికి ఇది 120 కిలోలకు చేరే అవకాశం ఉందన్నారు. మౌలిక ప్రాజెక్టులు, నిర్మాణ రంగం జోరందుకోవడంతో గత పదేళ్లలో దేశంలో స్టీల్ వినియోగం రెట్టింపైన విషయాన్ని సెయిల్ చైర్మన్ గుర్తు చేశారు. 2030 నాటికి దేశంలో 30 కోట్ల టన్నుల వార్షిక స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం సాధ్యమేనని తెలిపారు. ఇందుకు అవసరమైన ఇనుప ఖనిజం నిల్వలూ మన దేశంలో పుష్కలంగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మరో కీలక ముడి పదార్థమైన మెటలర్జికల్, కోకింగ్ కోల్ విషయంలోనే దిగుమతులపై ఆధారపడాల్సి ఉంటుందని ప్రకాశ్ చెప్పారు.

**చైనా దిగుమతులకు చెక్ చెప్పాల్సిందే:** ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ ధరకు వచ్చిపడుతున్న చైనా స్టీల్ దిగుమతులను కట్టడి చేయడం తప్పనిసరని ప్రకాశ్ అన్నారు. లేకపోతే దేశీయ స్టీల్ పరిశ్రమ మనుగడే ప్రమాదంలో పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చౌకగా వచ్చిపడుతున్న చైనా స్టీల్ దిగుమతులపై అమెరికా, ఈయూ దేశాలతో పాటు మలేషియా, ఇండోనేషియా దేశాలూ ఇప్పటికే దిగుమతి సుంకాలు భారీగా పెంచిన విషయాన్ని ప్రకాశ్ గుర్తు చేశారు. కాగా ఈ కార్యక్రమంలో జిందాల్ స్టీల్ చైర్మన్, ఐఎస్ఏ ప్రెసిడెంట్ నవీన్ జిందాల్, ఉక్కు శాఖ కార్యదర్శి నాగేంద్ర నాథ్ మిశ్రా పాల్గొన్నారు.

### విశాఖ ఉక్కుపై ప్రతిపాదనేదీ రాలేదు..

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్, వైజాగ్ స్టీల్)ను విలీనం చేసుకోవడంపైనా సెయిల్ చైర్మన్ ప్రకాశ్ స్పందించారు. ప్రస్తుతమైతే ఇప్పటి వరకు దీనిపై తమకు స్పష్టమైన ప్రతిపాదన ఏదీ రాలేదన్నారు. పీకల్లోతు నష్టాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వైజాగ్ స్టీల్ ప్లాంటుని ప్రైవేటీకరించే బదులు, ప్రభుత్వ రంగంలోని సెయిల్‌లో విలీనం చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సెయిల్ చైర్మన్ తాజా ప్రకటనను బట్టి చూస్తుంటే, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రతిపాదన వస్తే విశాఖ ఉక్కును సెయిల్ విలీనం చేసుకునేందుకు సిద్ధంగానే ఉన్నట్టు అర్థమవుతోంది.

# బిజినెస్

## డిమాండ్‌కు ఢోకా లేదు

### 2034 నాటికి 27.5 కోట్ల టన్నుల స్టీల్ వినియోగం

### తెలంగాణలో జోరుగా డిమాండ్ : డెలాయిట్

దేశంలో స్టీల్ డిమాండ్‌కు ఢోకా లేదని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ ఒక నివేదికలో తెలిపింది. 'స్టీల్ ఇన్‌ఫ్రాబిల్డ్ సదస్సు' సందర్భంగా సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం 2033-34 ఆర్థిక సంవత్సరం చివరికి దేశంలో స్టీల్ డిమాండ్ 22.1 కోట్ల టన్నుల నుంచి 27.5 కోట్ల టన్నుల మధ్య ఉంటుందని అంచనా. మౌలిక ప్రాజెక్టుల్లో పెరుగుతున్న ప్రభుత్వ పెట్టుబడులు ఇందుకు ప్రధానంగా దోహదం చేయనున్నాయి. వచ్చే పదేళ్లలో దేశంలో స్టీల్ డిమాండ్ ఏటా సగటున 5 నుంచి 7.3% పెరుగుతుందని నివేదిక తెలిపింది. కాగా ప్రస్తుతం దేశంలో వార్షిక తలసరి సగటు స్టీల్ వినియోగం 93 నుంచి 95 కిలోలుగా ఉండగా తెలంగాణలో మాత్రం ఇది 156.43 కిలోల వరకు ఉందని తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో 54.8 లక్షల టన్నుల స్టీల్ వినియోగమైంది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 15.75 శాతం ఎక్కువ. పారిశ్రామికీకరణతో పాటు వేగంగా పెరుగుతున్న ఆర్థిక వృద్ధి భవిష్యత్‌లోనూ తెలంగాణలో స్టీల్ డిమాండ్‌ను మరింత పెంచుతుందని అంచనా వేసింది.

# కొత్త శిఖరంపై నిఫ్టీ

### ఆటుపోట్ల మార్కెట్లో నష్టాల్లో సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ శుక్రవారం తీవ్ర ఆటుపోట్లతో ట్రేడయినప్పటికీ నిఫ్టీ మాత్రం ఒత్తిడిని తట్టుకుని మరో జీవితకాల రికార్డు స్థాయిలో ముగిసింది. అయితే సెన్సెక్స్ మాత్రం రికార్డు స్థాయిల నుంచి దిగజారి 80,000 పాయింట్ల కన్నా దిగువన క్లోజయింది. ఇది మార్కెట్లో అనిశ్చిత స్థితిని తెలియచేస్తోంది. వరుసగా మూడో రోజు కూడా లాభపడిన నిఫ్టీ 21.70 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయి 24,323.85 వద్ద ముగిసింది. నిఫ్టీ షేర్లలో 34 లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ మాత్రం 53.07 పాయింట్లు నష్టపోయి 79,996.60 వద్ద ముగిసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 963.87 పాయింట్లు, నిఫ్టీ 313.25 పాయింట్లు లాభపడ్డాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.75 శాతం లాభపడ్డాయి.

- రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 3 శాతం లాభపడి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.3197.65 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో అత్యంత విలువైనదిగా గుర్తింపు పొందిన ఈ షేరు మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.48,723.54 కోట్లు లాభపడి రూ.21,51,562.56 కోట్ల వద్ద క్లోజయింది.
- రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని వేరు చేయనున్నట్టు చేసిన ప్రకటనతో రేమండ్ షేరు 10 శాతం మేరకు దూసుకుపోయింది. ఎన్ఎస్ఈలో ఈ షేరు 9.97 శాతం లాభపడి రూ.3233.05 వద్ద ముగియగా బీఎస్ఈలో 9.68 శాతం లాభపడి రూ.3226.70 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది.

### స్టీల్ పాత్రలపై బీఐఎస్ ముద్ర ఉండాల్సిందే

వంట గదుల్లో వాడే స్టెయిన్‌లెస్ స్టీల్, అల్యూమినియం పాత్రలపై నాణ్యతా ప్రమాణాలకు చిహ్నమైన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ముద్ర ఉండాల్సిందేనని ప్రభుత్వం అధికారిక ప్రకటన జారీ చేసింది. వినియోగదారుల భద్రత, ఉత్పత్తుల నాణ్యతను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు అనుబంధంగా పని చేస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య శాఖ (డీపీఐఐటీ) మార్చి 14వ తేదీన ఈ నాణ్యతా ప్రమాణ ఉత్తర్వును జారీ చేసింది. బీఐఎస్ ప్రమాణ చిహ్నం లేని స్టెయిన్‌లెస్ స్టీల్, అల్యూమినియం పాత్రల తయారీ, దిగుమతి, విక్రయం, పంపిణీ, నిల్వ, ప్రదర్శన అన్నింటినీ ఈ ఉత్తర్వు నిషేధించింది.

### విదేశీ మారక నిల్వలు డౌన్

దేశంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు జూన్ 28వ తేదీతో ముగిసిన వారంలో 171.3 కోట్ల డాలర్ల మేరకు తగ్గి 65,199.7 కోట్ల డాలర్లకు క్షీణించాయి. జూన్ 7వ తేదీతో ముగిసిన వారంలో ఇవి చారిత్రక గరిష్ఠ స్థాయి 65,581.7 కోట్ల డాలర్లకు చేరాయి. బంగారం నిల్వలు 42.7 కోట్ల డాలర్ల మేరకు దిగజారి 5,652.8 కోట్ల డాలర్ల వద్ద స్థిరపడ్డాయి.

### సిగ్నిటీలో మరో 17 శాతం వాటా కొనుగోలు

డీల్ విలువ రూ.645 కోట్లు

కోఫోర్జ్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సిగ్నిటీ టెక్నాలజీస్‌లో మరో 17 శాతం వాటాను రూ.645 కోట్లకు ఐటీ కంపెనీ కోఫోర్జ్ చేజిక్కించుకుంది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా సిగ్నిటీలో 16.9 శాతం వాటాకు సమానమైన 46,18,199 షేర్లను కంపెనీ కొనుగోలు చేసింది. ఒక్కో షేరును సగటున రూ. 1,398.50కి కొనుగోలు చేసింది. సిగ్నిటీ వాటాదారులైన కుకునూరు మాధవ లక్ష్మీ, కుకునూరు కుమార్ బాపూజీ సహా కంపెనీ ప్రమోటర్లయిన స్వప్న పీ, వెంకట సుబ్రమణ్యం చక్కిలం నుంచి కోఫోర్జ్ ఈ వాటాలను కొనుగోలు చేసినట్టు బీఎస్ఈ గణాంకాలు వెల్లడించాయి. ఈ ఏడాది మే నెలలో సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 54 శాతం వాటాలను కోఫోర్జ్ చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. గురువారం కూడా కోఫోర్జ్.. సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 11 శాతం వాటాను రూ.426 కోట్లకు కొనుగోలు చేసింది.


## ద్వితీయ శ్రేణి నగరాల్లో ఇళ్లకు గిరాకీ

ప్రాప్‌ఈక్విటీ

### జాబితాలో విజయవాడ, గుంటూరు, వైజాగ్


న్యూఢిల్లీ: దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఇళ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) దేశంలోని 30 ద్వితీయ శ్రేణి నగరాల్లో ఇళ్ల అమ్మకాలు 2.07 లక్షలకు చేరాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువని రియల్టీ డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ తెలిపింది. ఈ సంస్థ విడుదల చేసిన ఈ 30 ద్వితీయ శ్రేణి నగరాల జాబితాలో అహ్మదాబాద్, వడోదర, సూరత్, నాసిక్, గాంధీనగర్, జైపూర్, నాగపూర్, భువనేశ్వర్, మొహాలీతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు కూడా ఉన్నాయి. ఈ 30 చిన్న నగరాల్లో గత ఆర్థిక సంవత్సరం అమ్ముడైన ఇళ్లలో 80 శాతం (1.68 లక్షలు).. టాప్-10 నగరాల్లో అమ్ముడైనట్టు ప్రాప్‌ఈక్విటీ తెలిపింది. మధ్య తరగతికి సైతం అందుబాటు ధరల్లో ఇళ్లు లభించటం, ఈ నగరాల్లో మౌలిక సదుపాయాలు పెరగటంతో పాటు శరవేగంగా అభివృద్ధి చెందుతుండడం, పెద్దఎత్తున ఎస్ఎంఈలు ఏర్పాటవుతండటం ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయని పేర్కొంది.

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)




| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 73,100 ▲ | 67,100 ▲ | 97,700 ▲ |
| ముంబై | 72,640 ▲ | 66,538 ▲ | 90,709 ▲ |

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 6వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 525 | విజయవాడ | 540 |
| వరంగల్ | 527 | గోదావరి | 540 |
| చిత్తూరు | 573 | విశాఖపట్నం | 555 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 114 | విజయవాడ | 123 |
| వరంగల్ | 114 | గుంటూరు | 123 |
| కరీంనగర్ | 114 | ఒంగోలు | 123 |
| మహబూబ్‌నగర్ | 114 | చిత్తూరు | 125 |
| కర్నూలు | 114 | నెల్లూరు | 125 |
| విశాఖపట్నం | 124 | అనంతపురం | 123 |
| గోదావరి | 123 | | |

# గ్యాస్ బైక్ వచ్చేసింది!

**» బజాజ్ నుంచి ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్**

పుణె, జూలై 5: ఇప్పటిదాకా మనం గ్యాస్‌తో నడిచే కార్లను మాత్రమే చూశాం. ఇకపై గ్యాస్‌తో నడిచే బైక్‌లు కూడా అందుబాటులోకి రానున్నాయి. బజాజ్ ఆటో సంస్థ ఈ విప్లవాత్మక పరిణామానికి నాంది పలికింది. ప్రపంచంలోని మొట్టమొదటి సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) బైక్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఫ్రీడమ్ 125 పేరిట దీనిని ఆవిష్కరించింది. కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బజాజ్ ఈ వాహనాన్ని పుణెలోని కంపెనీ ప్లాంట్‌లో ఆవిష్కరించారు. గ్యాస్‌తోపాటు పెట్రోల్‌తో కూడా నడిచేలా రెండు ఆప్షన్లతో కూడిన ట్యాంక్‌తో ఈ బైక్‌ను రూపొందించారు. ఈ బైక్ ప్రారంభ ధర రూ.95 వేల నుంచి ఉంటుంది. మూడు వేరియంట్లతో దీనిని మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. డిస్క్ ఎల్ఈడీ, డ్రమ్ ఎల్ఈడీ, డ్రమ్ వేరియంట్లలో ఫ్రీడమ్ 125 బైక్ లభిస్తుంది. డిస్క్ ఎల్ఈడీ బైక్‌లు ఐదు రంగుల్లో, నాన్ ఎల్ఈడీ డ్రమ్ వేరియంట్ బైక్ రెండు రంగుల్లోనూ లభిస్తాయి. డ్రమ్ వేరియంట్ బైక్ ధరను రూ.95 వేలుగా నిర్ణయించగా, డ్రమ్ ఎల్ఈడీ బైక్ ధర రూ.1.05 లక్షలు, డిస్క్ ఎల్ఈడీ బైక్ ధర రూ.1.10 లక్షలుగా నిర్ణయించారు. ఇక ఫీచర్ల విషయానికొస్తే.. 125 సీసీ ఇంజిన్ కలిగిన ఫ్రీడమ్ 125 బైక్‌లో 2 లీటర్ల సామర్థ్యం కలిగిన పెట్రోల్ ట్యాంక్, 2 కిలోల సీఎన్‌జీ ట్యాంక్ ఉంటాయి. 2 కిలోల సీఎన్‌జీతో 200 కిలోమీటర్ల దూరం, 2 లీటర్ల పెట్రోల్‌తో 130 కిలోమీటర్ల దూరం కలిపి మొత్తం 330 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. బైక్ రన్నింగ్‌లో ఉండగానే గ్యాస్ నుంచి పెట్రోల్‌కు, పెట్రోల్ నుంచి గ్యాస్‌కు మార్చుకునే స్విచ్ ఏర్పాటు కూడా ఉంటుంది. ఆవిష్కరణ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ.. సాధారణ పెట్రోల్ బైక్‌ల సగటు వ్యయం కిలోమీటరుకు రూ.2.25 అవుతుందని, కానీ.. సీఎన్‌జీ బైక్‌తో ఈ ఖర్చు కిలోమీటరుకు రూ.1కి తగ్గనుందని అన్నారు. ముడి చమురును దిగుమతి చేసుకునే అవసరాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించుకునే అవకాశం ఫ్రీడమ్ 125 బైక్ ద్వారా కలుగుతుందన్నారు.

ఫ్రీడమ్ 125 బైక్‌ను తొలుత మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో మాత్రమే అందుబాటులోకి తేనున్నట్లు.. ఆ తర్వాత దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ విక్రయించనున్నట్లు బజాజ్ ఆటో కంపెనీ తెలిపింది. బజాజ్ షోరూమ్‌లతో పాటు కంపెనీ వెబ్‌సైట్ ద్వారా కూడా ఈ వాహనాన్ని బుక్ చేసుకోవచ్చునని పేర్కొంది.

## ట్రూ కాలర్ లేకున్నా.. కాలర్ పేరు

**» ఈ నెల 15 నుంచి ట్రాయ్ కొత్త సదుపాయం**

న్యూఢిల్లీ, జూలై 5: ట్రూ కాలర్‌ను ఉపయోగించకుండానే మనకు ఫోన్ చేసిన వారి పేరును తెలుసుకునే సదుపాయాన్ని ట్రాయ్ అందుబాటులోకి తీసుకువస్తోంది. మన ఫోన్లో అవతలి వాళ్ల ఫోన్‌నంబర్ సేవ్ చేసి లేకపోయినా, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు వచ్చినా.. వారి పేర్లు మన మొబైల్ స్క్రీన్‌పై కనిపించేలా 'పేరు వెల్లడి సేవ' (నేమ్ ప్రజెంటేషన్ సర్వీస్)ను ప్రవేశపెట్టనుంది. ఈ నెల 15వ తేదీన ఈ సేవలను యాక్టివేట్ చేయనుంది. సిమ్ కార్డు కొన్నప్పుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా కాలర్ల పేర్లు కనిపిస్తాయని సమాచారం. ఫోన్ ఎవరు చేస్తున్నారో గుర్తించడానికి ప్రస్తుతం చాలా మంది 'ట్రూ కాలర్' యాప్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే, దీని వల్ల సమాచార భద్రతపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలోనే ట్రాయ్ ఈ సదుపాయాన్ని తీసుకువస్తోంది.

## లోకం తీరు




# నీట్‌ను రద్దు చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేసి కొత్తగా పరీక్ష నిర్వహించడం హేతుబద్ధం కాదని స్పష్టం చేసింది. అలా నిజాయతీగా పరీక్ష రాసిన లక్షలాది విద్యార్థుల ప్రయోజనాలను కాపాడడానికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొంది. నీట్ యూజీ ప్రశ్నాపత్రాల లీకేజీ సహా పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయంటూ సుప్రీంకోర్టులో దాఖలైన పలు పిటిషన్లపై.. కేంద్ర విద్యా శాఖ శుక్రవారం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తునకు సీబీఐని ఆదేశించినట్లు అందులో పేర్కొంది. అలాగే.. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో పరీక్షలను సమర్థంగా, సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కోర్టుకు తెలిపింది. కేంద్రం బాటలోనే.. ఎన్‌టీఏ కూడా నీట్ పరీక్ష రద్దును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ పరీక్షను ఎలాంటి అక్రమాలకూ తావులేకుండా జరిపామని.. మాల్‌ప్రాక్టీస్ జరిగినట్టు వస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని.. పట్నా, గోధ్రాలోని కేంద్రాలలో మాత్రమే అక్రమాలు జరిగాయని పేర్కొంది. వ్యక్తిగత సంఘటనల ఆధారంగా మొత్తం పరీక్షను రద్దు చేయొద్దని ఎన్‌టీఏ విజ్ఞప్తి చేసింది. అలా రద్దు చేయడం వ్యతిరేక ప్రభావాన్ని చూపుతుందని.. మరీ ముఖ్యంగా అర్హులైన అభ్యర్థుల కెరీర్ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసింది. కాగా.. నీట్ అక్రమాలపై దాఖలైన పిటిషన్లపై.. సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ నెల 8న విచారణ జరపనుంది.

## ఆగస్టు 11న నీట్-పీజీ పరీక్ష

న్యూఢిల్లీ, జూలై 5: వాయిదా పడ్డ నీట్-పీజీ పరీక్షను ఆగస్టు 11న నిర్వహించనున్నట్టు 'నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్)' శుక్రవారం ప్రకటించింది. ఈ పరీక్షను రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తామని పేర్కొంటూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే, 2024 ఆగస్టు 15లోపు తమ ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకునేవారంతా ఈ పరీక్ష రాయడానికి అర్హులేనని అందులో పేర్కొంది. నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో.. జూన్ 23న జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను ముందుజాగ్రత్త చర్యగా వాయిదా వేస్తున్నట్టు కేంద్రం జూన్ 22న ప్రకటించిన సంగతి తెలిసిందే. వైద్యవిద్యలో పీజీ కోర్సుల్లో ప్రవేశం నిమిత్తం నిర్వహించే ఈ పరీక్ష రాసేందుకు దేశవ్యాప్తంగా 2లక్షల మంది పోటీపడుతున్నారు.

## పుట్టుకతోనే ఎవరూ క్రిమినల్స్ కారు: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 5: పుట్టుకతోనే ఎవరూ క్రిమినల్స్ కాదని, పరిస్థితులే వారిని నేరస్తులుగా మార్చుతాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పలు కారణాల ప్రభావంతో వారు నేరాలు చేస్తారని, వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని మానవత్వంతో విచారణ జరపాల్సి ఉంటుందని పేర్కొంది. విచారణ ప్రారంభం కాకపోవడంతో నాలుగేళ్లుగా జైలులో ఉన్న నకిలీ కరెన్సీ కేసు నిందితునికి బెయిల్ మంజూరు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. పాకిస్థాన్ నుంచి నకిలీ రూ.2000 కరెన్సీ నోట్లు తీసుకొచ్చాడన్న ఆరోపణ మీద ముంబయికి చెందిన ఓ వ్యక్తిని 2020 ఫిబ్రవరిలో పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 1193 నోట్లు ఉన్న బ్యాగును కూడా స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి కస్టడీలో ఉన్న అతనికి బెయిల్ ఇచ్చేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో బాంబే హైకోర్టు నిరాకరించింది. దాంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. నిందితుడు నాలుగేళ్లుగా జైలులో ఉన్న విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఒకవేళ సత్వరమే విచారణ జరిగి ఉంటే శిక్షా కాలం ఇప్పటికే పూర్తయి ఉండేదని తెలిపింది.

## క్రమశిక్షణ కోసం కొడితే టీచరుపై కేసు పెట్టొద్దు

కోచి, జూలై 5: క్రమశిక్షణ పెంపొందించాలన్న సదుద్దేశంలో విద్యార్థులను కొట్టే ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు పెట్టకూడదని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. తోత్తువలోని సెయింట్ జోసఫ్ స్కూల్ ప్రిన్సిపాల్, అక్కడి ఇంగ్లిష్ టీచరు జోమీపై పెట్టిన కేసులను కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదివే 13 ఏళ్ల విద్యార్థినికి మంచి మార్కులు రాకపోవడంతో ఆమెను టీచరు జోమీ కొట్టారు. దాంతో తల్లిదండ్రులు ఆమెపైనా, పాఠశాల ప్రిన్సిపాల్‌పైనా కొడనాడ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఐపీసీ సెక్షన్ 324, జువెనైల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 82 కింద కేసు పెట్టారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 75 కింద నేరం చేసినట్టు పేర్కొన్నారు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఆ బాలికను దండించడంలో ఎలాంటి దురుద్దేశాలు లేవని తెలిపారు. ఆమెను క్రమశిక్షణలో ఉంచాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు ఇచ్చిన అవ్యక్త అధికారంతో ఈ చర్య తీసుకున్నట్టు చెప్పారు. ఈ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు.

## వాట్సాప్ సంభాషణలు సాక్ష్యాలు కావు

న్యూఢిల్లీ, జూలై 5: వాట్సాప్ సంభాషణలను ఎవిడెన్స్ యాక్ట్-1872 ప్రకారం సాక్ష్యాలుగా పరిగణించలేమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అవి వాస్తవమైనవేనంటూ తగిన ధ్రువీకరణ పత్రం ఉంటే తప్ప సాక్ష్యంగా గుర్తించలేమని తెలిపింది. ఢిల్లీ వినియోగదారుల ఫోరం ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ న్యాయమూర్తి జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ ఈ మేరకు నిర్ణయాన్ని వెలువరించారు. డెల్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ సంస్థపై అదీల్ ఫిరోజ్ అనే వినియోగదారుడు 2022లో జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు పెట్టాడు. డెల్ సంస్థ మాత్రం 2023 డిసెంబరు 31న ఫోరంలో తన సమాధానాన్ని సమర్పించింది. ఫిర్యాదుకు సంబంధించిన అన్ని పత్రాలు తమకు అందనందున సమాధానం ఇవ్వడంలో జాప్యం జరిగిందని పేర్కొంది. ఇందుకు సాక్ష్యంగా వాట్సాప్‌లో ఫిర్యాదుదారు ఫిరోజ్, తమ సంస్థ ప్రతినిధుల మధ్య జరిగిన సంభాషణల స్క్రీన్‌షాట్లను సమర్పించింది. అయితే జిల్లా ఫోరం ఈ స్క్రీన్ షాట్లను సాక్ష్యంగా ఆమోదించలేదు. దీనిపై డెల్ రాష్ట్ర ఫోరం, ఆ తర్వాత హైకోర్టును ఆశ్రయించగా... హైకోర్టు కూడా వినియోగదారుల ఫోరాలతో ఏకీభవించింది.

## ప్రజ్వల్ లైంగిక సమర్థతలో లోపాల్లేవు

బెంగళూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): లైంగిక దాడుల కేసుల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సమర్థ పురుషుడు అని వైద్య పరీక్షల్లో నిర్ధారించారు. రెండు కేసులకు సంబంధించి రెండుసార్లు ప్రజ్వల్‌కు కోర్టు అనుమతితో బౌరింగ్ ఆసుపత్రిలో పురుషత్వ పరీక్షలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన నివేదికలు సిట్ అధికారులకు శుక్రవారం చేరాయి. ప్రజ్వల్ సమర్థ పురుషుడని మెడికల్ రిపోర్టులు తేల్చాయి. ఇక ధ్వని పరీక్ష, ఇతర పరీక్షలకు సంబంధించి ఎఫ్ఎస్ఎల్ నివేదికలు రావాల్సి ఉంది.

## రైళ్లలో కొత్తగా 2,500 జనరల్ బోగీలు!

న్యూఢిల్లీ, జూలై 5: రైళ్లలో త్వరలో కొత్తగా 2,500 జనరల్ బోగీలు అందుబాటులోకి రానున్నాయి. ఈ బోగీల తయారీకి ఆమోదం తెలిపినట్లు రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. వీటితో కలిపి మొత్తం 10 వేల అదనపు బోగీల ఉత్పత్తికి అనుమతిచ్చినట్లు వివరించారు. అలాగే, 50 అమృత్ భారత్ రైళ్లు కూడా ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది ప్రధాని మోదీ మాల్డా, దర్భాంగాల నుంచి నడిచే రెండు రైళ్లను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇవి విజయవంతంగా నడుస్తుండడంతో మరో 50 అమృత్ భారత్ రైళ్లు సిద్ధమవుతున్నాయి. ఇవి కాకుండా మరో150 అమృత్ భారత్ రైళ్ల ఉత్పత్తికి కూడా అనుమతులు ఇచ్చినట్లు వైష్ణవ్ వివరించారు.

# యూకే ప్రధానిగా స్టార్మర్

## ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం

**» మొత్తం 650 స్థానాల్లో 412 గెలుపు**

**» కన్జర్వేటివ్‌లకు ఘోర ఓటమి**

**» 121 సీట్లకే పరిమితం.. సునాక్ రాజీనామా**



విజయానందంలో భార్యను ముద్దాడుతున్న స్టార్మర్



10 డౌనింగ్ స్ట్రీట్ నుంచి వెళ్లిపోతున్న సునాక్ దంపతులు

లండన్, జూలై 5: ఇంగ్లిష్ గడ్డపై రాజకీయం మారింది..! మార్పు కావాలి నినాదం పనిచేసింది..! అంచనాలను నిజం చేస్తూ.. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించింది. పద్నాలుగేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అధికారాన్ని చేజిక్కించుకుంది. సవాళ్లను అధిగమిస్తూ సాగిన ఆ పార్టీ నేత కియర్ స్టార్మర్ (61) ప్రధానిగా నియమితులయ్యారు. భారత సంతతికి చెందిన రిషి సునాక్ సారథ్యంలోని కన్జర్వేటివ్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్‌తో కూడిన బ్రిటన్ పార్లమెంటులో దిగువ సభ హౌస్ ఆఫ్ కామన్స్ ఇందులో మొత్తం 650 ఎంపీ సీట్లున్నాయి. యూకే కాలమానం ప్రకారం గురువారం ఉదయం 7 గంటల (భారత్‌లో 11.30కు)కు మొదలైన పోలింగ్ 10 గంటల వరకు సాగింది. 4.60 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ వెంటనే లెక్కింపు చేపట్టారు. శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజారిటీ మార్క్ 326 సీట్లు. లేబర్ పార్టీ 412 స్థానాల్లో గెలుపొందింది. కన్జర్వేటివ్ పార్టీ 121 సీట్లతో సరిపెట్టుకుంది. అనంతరం సునాక్ బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు వెళ్లి రాజు చార్లెస్-3ని కలిసి ప్రధాని పదవికి రాజీనామా సమర్పించారు. కాగా, 23,059 ఓట్ల ఆధిక్యంతో రిచ్‌మండ్-నార్త్ అల్లెన్ నుంచి సునాక్, 18,884 ఓట్ల తేడాతో లండన్‌లోని హోల్‌బోర్న్-సెయింట్ పాన్‌క్రాస్ సీటు నుంచి స్టార్మర్ ఎంపీగా గెలిచారు. ప్యాలెస్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసిన ఆయనను. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాలని చార్లెస్ కోరారు. తదనంతరం స్టార్మర్.. యూకే 58వ ప్రధానిగా బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో రాజు సమక్షంలో ప్రమాణం చేశారు. స్టార్మర్‌కు భారత ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. సంబంధాలు బలోపేతం అయ్యేలా సకహరిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐదేళ్లలో ముగ్గురు ప్రధానులు (బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, రిషి సునాక్), సొంత పార్టీ నాయకులే విమర్శలకు దిగడంతో కన్జర్వేటివ్ ప్రభుత్వం ప్రజల్లో చులకనైంది. ఎన్నడూ లేనంతగా ఓటమి పాలైంది. కొవిడ్ సమయంలో జాన్సన్ మందు పార్టీలు, లిజ్ ట్రస్ 'మినీ బడ్జెట్' ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీశాయి. అప్పటినుంచే ప్రభుత్వ పతనం మొదలైంది. ఇక 2019లో 371 సీట్లు నెగ్గిన ఆ పార్టీ ఇప్పుడు అందులో మూడో వంతుకు పరిమితమైంది. 23.7 శాతం ఓట్లే సాధించింది. లేబర్ పార్టీ.. ఇప్పుడు 33.7 శాతం ఓట్లు తెచ్చుకుంది. లిబరల్ డెమోక్రాట్లు 60 పైగా సీట్లు నెగ్గి ఉనికిని చాటారు. నిగెల్ ఫరేజ్ స్థాపించిన రిఫార్మ్ యూకే పార్టీ 15 శాతం ఓట్లతో 4 సీట్లు నెగ్గి, పలుచోట్ల కన్జర్వేటివ్‌లను దెబ్బకొట్టింది.

### కూలీ కొడుకు ప్రధాని

కియర్ స్టార్మర్ నిరుపేద నేపథ్యం నుంచి వచ్చారు. 1962 సెప్టెంబరు 2న లండన్‌లో జన్మించారు. ఈయన తల్లి పరిశ్రమలో కూలీ. న్యాయవిద్య చదివిన స్టార్మర్ హక్కుల కేసులను వాదించేవారు. సంస్కరణలను ఇష్టపడే ఈయన రాజకీయాల్లోకి వచ్చింది 2015లోనే. ఆ ఏడాదితో పాటు 2019లో ఉత్తర లండన్ ఎంపీగా గెలిచారు. గత ఎన్నికల్లో 211 సీట్లు మాత్రమే నెగ్గిన లేబర్ పార్టీకి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, 'మార్పు' నినాదంతో పునరుత్తేజం చేశారు. సేవ, మౌలిక సదుపాయాలకు పెద్దపీట, తక్కువ ధరలకు ఇళ్ల నిర్మాణం, దేశానికే మొదటి ప్రాధాన్యం వంటి కీలక హామీలతో ప్రజల మనసు గెలిచారు.

### ఓటమికి నాదే బాధ్యత: రిషి

ఫలితాలు చూసి రిషి సునాక్ నిరాశకు గురైనా వెంటనే తేరుకున్నారు. భార్య అక్షతామూర్తితో కలిసి 10 డౌనింగ్ స్ట్రీట్ వద్ద మీడియాతో మాట్లాడారు. "ప్రధానిగా శక్తివంచన లేకుండా పనిచేశా. ప్రజలు మార్పు కోరుకున్నారు. వారి అసంతృప్తి, ఆగ్రహం నన్ను తాకాయి. ఈ తీర్పును స్వాగతిస్తున్నా. పార్టీ ఓటమికి నాదే బాధ్యత. సహచర ఎంపీల్లో చాలామంది ఓటమి బాధించింది. కన్జర్వేటివ్ సారథ్యం నుంచి కూడా తప్పుకొంటున్నా" అని ప్రకటించారు. సునాక్ 2022 అక్టోబరులో యూకే ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు.

## ఇద్దరు తెలుగు వారి ఓటమి!

**26 మంది భారత సంతతి ఎంపీల గెలుపు**

యూకే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీలుగా పోటీ చేసిన ఇద్దరు తెలంగాణ వ్యక్తులు పరాజయంపాలయ్యారు. లేబర్ పార్టీ నుంచి నార్త్ బెడ్‌ఫోర్డ్‌షైర్ నియోజకవర్గంలో బరిలో దిగిన ఉదయ్ నాగరాజు కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థి రిచర్డ్ ఫుల్లర్ చేతిలో 5 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడారు. నాగరాజు స్వస్థలం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఈయన బంధువు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చేశారు. నిజామాబాద్ జిల్లా కోటగిరికి చెందిన డాక్టర్ చంద్ర కన్నెగంటి (కన్జర్వేటివ్) స్టోక్ ఆన్ ట్రెంట్ సెంట్రల్ నియోజకవర్గంలో 6,221 ఓట్లతో మూడో స్థానానికి పరిమితం అయ్యారు. ఈయనపై లేబర్ పార్టీ అభ్యర్థి గారెత్ స్నెల్ విజయం సాధించారు. లండన్‌లో వైద్యుడిగా పనిచేస్తున్న చంద్ర.. గతంలో స్టోక్ ఆన్ ట్రెంట్‌లో కౌన్సిలర్, మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, యూకే ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 26 మంది భారత సంతతి వ్యక్తులు ఎంపీలుగా ఎన్నికయ్యారు. వీరిలో అధికులు తాజా ఎన్నికల్లో అధికారం కైవసం చేసుకున్న లేబర్ పార్టీ వారే కావడం విశేషం. కన్జర్వేటివ్ పార్టీకి చెందిన మాజీ హోం మంత్రులు ప్రీతి పటేల్, సుయెల్లా బ్రేవర్మన్ మరోసారి విజయం సాధించారు. మరో మాజీ మంత్రి క్లెయిర్ కౌటిన్హో కూడా నెగ్గారు. కన్జర్వేటివ్ పార్టీ తరఫున గగన మహీంద్ర (సౌత్‌వెస్ట్ హెర్ట్ ఫోర్డ్‌షైర్-), శివానీ రాజా (లీసెస్టర్ ఈస్ట్), సీమా మల్హోత్రా (వాల్‌సాల్), వాలెరీ వాజ్ (బ్లోక్స్‌విచ్), కీత్ వాజ్, లీసా నాండీ, సిక్కు ఎంపీలు ప్రీత్‌కౌర్ గిల్, తన్‌మంజిత్ సింగ్ ధేహి, నవేందు మిశ్రా, రథిమా విటోమ్ విజయ బావుటా ఎగురవేశారు. కాగా, లేబర్ పార్టీ నుంచి 12 మంది భారత మూలాలున్న ఎంపీలు పార్లమెంటులో తొలిసారి అడుగుపెడుతుండడం గమనార్హం.

## నిశ్శబ్ద హంతకి కొలెస్ట్రాల్

**» అదుపునకు సీఎస్ఐ మార్గదర్శకాలు**

న్యూఢిల్లీ, జూలై 5: రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయుల అసాధారణ హెచ్చుతగ్గులను(డిస్లిపిడెమియా) నివారించేందుకు కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) గురువారం మార్గదర్శకాలను విడుదల చేసింది. డిస్లిపిడెమియా నిశ్శబ్ద హంతకి వంటిదని సీఎస్ఐ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్‌చంద్ర రథ్ తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యల తరహాలో దీని లక్షణాలు ముందుగా బయటపడవని చెప్పారు. పక్షవాతం, గుండె సంబంధిత వ్యాధులకు దారితీస్తుందన్నారు. సీఎస్ఐ మార్గదర్శకాల ప్రకారం..గుండె జబ్బులు వంశపారంపర్యంగా వస్తున్న కుటుంబాలకు చెందినవారు తొలి లిపిడ్ ప్రొఫైల్‌ను 18 ఏళ్లు లేదా అంతకుంటే తక్కువ వయస్సులోనే చేయించుకోవాలి. సాధారణ ప్రజలు, ముప్పు తక్కువగా ఉన్నవారు ఎల్‌డీఎల్(చెడు కొలెస్ట్రాల్)-సీ స్థాయులను 100 ఎంజీ/డీఎల్‌కు, నాన్-హెచ్‌డీఎల్(మంచి కొలెస్ట్రాల్)-సీ స్థాయులను 130 ఎంజీ/డీఎల్‌కు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు ఉన్న వార) ఎల్‌డీఎల్-సీ స్థాయులు 70 ఎంజీ/డీఎల్‌కు, నాన్-హెచ్‌డీఎల్-సీ స్థాయులు 100 ఎంజీ/డీఎల్‌కు లోపు ఉండేలా జాగ్రత్త వహించాలి. ఆహారంలో చక్కెర, కార్బొహైడ్రేట్‌లను తక్కువగా తీసుకోవాలి. గుండె ఆరోగ్యాన్ని కాపాడే యోగా, వ్యాయామం వంటివి చేయాలి.

# హత్రాస్‌పై రాజకీయం చేయను

## బాధితులకు వీలైనంత అధికంగా, త్వరగా పరిహారం అందించాలి

**» యూపీ ప్రభుత్వానికి రాహుల్ విజ్ఞప్తి**

**» బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నేత**



హత్రాస్, జూలై5: హత్రాస్ తొక్కిసలాట ఘటనను రాజకీయం చేయాలని తాను భావించటంలేదని, అయితే, ఈ విషాదం వెనుక ప్రభుత్వ యంత్రాంగపరంగా పలు లోపాలున్నాయని కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు వీలైనంత ఎక్కువగా, త్వరగా పరిహారం అందించాలని యూపీ ప్రభుత్వాన్ని కోరారు. హత్రాస్ బాధితులను రాహుల్ శుక్రవారం పరామర్శించారు. వేకువజామునే ఢిల్లీ నుంచి బయల్దేరి వెళ్లిన రాహుల్ ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్, హత్రాస్‌ల పరిధిలోని బాధిత కుటుంబాలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, పలువురు బాధితులు ఇంకా షాక్ నుంచి తేరుకోలేదని.. పోలీసులు, అధికారులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవటం వల్లనే తొక్కిసలాట జరిగిందని వారు చెప్పారని తెలిపారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు నిరుపేదలని, వారికి వీలైనంత అధికంగా పరిహారం అందించాలని ముఖ్యమంత్రిని కోరుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. ఇచ్చే పరిహారం కూడా ఆర్నెళ్ల తర్వాతో, ఏడాది తర్వాతో కాకుండా త్వరగా అందిస్తే బాధితులకు సహాయం చేసినట్లవుతుందన్నారు. కాగా ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల పరిహారాన్ని యూపీ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రాహుల్ పర్యటన నేపథ్యంలో స్థానికంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. హత్రాస్ ఘటనను పార్లమెంటులో లేవనెత్తుతానని, పరిహారం త్వరగా అందేలా కృషి చేస్తానని రాహుల్ తమకు హామీ ఇచ్చారని బాధితులు పేర్కొన్నారు.

## భోలేబాబాకు రూ.100 కోట్ల ఆస్తులు

**జాబితాలో ఆశ్రమాలు, స్థిరాస్తులు, ఖరీదైన వాహనాలు**

హత్రాస్, జూలై5: హత్రాస్‌లో తొక్కిసలాటకు కారణమైన భోలేబాబాకు దాదాపు రూ.100కోట్ల ఆస్తులు ఉన్నట్లు వెల్లడైంది. పలు ఆశ్రమాలు, నివాసాలు, ఇతర స్థిరాస్తులు, వాహనాల రూపంలో ఇవి ఉన్నట్లు తేలింది. వీటిలో ముఖ్యమైనది యూపీలోని మొయిన్‌పురిలో ఉన్న ఆశ్రమం. ఇది ఫైవ్‌స్టార్ హోటల్ స్థాయిలో ఉంటుంది. దీన్ని కట్టిన స్థలమే రూ.4కోట్ల విలువ చేస్తుందని సమాచారం. భోలేబాబాగా పేరొందిన సూరజ్‌పాల్ ఉండేది ఈ ఆశ్రమంలో నిర్మించిన నివాసంలోనే. ఆశ్రమానికి ఆనుకొని ఉన్న 16 ఎకరాలకుపైగా స్థలాన్ని సూరజ్‌పాల్ లీజుకు తీసుకున్నాడు. ఆగ్రా, కాన్పూర్, గ్వాలియర్ తదితర ప్రాంతాల్లో భోలేబాబా ఆశ్రమాలున్నాయి. అనేక ఖరీదైన, లగ్జరీ కార్లు ఆయనకున్నాయి. ఇటీవల సత్సంగ్ తర్వాత అలాంటి ఓ వాహనంలో ఆయన వెళ్లిపోతుంటే ఆ మార్గంలో మట్టి కోసం జనం ఎగబడటంతో తొక్కిసలాట జరిగి 121మంది మరణించారు.

# మృత్యుబావులు

## ఛత్తీస్‌గఢ్‌లో 9మందిని మింగేసిన రెండు బావులు

**» జాంజ్‌గీర్ జిల్లాలో ఐదుగురు.. కోర్బాలో నలుగురి దుర్మరణం**



జాంజ్‌గీర్ జిల్లాలో ఐదుగురిని మింగిన బావి ఇదే

చర్ల/కోర్బా, జూలై 5: ఛత్తీస్‌గఢ్‌లోని జాంజ్‌గీర్-చంపా జిల్లా కికిర్దా గ్రామానికి చెందిన రామచంద్ర జైస్వాల్(60) ఇంటికి ఆనుకొని 30 అడుగుల లోతైన బావి ఉంది. ఇంటి అవసరాల కోసం బోర్ వేయించడంతో కొన్ని నెలల క్రితం కర్ర చెక్కలతో ఆ బావిని మూసేశారు. ఇటీవల ఆ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా బావిపై ఉన్న కర్రచెక్కల్లో ఒకటి అందులో పడిపోయింది. దాన్ని తీయడానికి శుక్రవారం ఉదయం రామచంద్ర ఆ బావిలోకి దిగాడు. మధ్యలోకి వెళ్లగానే స్పృహ తప్పి బావిలో పడిపోయాడు. అది చూసి అతని భార్య అరవడంతో.. పక్కనే ఉంటున్న రమేశ్ పటేల్(50) అతని ఇద్దరు కుమారులు జితేంద్ర(25), రాజేంద్ర(20) పరుగెత్తుకుంటూ వచ్చి బావిలోకి దిగారు. వారు కూడా బావిలోని నీళ్లలో పడిపోయారు. నలుగురూ బయటకు రాకపోవడంతో టీకేశ్వర్ చంద్ర(25) అనే మరో వ్యక్తి వారిని కాపాడటానికి బావి లోపలికి వెళ్లాడు. అతను కూడా ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీంతో భయపడిపోయిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఎస్‌డీఆర్ఎఫ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. బావిని మూసివేయడం వల్ల అందులో విషవాయువు తయారై ఉంటుందని, దాన్ని పీల్చడం వల్లే ఐదుగురూ చనిపోయి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. మరణాలకు గల కచ్చితమైన కారణం పోస్టుమార్టం తర్వాత తెలుస్తుందన్నారు. బావిలో ఐదడుగుల మేర నీళ్లు ఉన్నాయని తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో కోర్బా జిల్లాలోని జూరాలి గ్రామంలో కూడా ఇదే తరహా ఘటన జరిగింది. గ్రామానికి చెందిన జుగ్రహా పటేల్(60) శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ పనుల్లో ఉండగా ప్రమాదవశాత్తూ బావిలో పడిపోయాడు. అతన్ని కాపడానికి కూతురు సపినా(16) బావిలోకి దిగింది. ఆ తర్వాత వారిద్దరి కోసం అదే కుటుంబానికి చెందిన శివ్‌చరణ్(45), మన్‌బోధ్(57) బావిలోకి వెళ్లారు. నలుగురూ బావిలోనే చనిపోయారు. ఈ ఘటనలో కూడా మరణాలకు విషవాయువే కారణం కావొచ్చని అనుమానిస్తున్నారు. రెండు ఘటనలపై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జాంజ్‌గీర్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున, జూరాలి గ్రామ మృతుల కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

# న్యాయమూర్తులు భయపడుతున్నారు



**అందుకే విపక్ష నేతలకు బెయిలు ఇవ్వట్లే: మహువా మొయిత్రా**

న్యూఢిల్లీ, జూలై 5: ప్రతిపక్ష నేతల కేసుల్లో న్యాయమూర్తులు న్యాయం చేయడానికి భయపడుతున్నారని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా అన్నారు. ప్రభుత్వానికి ఎక్కడ కోపం వస్తుందేమోనన్న భయంతో బెయిలు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. మూడు రోజుల క్రితం లోక్‌సభ సమావేశాల చివరిరోజు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడుతూ మహువా ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అవి సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతున్నాయి. న్యాయమూర్తులు దేవుళ్లు కారని, ప్రజల పట్ల సహానుభూతితో పని చేయాలని ఇటీవల సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను మొయిత్రా ప్రస్తావించారు. ఎక్కడా సగం గర్భం ఉండదని, అయితే కడుపుతో ఉన్నారని లేదా లేరని మాత్రమే అంటారని అన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయం కూడా సంపూర్ణమైనదిగా ఉండాలని స్పష్టం చేశారు. కొద్దిగానే ప్రభావవంతంగా ఉంటానంటే కుదరదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు రేఖా శర్మపై మహువా శుక్రవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హత్రాస్ తొక్కిసలాట జరిగిన సంఘటన స్థలాన్ని రేఖా శర్మ శుక్రవారం సందర్శించారు. అక్కడ బంట్రోతు గొడుగు పట్టుకొని రేఖాశర్మ వెనుక నడుస్తున్న వీడియో వైరల్ అయ్యింది. రేఖకు అంత అధికార దర్పం ఎందుకని విమర్శలు వెల్లువెత్తాయి. ఛైర్‌పర్సన్ తన గొడుగు తాను పట్టుకొని నడవలేరా? అని ఎవరో వేసిన ప్రశ్నకు మొహువా మొయిత్రా సమాధానం ఇస్తూ.. ఆమె తన బాస్(మోదీ) పరువు కాపాడే పనిలో బిజీగా ఉన్నారనే అర్థం వచ్చేలా పోస్టు చేశారు. మహువా వ్యాఖ్యను తీవ్రంగా పరిగణించిన మహిళా కమిషన్ 3రోజుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది.

## కేశవరావు రాజీనామా ఆమోదం

**ఎంపీలుగా అమృత్‌పాల్‌సింగ్, రషీద్ ప్రమాణం**

న్యూఢిల్లీ, జూలై 5: రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్ శుక్రవారం కె. కేశవరావు రాజీనామాను ఆమోదించారు. బీఆర్ఎస్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కేశవరావు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. గురువారం ఆయన తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కేశవరావు రాజీనామాతో రాజ్యసభలో 16 సీట్లు ఖాళీ అయ్యాయి. మరోవైపు జైలు నుంచి లోక్‌సభ ఎన్నికలకు పోటీ చేసి గెలుపొందిన అమృత్‌పాల్‌సింగ్, ఇంజనీర్ రషీద్ శుక్రవారం ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. పెరోల్‌పై బయటకు వచ్చిన వారు లోక్‌సభలో భారీ భద్రత నడుమ ప్రమాణం చేశారు. అమృత్‌పాల్ సింగ్ పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ నుంచి, రషీద్ బారాముల్లా నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించారు.

## సామాన్యులపై భారం పడకుండా
# భూముల ధరల సవరణ

- ఆధునిక వసతులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలు: పొంగులేటి

హైదరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌సహా రాష్ట్ర వ్యాప్తంగా భూముల మార్కెట్ ధరలు గణనీయంగా పెరిగాయన్నారు. బహిరంగ మార్కెట్ విలువలకు, రిజిస్ట్రేషన్ విలువలకు భారీగా వ్యత్యాసం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరలను సవరించాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఎలాంటి కసరత్తు చేయకుండానే భూముల ధరలను పెంచారని ఆ పరిస్థితి పునరావృతం కాకూడదని సూచించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం అత్యాధునిక వసతులతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పనితీరు ఆధారంగా ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేపడతామని హామీ ఇచ్చారు.

## త్వరలోనే నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తి

హైదరాబాద్/న్యూఢిల్లీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి సింగరేణి త్వరలోనే ఉత్పత్తి చేపడుతుందని బొగ్గు మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. "2022 అక్టోబరులోనే ఈ ప్రాజెక్టుకు స్టేజ్-2 అటవీ అనుమతులు వచ్చినా.. అటవీ భూమి బదలాయింపులో జాప్యం వల్ల గని ప్రారంభం ఆలస్యమవుతూ వస్తోంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని ఇటీవల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డి.. ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపారు. నైనీ గనిని సత్వరమే ప్రారంభించేందుకు సహకరించాలని కోరారు. దీంతో ఎట్టకేలకు అడుగు ముందుకు పడింది. ఫలితంగా సింగరేణికి 643 హెక్టార్ల భూమిని అప్పగిస్తూ గురువారం ఒడిశా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది"అని బొగ్గు మంత్రిత్వ శాఖ పేర్కొంది. కాగా, నైనీ బ్లాక్‌కు ఒడిశా ప్రభుత్వం అటవీ అనుమతులు మంజూరు చేయడం హర్షణీయమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

## మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు సాయం

- 34 కుటుంబాలకు లక్ష చొప్పున ఆర్థిక భరోసా
- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇటీవల కాలంలో మరణించిన 34మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించినట్లు మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియా అకాడమీ కార్యాలయంలో నిర్వహించిన జర్నలిస్టుల సంక్షేమ నిధి సమావేశంలో ఆయన మాట్లాడారు. మరణించిన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి ఐదేళ్ల పాటు నెలకు రూ.3వేల చొప్పున పింఛన్, పదో తరగతిలోపు చదివే ఇద్దరు పిల్లలకు నెలకు రూ.2వేల ట్యూషన్ ఫీజు అందిస్తామన్నారు. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న, ఇతర వ్యాధులకు గురైన వారికి వ్యాధి తీవ్రతను బట్టి ముగ్గురికి లక్ష, ఇద్దరికి రూ.50వేల చొప్పున మొత్తం ఐదుగురికి ఆర్థిక సాయం అందజేస్తామని శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

## రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో)గా సి.సుదర్శన్‌రెడ్డిని కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ప్రస్తుతం సీఈవోగా ఉన్న వికాస్‌రాజ్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. 2002 బ్యాచ్ ఐఏఎస్ అయిన సుదర్శన్‌రెడ్డిని గత నెల 24న సాధారణ పరిపాలనా శాఖ కార్యదర్శి(సర్వీసెస్)గా ప్రభుత్వం నియమించింది. ఇంతలోనే ఆయనను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వికాస్‌రాజ్ తిరిగి ప్రభుత్వ సేవల్లో చేరుతారంటూ ఇటీవలే 'ఆంధ్రజ్యోతి' ఓ వార్తను ప్రచురించింది. అనుకున్నట్లుగానే ఇప్పుడు ఆయన రాష్ట్ర ప్రభుత్వ సేవల్లో చేరారు. త్వరలోనే ఆయనకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది.

## బదిలీపై వెళ్లిన వారిని రప్పించాలి: టీజీఏ

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా బదిలీలపై వెళ్లిన అధికారులు వెనక్కి రప్పించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ కోరింది. శుక్రవారం అసోసియేషన్ కేంద్ర కార్యవర్గం అత్యవసరంగా నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, సత్యనారాయణ సాధారణ బదిలీలకు ప్రభుత్వం అనుమతివ్వడం అభినందనీయమని అన్నారు. పదోన్నతులు కల్పించాలని, అద్దెవాహనాల చెల్లింపులు చేయాలని కోరారు. డీఏలతో పాటు పెండింగ్‌లో ఉన్న సప్లిమెంటరీ బిల్లులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంట్రిబ్యూషన్ సమాన నిష్పత్తితో ఉద్యోగ ఆరోగ్యపథకాన్ని వెంటనే అమలు చేయాలని కూడా కోరారు.

## 9న సికింద్రాబాద్ నుంచి మరో 'భారత్ గౌరవ్'

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మరో భారత్ గౌరవ్ రైలు ప్రారంభం కానుంది. అయోధ్య, కాశీ, గయ, ప్రయాగరాజ్ తదితర పుణ్యక్షేత్రాలను కలిపేలా ఈ టూరిస్ట్ రైలు నడపనున్నారు. 9 రోజులపాటు సాగే ఈ యాత్రలో భాగంగా రామజన్మభూమి, కాశీ విశ్వనాథుడి ఆలయాన్ని దర్శించుకునే అవకాశం దక్కుతుంది. భారత్ గౌరవ్ రైలు యాత్రకు స్లీపర్ టికెట్ ధర రూ.15,510, కంఫర్ట్ కేటగిరీ ధర రూ.31,500 గా నిర్ణయించారు. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు భారత్ గౌరవ్ టూరిస్ట్ సర్క్యూట్ రైలు గొప్ప అవకాశమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యారోగ్యశాఖ అధికారులకు సర్కారు ఆదేశం

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల తీవ్రత అధికంగా ఉన్న జిల్లాల్లో పర్యటించాలని వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వణికిస్తున్న డెంగీ, చికున్ గున్యా కథనం నేపథ్యంలో శాఖ ఉన్నతాధికారులతో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి డెంగీ, మలేరియా కేసులు తగ్గాయని వివరించారు. అయితే, తీవ్రత ఉన్న జిల్లాల్లో పర్యటించడంతోపాటు ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఔషధాలు, మానవ వనరులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

## సీనియర్ పాత్రికేయుడు ఉపేంద్రబాబు మృతి


- ఆంధ్రజ్యోతిలో డిప్యూటీ ఎడిటర్‌గా పదవీ విరమణ



కంకిపాడు, జూలై 5: సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి మాజీ డిప్యూటీ ఎడిటర్ గారపాటి ఉపేంద్రబాబు(88) శుక్రవారం మృతి చెందారు. ఉపేంద్రబాబు 1935లో కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని కాసరనేనివారిపాలెంలో జన్మించారు. 1961లో బీఏ ఆనర్స్ పూర్తి చేశారు. జర్నలిజం మీద మక్కువతో ఆంధ్రజ్యోతి ప్రారంభంలోనే సబ్ ఎడిటర్‌గా విధుల్లో చేరారు. సంస్థలో సుదీర్ఘకాలం సేవలు అందించి డిప్యూటీ ఎడిటర్ స్థాయికి చేరుకుని పదవీవిరమణ చేశారు. ఆయనకు భార్య విద్య, కుమారుడు అజయ్, కుమార్తె అమల ఉన్నారు. పిల్లలు ఇద్దరు అమెరికాలో స్థిరపడ్డారు. కొంత కాలంగా గారపాటి అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో కుమారుడు అజయ్ ఇండియా వచ్చి తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటున్నారు. ఉపేంద్రబాబు అంత్యక్రియలు శుక్రవారం విజయవాడలో జరిగాయి. ఉపేంద్రబాబు మృతికి ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఎడిటర్ కె.శ్రీనివాస్ సంతాపం ప్రకటించారు.

# చర్చకు రెడీ





(మొదటిపేజీ తరువాయి)

ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయడం, ఇందుకు రేవంత్‌రెడ్డి స్పందిస్తూ చంద్రబాబును ఆహ్వానించడం తెలిసిందే. దీంతో శనివారం సాయంత్రం 6 గంటలకు సీఎంల మధ్య సమావేశం ప్రారంభం కానుంది. సుహృద్భావ వాతావరణంలో ఈ భేటీ జరుగుతున్నందున కొన్ని సమస్యలైనా కొలిక్కి వస్తాయని ఇరు రాష్ట్రాల ప్రజలు భావిస్తున్నారు. గతంలో అప్పటి సీఎంలు కేసీఆర్, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మధ్య జరిగిన చర్చలు ఎలాంటి సత్ఫలితాలు ఇవ్వలేదు. దీంతో ప్రస్తుత సీఎంల మధ్య జరుగుతున్న ఈ సమావేశం ఫలవంతం కావాలన్న ఆకాంక్షలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిసారీ పేచీ పెట్టుకునే బదులు.. ఎలాంటి చిక్కుల్లేని కొన్ని సమస్యలనైనా పరిష్కరించుకుంటే బాగుటుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే విభజన చట్టంలో లేనివి, ఇప్పటిదాకా చర్చకు రాని కొన్ని కొత్త అంశాలను కూడా సీఎంల భేటీలో తెలంగాణ లేవనెత్తనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, సీఎంల సమావేశంలో రెండు రాష్ట్రాల నుంచి పలువురు మంత్రులు కూడా పాల్గొననున్నారు. తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పరిశ్రమలు, ఐటీ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర శాఖల అధికారులు పాల్గొంటుండగా, ఆంధ్రప్రదేశ్ నుంచి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్, సీఎస్ నీరబ్‌కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి, ఇతర కార్యదర్శులు పాల్గొననున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు శుక్రవారం సాయంత్రమే హైదరాబాద్‌కు చేరుకున్నారు.

### విభజన సమస్యలే ప్రధాన ఎజెండా

ఇద్దరు సీఎంల సమావేశంలో విభజన సమస్యలే ప్రధాన ఎజెండా కానున్నాయి. 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014'లోని 9వ, 10వ షెడ్యూళ్లలోని ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యాసంస్థలు, అకాడమీలు, యూనివర్సిటీలపై చర్చించనున్నారు. షెడ్యూలు 9లో మొత్తం 91 సంస్థలు ఉండగా.. వీటి ఆస్తులు, అప్పుల విభజనపై కేంద్ర ప్రభుత్వం షీలా భిడే కమిటీని నియమించింది. ఈ కమిటీ 89 సంస్థల ఆస్తులు, అప్పులను విభజిస్తూ సిఫారసు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ 89 సంస్థల విభజన సిఫారసులకు అంగీకరించింది. కానీ, తెలంగాణ మాత్రం వీటిలో 68 సంస్థల విభజన సిఫారసులను మాత్రమే ఒప్పుకొంటోంది. ఈ వ్యవహారంపై సీఎంలు చర్చించనున్నారు. ముఖ్యంగా ఏపీఎస్ఆర్టీసీ, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి సంస్థల ఆస్తులు, అప్పుల విభజన పెద్ద చిక్కుముడిగా మిగిలిపోయింది. ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కోల విద్యుత్తు బకాయిల పేచీ ఎటూ తెగడం లేదు. రాష్ట్రావతరణ అనంతరం 2014 జూన్ 2వ తేదీ నుంచి 2017 జూన్ 10వ తేదీ వరకు ఏపీ జెన్‌కో నుంచి తీసుకున్న విద్యుత్తుకుగాను రూ.3441.78 కోట్లను సకాలంలో చెల్లించనందుకు ఆలస్య రుసుము సర్‌చార్జి కింద మరో రూ.3315.14 కోట్లు చెల్లించాలని ఏపీ అడుగుతోంది. మొత్తం రూ.6756 కోట్లు చెల్లించాలంటోంది. అయితే.. ఏపీ నుంచే తమకు రూ.17,828 కోట్లు రావాల్సి ఉందని తెలంగాణ చెబుతోంది. ఏపీకి కట్టాల్సిన కరెంట్ బిల్లులు, ఆలస్య రుసుము సర్‌చార్జి మొత్తం కలిపి రూ.4887 కోట్లు మాత్రమే అవుతాయని, అవి పోను ఇంకా తమకు రూ.12,940 కోట్లు రావాల్సి ఉందని తెలంగాణ వాదిస్తోంది. ఈ వివాదాన్ని తేల్చడానికి చాలా ప్రక్రియలు జరిగినా ఏపీ కార్యరూపం దాల్చలేదు. కనీసం ఈ సమావేశంలోనైనా తొమ్మిదో షెడ్యూలు సంస్థల సమస్యలపై ఇరువురు సీఎంలు ఒక అవగాహనకు వస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. ఇక 10వ షెడ్యూలులో మొత్తం 142 సంస్థలున్నాయి. వీటిలో తెలుగు అకాడమీ, అంబేడ్కర్ యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీ వంటి 30 సంస్థలపై వివాదాలున్నాయి. ఉన్నత విద్యామండలి ఆస్తుల విలువ తేలడం లేదు. దీనికి సంబంధించిన రూ.800 కోట్ల బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి. వీటిని జనాభా దామాషాలో పంచాలని ఏపీ అడుగుతుండగా.. ఇందుకు తెలంగాణ అంగీకరించడం లేదు.

### నగరంలోని భవనాలపైనా..

హైదరాబాద్‌లోని కొన్ని భవనాల పరిస్థితి ఎటూ తేలడం లేదు. వీటిపై రెండు తెలుగు రాష్ట్రాలు పట్టు పడుతున్నాయి. సీఐడీ హెడ్ క్వార్టర్స్, లేక్‌వ్యూ అతిథి గృహం, హెర్మిటేజ్ కార్యాలయ భవనం వంటి వాటిని జనాభా దామాషా 58.32, 41.68 ప్రకారం పంచాలని ఏపీ కోరుతోంది. అయితే ఇందుకు తెలంగాణ అంగీకరించడం లేదు. పాత సెక్రటేరియట్‌లో ఉన్న భవనాలు, స్థలాన్ని, అసెంబ్లీ ప్రాంగణంలోని శాసనసభ, శాసనమండలి భవనాలను 2019లోనే తెలంగాణకు ఏపీ అప్పగించింది. మార్చి నెలలో సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఢిల్లీలోని ఏపీ భవన్ వివాదం కూడా పరిష్కారమైంది. ఏపీ భవన్‌కు సంబంధించిన పటౌడీ హౌస్, నర్సింగ్ హాస్టల్‌ను విభజిస్తూ కేంద్ర హోంశాఖ మార్చి 15న తుది నిర్ణయాన్ని ప్రకటించగా.. ఇందుకు రెండు రాష్ట్రాలూ అంగీకరించాయి. మరోవైపు షైనింగ్ కార్పొరేషన్‌కు సంబంధించిన నిధుల పంపిణీ చిక్కుముడి కూడా వీడిపోయింది.

### సమావేశపు ఎజెండా ఇదే..

- ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 9వ షెడ్యూలు సంస్థల ఆస్తుల విభజన
- 10వ షెడ్యూలులోని అకాడమీలు, యూనివర్సిటీలు, సంస్థల ఆస్తుల విభజన
- విభజన చట్టంలో లేని సంస్థల ఆస్తుల విభజన
- ఏపీ రాష్ట్ర ఫైనాన్షియల్ కార్పొరేషన్ సమస్య
- విద్యుత్తు బకాయిలు
- 15 ఎయిడెడ్ ప్రాజెక్టుల అప్పులు ఇరు రాష్ట్రాల మధ్య పంపిణీ
- ఉద్యోగుల మార్పిడి
- కార్మిక సెస్ నిధుల పంపిణీ
- ఉమ్మడి సంస్థల వ్యయాల రీయింబర్స్‌మెంట్
- హైదరాబాద్‌లోని 3భవనాలపై నిర్ణయం

## రెండు రాష్ట్రాల ప్రయోజనాలకూ ప్రాధాన్యం

- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో చంద్రబాబు

న్యూఢిల్లీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శనివారం హైదరాబాద్‌లో జరిగే సమావేశంలో.. ఇరు రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడడానికే ప్రాధాన్యం ఇస్తామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. విభజన సమయంలో కూడా.. రెండు రాష్ట్రాలకూ సమన్యాయం చేయాలనే తాను కోరిన విషయాన్ని బాబు గుర్తుచేశారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక, రక్షణ, ఆరోగ్య మంత్రులతో భేటీ అనంతరం.. హైదరాబాద్ బయల్దేరి వెళ్లే ముందు మధ్యాహ్నం 3 గంటలకు జాతీయ, ప్రాంతీయ మీడియాతో ఆయన దాదాపు గంట సేపు మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంతి ఆ రాష్ట్ర ప్రయోజనాలను ఆశించవచ్చని.. కానీ తాను రెండు రాష్ట్రాల ప్రయోజనాలూ దెబ్బతినకుండా పరస్పర ఆమోదంతో సమస్యలు పరిష్కారం కావాలనే ఉద్దేశంతోనే చర్చలు జరుపుతానని తెలిపారు. విడిపోయినా తెలుగువారు కలిసి ఉండాలన్నదే తన అభిమతమన్నారు. సోదర భావంతో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్పొరేషన్లు, షెడ్యూలు 9, 10 కింద ఉన్న సంస్థల విభజనపై చర్చించాల్సి ఉందన్నారు. గత ఐదేళ్లలో జగన్ దుష్పరిపాలన కారణంగా ఏపీకి సరిదిద్దలేనంత నష్టం జరిగిందని, అమరావతి, పోలవరం విధ్వంసానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఆయన వస్తారేమోనని కొందరు భయపడుతున్నారని.. ముఖ్యంగా ఆ భూతాన్ని చూసి రాష్ట్రానికి వచ్చేందుకు పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారని తెలిపారు. అయితే దానిని ఎలా నియంత్రించాలో తమకు తెలుసని.. దాని గురించి భయపడాల్సిన అవసరం లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే ప్రధాన ఎజెండాగా తన రెండ్రోజుల ఢిల్లీ పర్యటన సాగిందన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా సమస్యలు
# పరిష్కరించాలి

ఖమ్మం, జూలై5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు శనివారం సమావేశం కానుండడంతో.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశాభావాన్ని జిల్లా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఏపీలోని ఉమ్మడి విశాఖతోపాటు సరిహద్దు సీలేరు ప్రాంతంలో, ఒడిసాలోనూ భారీగా గంజాయి పండించి తెలంగాణ మీదుగా యూపీ, బిహార్, చెన్నై, గోవా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. సీఎంల సమావేశంలో గంజాయి రవాణా నియంత్రణకు చెక్‌పోస్టుల ఏర్పాటుతోపాటు ఉమ్మడిగా పోలీసు, ఎక్సైజ్ శాఖలు సంయుక్త కార్యాచరణ ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఇక రాష్ట్ర విభజనలో భద్రాచలం పంచాయతీ మినహా ఆనుకుని ఉన్న మిగిలిన పంచాయతీలను ఏపీలో విలీనం చేశారు. దీంతో భద్రాచలం పట్టణం ఒక ద్వీపకల్పంగా మిగిలింది. ఏపీ సరిహద్దు పంచాయతీల్లో ప్రాథమిక పాఠశాలలు మినహా హైస్కూల్ కూడా లేదు. ఇంటర్, డిగ్రీకి వెళ్లాలంటే చింతూరు, రంపచోడవరం వైపు వెళ్లాలి. దీంతో విద్యార్థులు పదో తరగతితోనే చదువులు మానేస్తున్నారు. ఇక సరిహద్దు గ్రామాల ప్రజలు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే ఏపీ రోగులను చూడబోమని ఆంక్షలు పెడుతున్నారు. సరిహద్దు గ్రామాల్లో పోలీసు కేసులైతే రిమాండ్‌కు, జైలుకు వెళ్లాలన్నా రంపచోడవరం, పాడేరు, రాజమండ్రి వెళ్లాల్సి వస్తోంది. భద్రాచలం నుంచి పర్ణశాల వెళ్లే రహదారి గత పదేళ్లుగా మరమ్మతు చేయకపోవడంతో భారీ గోతులు పడ్డాయి. దాంతో పర్ణశాల వెళ్లే భక్తులు, పర్యాటకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఐదు పంచాయతీలు లేకపోవడంతో భద్రాచలం పుణ్యక్షేత్ర అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఈ ఐదు పంచాయతీలను రాజకీయాలకతీతంగా తెలంగాణలో కలపాలని ప్రజలు కోరుతున్నారు. ఇక భద్రాచలం నుంచి యటపాక వరకు ఉన్న కరకట్ట రెండు రాష్ట్రాల నడుమ ఉంది. తెలంగాణ వైపు మరమ్మతులు చేస్తుండగా ఏపీవైపు మరమ్మత్తులకు నిధులు లేవు. దీంతో 2022లో వచ్చిన గోదావరి వరద యటపాక వద్ద కరకట్టపై నుంచి ప్రవహించింది. అక్కడ గండిపడితే భద్రాచలం పట్టణం మునిగిపోయే పరిస్థితి ఉంది. కరకట్టను పర్యవేక్షించాలంటే తెలంగాణ నీటిపారుదలశాఖ మాత్రమే చూడాల్సి ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా డ్యాం ఎత్తు కారణంగా గతంలో వచ్చిన గోదావరి వరదల నీటిమట్టం కంటే తక్కువ వరద వచ్చినా ఎక్కువ ముంపునకు గురవుతున్నాయి. దీనికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు, ఇరిగేషన్ అధికారులు కేంద్ర జలసంఘం, వరదల దరుణంలో ఉమ్మడిగా పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రాల సరిహద్దులో రహదారుల అనుసంధానంపై కూడా చర్చించాల్సిన అవసరం ఉంది.



# చంద్రబాబుకు ఘన స్వాగతం

- బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ దాక భారీ ర్యాలీ
- విమానాశ్రయంలోనే.. గజమాలతో సన్మానం

బేగంపేట/బంజారాహిల్స్, జూలై 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యేందుకు హైదరాబాద్ వచ్చిన ఏపీ సీఎం చంద్రబాబుకు శుక్రవారం బేగంపేట విమానాశ్రమంలో తెలంగాణ టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 7.20కు చంద్రబాబు హైదరాబాద్‌కు చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి బయటకు రాగానే కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున డప్పుల మోతలు, కోలాటాలు, నృత్యాల నడుమ నినాదాలు చేశారు. క్రేన్‌తో భారీ గజమాల వేసి అభిమానాన్ని చాటుకున్నారు. వారికి అధినేత అభివాదం చేశారు. జోరు వానలోనూ చంద్రబాబును అనుసరిస్తూ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వరకు ర్యాలీగా తరలివెళ్లారు. కాగా, కటౌట్లు, బ్యానర్లు, పార్టీ జెండాలతో ఈ ప్రాంతమంతా పసుపుమయమైంది. టీటీడీపీ నేతలు బక్కని నర్సింహులు, అరవింద్‌కుమార్ గౌడ్, నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు కంభంపాటి రామ్మోహన్‌రావు, తెలుగు యువత నేత మల్లికార్జున్ నాయుడు, కట్టా రాములు, కాట్రగడ్డ ప్రసూన, శ్రీపతి సతీష్ తదితరులు స్వాగతం పలికారు. ర్యాలీ బంజారాహిల్స్‌లోని ఎన్‌టీఆర్ ట్రస్టు భవన్ వద్దకు చేరుకున్నప్పుడు బాబును కలిసేందుకు కార్యకర్తలు పోటీ పడ్డారు. బాణసంచా పేల్చి సందడి చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నం.1 నుంచి బాబు నివాసం వరకు పూలు పరిచారు.

# త్వరలో కొత్త రేషన్ కార్డులు!

- సీఎం ప్రకటనతో ఆశావహుల్లో ఆనందం
- ఉత్తర్వులు వెలువడగానే 'మీ-సేవ' పోర్టల్ ఓపెన్
- 10 లక్షల కొత్త దరఖాస్తులొస్తాయని అంచనా



హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. త్వరలో కొత్త కార్డులు జారీచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఆశావహుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాం నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం బీపీఎల్ కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. తాము అధికారంలోకి రాగానే కొత్తరేషన్ కార్డులు జారీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. కానీ, అధికారంలోకి వచ్చాక లోక్‌సభ ఎన్నికలు, ఇతర గ్యారెంటీల అమలుపై దృష్టిపెట్టడంతో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం ప్రకటన నేపథ్యంలో.. మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 55 లక్షల కార్డులు కేంద్ర ప్రభుత్వం జారీచేసినవి. రాష్ట్ర ప్రభుత్వ కార్డులు 35 లక్షలు. కొత్త కార్డుల కోసం పోర్టల్ ఓపెన్ చేస్తే.. మరో 10 లక్షల కుటుంబాల నుంచి దరఖాస్తులు వస్తాయని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

### దరఖాస్తులు తీసుకున్నా..


రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ఆరు గ్యారెంటీల అమలుకుగాను ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అయితే గ్యారెంటీల ప్రొఫార్మాలో కొత్త రేషన్ కార్డుల ప్రస్తావన చేయలేదు. కానీ ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. తెల్లకాగితాలపై రాసిచ్చిన దరఖాస్తులను తీసుకున్నారు. కానీ 'మీ-సేవ'లో పోర్టల్ మాత్రం ఓపెన్ చేయలేదు. ఇప్పుడు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత 'మీ-సేవ' పోర్టల్ ఓపెన్ చేసి, కొత్తగా దరఖాస్తులు స్వీకరించే అవకాశాలు ఉన్నాయి. ఇదిలాఉండగా రేషన్ కార్డులో అదనపు కుటుంబ సభ్యులను చేర్చుకోవటానికి కూడా దరఖాస్తులు వస్తున్నాయి. అంటే.. ఒక కుటుంబంలో భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఉంటే.. భార్యాభర్తల పేర్లు కార్డులో ఉండి పిల్లల పేర్లు లేకపోయినా, ఇద్దరు పిల్లల్లో ఒకరి పేరే ఉన్నా.. 'మెంబర్ ఎడిషన్ (కొత్త సభ్యుల చేర్పులు, మార్పులు)' ప్రొఫార్మాలో తీసుకుంటారు. అయితే 'మీ-సేవ'లో మెంబర్ అడిషన్ పోర్టల్ ఓపెన్ చేసి ఉంది. దాంట్లో ఇప్పటివరకూ 11 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిపై కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కొత్త కార్డులు ఇచ్చే సమయంలోనే.. మెంబర్ అడిషన్‌పై కూడా నిర్ణయం తీసుకుంటారని సమాచారం. ఈ రెండు ప్రక్రియలూ పూర్తిచేస్తే రేషన్ కార్డుల సమస్య దాదాపుగా కొలిక్కివచ్చే అవకాశాలున్నాయి. కాగా.. రాష్ట్రంలో బీపీఎల్ కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ కోటాలో ఉన్న 35 లక్షల రేషన్ కార్డులను కూడా సెంట్రల్ కోటాలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ఢిల్లీకి లేఖలు రాసింది. కానీ కేంద్రం నుంచి ఇంతవరకూ ఎలాంటి స్పందనా లేదు.

# నెహ్రూ 3259 రోజులు జైల్లో గడిపారు

## దేశం కోసం మోదీ కొన్ని గంటలైనా జైలుకెళ్లారా?.. బీజేపీ నేతలు చెప్పాలి

### నెహ్రూ, ఇందిరల గురించి మాట్లాడే నైతికత వారికి లేదు: జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): "స్వాతంత్రోద్యమ కాలంలో దేశ ప్రజల కోసం జవహర్‌లాల్ నెహ్రూ 3,259 రోజుల పాటు జైలు జీవితాన్ని గడిపారు. అంటే తొమ్మిదిన్నరేళ్లు ఆయన జైల్లోనే ఉన్నారు. దేశ ప్రజల సమస్యలపై పోరాటం చేసి కొన్ని గంటలైనా జైలు జీవితం గడిపిన రికార్డు.. ప్రధాని మోదీకి ఉందా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి.. బీజేపీ నేతలను నిలదీశారు. దీనికి వారు సమాధానం చెప్పాలన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పుట్టుకతోనే ధనవంతుడైన నెహ్రూ.. ప్రజల కోసం సొంత ఆస్తులను దారాదత్తం చేశారని, దేశానికి ప్రధాని అయినప్పటి నుంచీ సొంత ఇల్లూ లేకుండా.. ప్రభుత్వ క్వార్టర్‌లోనే నివాసం ఉన్నారని పేర్కొన్నారు. ఆయన తర్వాత ఇందిర, రాజీవ్, సోనియా, రాహుల్‌గాంధీలూ ప్రభుత్వ క్వార్టర్లలోనే నివాసం ఉన్నారన్నారు. సొంత ఆస్తులను దేశం కోసం దారాదత్తం చేసిన చరిత్ర నెహ్రూ కుటుంబానిదైతే.. ప్రభుత్వ క్వార్టర్‌నూ గుంజుకుని రాహుల్‌గాంధీని బయటకు పంపిన చరిత్ర మోదీదని విమర్శించారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం సందర్భంగా నెహ్రూ, ఇందిరాగాంధీల గురించి లేనివి.. ఉన్నట్లుగా చెప్పించే ప్రయత్నం బీజేపీ చేసిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక గాంధీ నాయతకత్వంలోని కాంగ్రెస్ పార్టీ నెహ్రూని ప్రధానిగా ఎన్నుకుందని గుర్తు చేసిన జగ్గారెడ్డి.. బ్రిటిషర్ల తరహాలో రాచరిక పాలనను కొనసాగించే అవకాశం ఉన్నా.. ఎన్నికలు, ప్రజలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే విధానాన్ని నెహ్రూ తీసుకువచ్చారన్నారు. ఇవాళ బీజేపీ నేతలు పార్లమెంటులో ప్రసంగాలు చేస్తున్నారంటే.. ఆ స్వేచ్ఛను కల్పించింది నెహ్రూనే అన్న సంగతి వారు మరవద్దన్నారు. "అంబేడ్కర్‌ను ఓడించింది కాంగ్రెస్ పార్టీనే అంటూ బీజేపీ నేతలు మరో దుష్ప్రచారం చేస్తున్నరు. మోదీ, అమిత్‌షా సహా ఇప్పుడున్న బీజేపీ నేతలు ఎవరైనా అప్పుడు ఉన్నారా? ఆ రోజున ఉన్న వాజ్‌పేయి, అద్వానీలు.. అంబేడ్కర్‌ను ఓడించింది కాంగ్రెస్ పార్టీనే అంటూ ఎన్నడైనా మాట్లాడారా?" అని నిలదీశారు. ఇప్పుడున్న తరానికి చరిత్ర తెలుస్తలేదని, మోదీ.. అమిత్‌షాలు మాట్లాడిందే నిజమనుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ ఏ కారణాలతో ఓడారో ఎవరికీ తెలియదు కానీ.. ఓడిన తర్వాతా అంబేడ్కర్‌ను ఎంపీని చేసి న్యాయశాఖ మంత్రిని చేసిన చరిత్ర నెహ్రూదని తెలిపారు. అలాగే రాజ్యాంగాన్ని రూపొందించే బాధ్యతనూ ఆయనకు అప్పగించారన్నారు. ప్రజాస్వామ్యాన్ని నెహ్రూ ఖూనీ చేశారని మాట్లాడుతున్న బీజేపీ నేతలకు ఈ మాత్రం జ్ఞానం లేకపోవడం బాధాకరమని విమర్శించారు. ఇందిరాగాంధీ తీసుకొచ్చిన గరీబీ హఠావో.. రోటీ, కపడా, మకాన్ నినాదమూ భూటకమంటూ బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, ఆ పార్టీ నేతలు గ్రామాలకు వెళ్లి చూస్తే ఆనాడు పేదలకు ఇందరమ్మ ఇచ్చిన ఇళ్ల జాగాలు, ఇళ్లు ఇప్పటికీ కనిపిస్తాయని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 420 సీట్లు ఇవ్వాలని ప్రజలను మోదీ కోరితే.. 240 మాత్రమే ఇచ్చారని, పవన్ కల్యాణ్, టీడీపీ మద్దతు లేకుంటే ఆ పార్టీ ప్రభుత్వం ఎగిరి పోయి ఉండేదని అన్నారు. నెహ్రూ, ఇందిరల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు. ఇందిర, రాజీవ్‌గాంధీలు ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చారని, తమ ప్రాణాలకూ ఎక్కడి నుంచైనా ముప్పు రావచ్చని తెలిసినా.. ప్రజా సమస్యల కోసం వారి వద్దకు వెలుతున్న నాయకులు రాహుల్, ప్రియాంకలు అని జగ్గారెడ్డి కొనియాడారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

## ప్రభుత్వ వైద్యుడిపై తోటి వైద్యుల దాడి

- కోఠిలోని డీఎంఈ ఆఫీసు వద్ద శేఖర్ అనే వైద్యుడి ధర్నా
- ముగ్గురు వైద్యులు తనపై దాడి చేశారని ఫిర్యాదు
- శేఖర్‌పై వైద్యుల సంఘం నాయకులు కూడా..

మంగళ్‌హాట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బదిలీలను అడ్డుకునేందుకు తనపై ప్రభుత్వ వైద్యుల సంఘానికి చెందిన ముగ్గురు వైద్యులు దాడికి పాల్పడ్డారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కోఠీలోని డీఎంఈ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద శేఖర్ అనే డాక్టర్ ధర్నా నిర్వహించారు. సాధారణ వైద్యుల బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన జీవో మేరకు వ్యవహరించాలని డీఎంఈకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన తనపై వైద్యులు డాక్టర్ పల్లం ప్రవీణ్ కుమార్, బొంగు రమేశ్, రాథోడ్, వినోద్ కుమార్ దాడి చేశారని ఆరోపించారు. తనపై దాడి చేసిన వారిపై చట్టపరంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని శేఖర్ సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ముసుగులో నగరంలో కొందరు వైద్యులు తిష్ట వేశారని.. వాటిపై ప్రశ్నించినందుకు తనపై దాడి చేశారని పేర్కొన్నారు. బదిలీల ద్వారా తమకు అన్యాయం జరుగుతుందని భావించే ముగ్గురు వైద్యులు తమపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు శేఖర్ వెల్లడించారు. మరోవైపు డాక్టర్ శేఖర్‌పై తెలంగాణ వైద్యుల సంఘం నాయకులు, వైద్యులు బి.రమేశ్, లాలూ ప్రసాద్, వినోద్, పల్లం ప్రవీణ్, నరహరి, వసంత్, రజనీకాంత్, రంగాచారి సుల్తాన్‌బజార్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా శేఖర్ బెదిరింపులకు పాల్పడుతున్నారని.. పెట్రోల్ పోసి తగులబెడతానని డాక్టర్ శేఖర్‌తో పాటు ఆయన సోదరుడు బెదిరింపులకు పాల్పడుతున్నారని.. అతడి మానసిక స్థితి సరిగ్గా లేదని పేర్కొన్నారు.

## కవిత కస్టడీ 18 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యూడీషియల్ కస్టడీని ఈ నెల 18 వరకు రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. కస్టడీ గడువు ముగియడంతో తిహాడ్ జైలులో ఉన్న కవితను శుక్రవారం వర్చువల్ విధానంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కవిత కస్టడీని పొడిగించాలన్న సీబీఐ విజ్ఞప్తి మేరకు 18వ తేదీ వరకు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మద్యం కుంభకోణం కేసులో కవితను ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసింది.

## నీట్ సీట్ అలాట్‌మెంట్ బుక్‌లెట్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నీట్- 2024 ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన విద్యార్థుల అవగాహన కోసం నీట్-2023 సీట్ అలాట్‌మెంట్ బుక్‌లెట్‌ను సిద్ధం చేసినట్లు కోటా పేజెస్ సంస్థ తెలిపింది. అందులో ఎంబీబీఎస్, బీడీఎస్ రౌండ్-1, రౌండ్-2, మాప్ అప్ రౌండ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో ర్యాంకుల వారీగా, రిజర్వేషన్ల వారీగా సీట్ల కేటాయింపు వివరాలను పొందుపరిచామని వెల్లడించారు. ఈ డిజిటల్ బుక్‌లెట్‌ను పొందాలనుకునే వారు మరింత సమాచారం కోసం NEET Booklet అని 98490 16661 నంబరుకు వాట్సాప్ మెసేజ్ పంపాలని సూచించింది.

## ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసిన బాలుడు

ఇల్లెందు టౌన్, జూలై 5: ఆరేళ్ల బాలికపై ఓ బాలుడు అత్యాచారం చేసిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇల్లెందు మండలంలోని ఓ గ్రామంలో ఆరేళ్ల చిన్నారిపై రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ (17) అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని బాలికను బెదిరించాడు. భయపడిన బాలిక.. శుక్రవారం తల్లిదండ్రులకు తెలపడంతో, వారు ఇల్లెందు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యురాలిని సంప్రదించారు. వైద్యురాలి సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇల్లెందు పట్టణ పోలీసులు తెలిపారు.

# ఫార్మా రాజధానిగా హైదరాబాద్

### ఇక్కడి నుంచే నాణ్యమైన జనరిక్ ఔషధాలు.. ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడానికి తోడ్పాటు

- వచ్చే ఐదేళ్లలో లక్ష కోట్ల మేర ఎగుమతులు
- ఫార్మాసిస్టుల పాత్ర భేష్: డిప్యూటీ సీఎం
- ఫార్మా వర్సిటీ ఏర్పాటుకు ప్రణాళిక
- ఫార్మా జోన్లతో మరింత ఉపాధి: దుద్దిళ్ల
- గ్రామీణాభివృద్ధికి సహకరించాలి: కోమటిరెడ్డి
- హైటెక్స్‌లో ఐపీసీ ఎక్స్‌పో- 24 ప్రారంభం



హెచ్‌సీసీలో 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ ఎక్స్‌పోలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి

హైదరాబాద్‌సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): "హైదరాబాద్ అంటే బిర్యానీకి మాత్రమే కాదు.. బయో ఫార్మా పరిశ్రమకూ ప్రసిద్ధి చెందింది. బిర్యానీలో మసాలాలు ఎంత కీలకమో.. బయో ఫార్మా రంగంలో కొత్త ఆవిష్కరణలు అంతే కీలకం. పరిశ్రమలకు అనుకూలమైన రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందితే.. ఫార్మా రాజధానిగా హైదరాబాద్ ఖ్యాతి పొందింది. ఆరోగ్య సంరక్షణ రంగానికి ఫార్మాసిస్టులే వెన్నెముక. వారి నైపుణ్యంతో అనేక ఆరోగ్య సమస్యలకు పరిష్కారం అందిస్తున్నారు. భారతీయ ఫార్మా పరిశ్రమ అంతర్జాతీయంగా గుర్తింపు పొందడంలో వారి సహకారం మరువలేనిది" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమైన 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ ఎక్స్‌పో (ఐపీసీ ఎక్స్‌పో-2024)కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'రోల్ ఆఫ్ ఇండియన్ ఫార్మా ఫర్ గ్లోబల్ వెల్‌బీయింగ్' నేపథ్యంతో 3 రోజుల పాటు సదస్సు జరగనుండగా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫార్మా శాస్త్రవేత్తలు, ఫార్మసిస్టులు, విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌లో అత్యంత నాణ్యమైన జనరిక్ ఔషధాలు తయారవుతున్నాయని గుర్తు చేశారు. ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడానికి ఫార్మా పరిశ్రమ అందిస్తున్న తోడ్పాటు ప్రశంసనీయమన్నారు. ఇక్కడి శాస్త్రవేత్తలు, ఫార్మాసిస్టులు అవిశ్రాంతంగా కృషి చేయడం వల్లనే ఎన్నో వ్యాధులను దీటుగా ఎదుర్కోగలిగామన్నారు. దేశీయ అవసరాలతోపాటు అంతర్జాతీయ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తులను తీసుకురావడం అభినందనీయమన్నారు. దేశంలోని ఫార్మా ఎగుమతుల్లో 35% తెలంగాణ నుంచి ఉంటున్నాయన్నారు. వచ్చే ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయల ఎగుమతులు ఇక్కడ నుంచి జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి అవసరమైన ఔషధాలను ఇక్కడి పరిశ్రమలు తయారు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఫార్మా రంగానికి ఎల్లప్పుడూ ప్రభుత్వ తోడ్పాటు ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణలో 9 నుంచి 10 ఫార్మా జోన్లు ఏర్పాటు చేయడం ద్వారా మరింత మందికి ఉపాధి కల్పించనున్నామన్నారు. ఫార్మా పరిశ్రమకు అవసరమైన సదుపాయాలూ వీటిలో ఉంటాయన్నారు. ఫార్మా రంగంలో ఏఐ వినియోగంతో అద్భుతాలు సాధించే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌లో ఏఐ సిటీ కోసం 200 ఎకరాలు కేటాయించామన్నారు. త్వరలోనే స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు కానుందని, ఐఎస్‌బీ తరహాలో దీనిని నిర్వహించనున్నారన్నారు. అంతర్జాతీయ లైఫ్‌సైన్సెస్ రంగంలో ఎదిగేందుకు వీలుగా యువ తరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ఫార్మా యూనివర్శిటీ ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక కొనసాగుతుందని, త్వరలోనే కార్యరూపం దాల్చుతుందని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఐటీ రంగానికి పునాది వేసింది కాంగ్రెస్సేనని పేర్కొన్నారు. ఓఆర్ఆర్‌కు సమాంతరంగా 30వేల కోట్లతో ఆర్ఆర్ఆర్ ప్రారంభించబోతున్నామన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి ఇది మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిందిగా ఫార్మా పరిశ్రమను కోరుతున్నామన్నారు. ఐపీసీఏ అధ్యక్షుడు పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సవాళ్లకు వినూత్న పరిష్కారాలను ఎక్స్‌పో అందిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో శాస్త్రీయ ఆవిష్కరణలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. వచ్చే ఐదేళ్లలో ఈ రంగంలో 12% వృద్ధి నమోదవుతుందని తెలిపారు. ఐపీసీఏ జనరల్ సెక్రటరీ టీవీ నారాయణ మాట్లాడుతూ కొవిడ్ సమయంలో 12లక్షల మందిపైగా ఫార్మసిస్టులు రాత్రి, పగలు పని చేశారని గుర్తు చేశారు. ఫార్మసీ రంగంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫార్మా వర్శిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అనంతరం ఫార్మా రంగానికి తోడ్పాటు అందించిన వారికి అవార్డులు అందజేశారు. ఫార్మా రంగంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ఏర్పాటు చేసిన ప్లేస్‌మెంట్ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది.

## మూడు నాలుగు వారాల్లో నూతన పారిశ్రామిక విధానం

- త్వరలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రగతిలో తెలంగాణను అగ్రస్థానంలో నిలబెట్టడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇందుకోసం మరో మూడు, నాలుగు వారాల్లో నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటిస్తామని చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పారిశ్రామిక విధానం ఉంటుందని తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఎక్సలెన్స్ అవార్డు ప్రదానోత్సవానికి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 21 విభాగాల్లో ఎంపిక చేసిన ఉత్తమ పారిశ్రామికవేత్తలకు అవార్డులను ప్రదానం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలకు కావాల్సిన వసతులు ఉన్నాయని మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే పరిశ్రమలకు అవసరమైన నిపుణులను అందించాలనే లక్ష్యంతో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పారిశ్రామిక రంగ నిపుణుల సహాయ సహకారాలతో వర్సిటీ విధివిధానాలు రూపొందిస్తామని చెప్పారు. వృత్తి నైపుణ్యం కలిగిన వారికి తెలంగాణను కేంద్రంగా చేస్తామని అన్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు, రాయితీల కింద బకాయి ఉన్న రూ.3700 కోట్ల చెల్లింపులపై ప్రభుత్వం ఆలోచన చేస్తుందని ప్రకటించారు. గత తొమ్మిదేళ్లలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన మధ్య, చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అంతకముందు ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలాజయదేవ్ మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్ పేరుతో భారీ మొత్తంలో పెంచిన ఫీజులను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డుల కమిటీ చైర్మన్ కరుణేంద్ర ఎస్.జాస్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాణాలను పట్టించుకోలేదు

- ఐఎస్ కోడ్‌ను పక్కనపెట్టారు
- గేట్ల నిర్వహణపై కమిటీ వేయలేదు
- దీనివల్లే మేడిగడ్డ కుంగిపోయింది
- జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలతోనే కారణాలేమిటో తెలుస్తాయి
- జస్టిస్ పీసీ ఘోష్‌కు నిపుణుల అఫిడవిట్

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బ్యారేజీల నిర్మాణంలో ప్రమాణాలకు ఉద్దేశించిన భారతీయ ప్రమాణాల సంస్థ (ఇండియన్ స్టాండర్డ్) కోడ్-7349ను కాళేశ్వరం నిర్మాణంలో పాటించలేదని, నిర్వహణకు ఉద్దేశించిన క్లాజులను కూడా అమలు కాలేదని సంబంధిత నిపుణులు గుర్తించారు. ఈ మేరకు జస్టిస్ పినాకి చంద్రఘోష్‌కు అఫిడవిట్ల రూపంలో ఫిర్యాదు చేశారు. ఆ వివరాలు.. 2016లో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం ప్రారంభం కాగా... 2019 జూన్‌లో పనులు పూర్తయ్యాయి. 2019 తొలి వరదల అనంతరం మూడు బ్యారేజీ గేట్లను దించిన సమయంలో సీసీ బ్లాకులు చెల్లాచెదరయ్యాయి. ఐఎస్ కోడ్‌లోని క్లాజు 5.1 ప్రకారం, వరదల అనంతరం నవంబరులో గేట్లన్నీ ఎత్తి బ్యారేజీని ఖాళీ చేసి, బ్యారేజీ ఏమైనా దెబ్బతిన్నదా అని సమగ్ర పరిశీలన చేయాల్సి ఉంది. కానీ, ఆ పని చేయలేదు. క్లాజు 5.3 ప్రకారం అప్‌స్ట్రీమ్ (ఎగువభాగం)తో పాటు దిగువభాగంలోని అప్రాన్లు ఏ విధంగా ఉన్నాయో గుర్తించాల్సి ఉండగా ఆ పని కూడా జరగలేదు. గేట్ల నిర్వహణకు సంబంధించి కూడా ఒక కమిటీ వేయాల్సి ఉండగా... అదీ కార్యరూపం దాల్చలేదు. అన్ని గేట్లు ఒకేసారి కాకుండా ఒక్కో గేటును ఎత్తడం వల్ల నీటి ఒత్తిడి పడి డౌన్‌స్ట్రీమ్‌లో సీసీ బ్లాకులు చెల్లాచెదురు కావడం, అప్రాన్ దెబ్బతినడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. బ్యారేజీకి ఎగువతోపాటు దిగువ భాగంలో వరద సజావుగా ప్రవహించేలా ఏర్పాట్లు చేయలేదు. ఫలితంగా ఆ వరద కూడా బ్యారేజీని దెబ్బతీసింది. ఐఎస్ ప్రమాణాల ఆధారంగా పనులు జరుగకపోవడంతో క్రమంగా బ్యారేజీలు దెబ్బతింటూ... 2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుంగింది. బ్యారేజీల నిర్వహణ వైఫల్యంతో సీకెంట్ పైల్స్ దెబ్బతిని...ఇసుకంతా బ్యారేజీ పునాదుల నుంచి జారి అన్నారం, సుందిళ్లలో సీపేజీలు ఏర్పడి మేడిగడ్డ కుంగిపోయింది. బ్యారేజీల వైఫల్యాలకు కారణాలన్నీ బయటపడాలంటే జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలు జరగాలి. కాగా, బ్యారేజీ నిర్మాణంలో ఉండగానే దెబ్బతిన్నదని, దీనికి నిర్మాణలోపంతో పాటు డిజైన్ లోపం కూడా ఒక కారణమని మరికొందరు నిపుణులు కమిషన్‌కు గుర్తు చేశారు. 2019 నవంబరులోనే సీసీ బ్లాకులు దెబ్బతిన్న తర్వాత నిర్మాణ సంస్థ అప్పటి అధికారులకు లేఖ రాసి సరైన డిజైన్ ఇస్తే, మరమ్మతులు చేస్తామని చెప్పినా కూడా.. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) ఎలాంటి డిజైన్ ఇవ్వలేదని ఆక్షేపించారు.

### త్వరలో నోటీసులు

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో భాగంగా శుక్రవారం జస్టిస్ పీసీ ఘోష్ హైదరాబాద్‌కు చేరుకున్నారు. నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. దాదాపు 10 రోజుల పాటు ఆయన హైదరాబాద్‌లోనే మకాం వేయనున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరుపుతున్న ఆయన.. కమిషన్‌కు చేరిన అఫిడవిట్లను పరిశీలించి, ఎవరెవరికి నోటీసులు ఇవ్వాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.




Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

# ఆంధ్రజ్యోతి
# దిక్సూచి

హైదరాబాద్ ● శనివారం 6 జూలై 2024

diksuchi@andhrajyothy.com



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'టీజీ ఈఏపీ సెట్ 2024 (ఎంపీసీ స్ట్రీమ్) కౌన్సెలింగ్' ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కౌన్సెలింగ్ ద్వారా బీఈ/బీటెక్/ఫార్మసీ కోర్సుల్లో అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులు టీజీ ఈఏపీ సెట్ 2024లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్స్ ప్రక్రియలు ఉంటాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కౌన్సెలింగ్ ప్రక్రియను మూడు విడతల్లో నిర్వహిస్తారు. చివరలో స్పాట్ అడ్మిషన్స్ ఉంటాయి.

## తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్

**అర్హత:** అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ టీజీ ఈఏపీ సెట్ 2024(ఎంపీసీ స్ట్రీమ్) అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు 16 ఏళ్లు; ఫార్మాడీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) కోర్సుకు 17 ఏళ్లు నిండి ఉండాలి. స్కాలర్‌షిప్ పొందాలంటే 2024 జూలై 1 నాటికి జనరల్ అభ్యర్థులకు 25 ఏళ్లు, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు 29 ఏళ్లు మించకూడదు.

**స్లాట్ బుకింగ్:** వెబ్‌సైట్ ఓపెన్ చేసి 'పేమెంట్ ఆఫ్ ప్రాసెసింగ్ ఫీ' లింక్‌పై క్లిక్ చేయాలి. టీజీ ఈఏపీసెట్ 2024 హాల్‌టికెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, ఇంటర్ హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేయాలి. తరవాత ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీ తదితర సమాచారం ఎంటర్ చేయాలి. ప్రాసెసింగ్ ఫీజు కింద జనరల్, బీసీ అభ్యర్థులు రూ.1200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చెల్లించాలి. తరవాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం దగ్గరలోని హెల్ప్ లైన్ సెంటర్, డేట్, టైమ్ సెలెక్ట్ చేసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా 36 హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.

- దివ్యాంగులు, ఎన్‌సీసీ అభ్యర్థులు, క్రీడాకారులు, సీఏపీ అభ్యర్థులు, ఆంగ్లో ఇండియన్ వంటి స్పెషల్ కేటగిరీ అభ్యర్థులు మాత్రం హైదరాబాద్-మాసబ్‌ట్యాంక్ వద్దగల గవర్నమెంట్ పాలిటెక్నిక్ సెంటర్‌ను ఎంచుకోవాలి. ఈ కేటగిరీలకు నిర్దేశించిన తేదీల ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది.
- క్రీడాకారులు, సీఏపీ అభ్యర్థులకు జూలై 6 నుంచి 8 వరకు; ఎన్‌సీసీ అభ్యర్థులకు జూలై 9 నుంచి 12 వరకు; దివ్యాంగులు, ఆంగ్లో ఇండియన్ అభ్యర్థులకు జూలై 13న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

**సర్టిఫికెట్ వెరిఫికేషన్:** హెల్ప్‌లైన్ సెంటర్‌కు వెళ్లే అభ్యర్థులు తమ వెంట టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ కార్డ్, హాల్ టికెట్; ఆధార్ కార్డ్; పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ మెమో-పాస్ సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ; 2024 జనవరి 1న గానీ ఆ తరవాత గానీ తీసిన ఇన్‌కం సర్టిఫికెట్; వ్యాలిడ్ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్; కులం, స్థానికత, వైకల్యం, ఎన్‌సీసీ, క్రీడలు తదితర ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకెళ్లాలి.

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తరవాత అధికారులు ఇచ్చిన ఆర్‌ఓసీని చెక్ చేసుకోవాలి. తరవాత అభ్యర్థుల మొబైల్‌కు లాగిన్ ఐడీ పంపుతారు. ఈ ఐడీ వచ్చిన తరవాతనే హెల్ప్‌లైన్ సెంటర్ నుంచి బయటకు రావాలి. దీని ద్వారా అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చు.

### ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 నుంచి 23 వరకు

### సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 26
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 27
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 27 నుంచి 28 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 28
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 31
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు

### ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** ఆగస్టు 8
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** ఆగస్టు 9
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 9 నుంచి 10 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** ఆగస్టు 10
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 13
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 13 నుంచి 15 వరకు

### సెంట్రలైజ్డ్ ఇంటర్నల్ స్లయిడింగ్ షెడ్యూల్

- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **ఫ్రీజింగ్ ఆప్షన్స్:** ఆగస్టు 22
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 26
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 27 నుంచి 28 వరకు
- **స్పాట్ అడ్మిషన్స్ గైడ్‌లైన్స్ విడుదల:** ఆగస్టు 28

**వెబ్‌సైట్:** tgeapcet.nic.in



ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్)2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ కోర్సును కూడా అందిస్తున్నారు. దీని వ్యవధి ఏడాది. ఈ కోర్సులో ప్రవేశానికి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. కోర్సులు పూర్తయ్యే నాటికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు.

## ఐఐపీలో ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లు

**సీట్లు**

- **పీజీ డిప్లొమా:** ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు, అహ్మదాబాద్ క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.
- **ఎంఎస్:** హైదరాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.
- **సీపీఈ:** చెన్నై క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.

**పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్:** ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రికల్ టెక్నాలజీ, అప్లయిడ్ మెకానిక్స్, మెకానికల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిజం, ప్రిన్సిపల్స్ ఆఫ్ ప్యాకేజింగ్, పేపర్ అండ్ పేపర్ బోర్డ్, గ్లాస్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్, పాలిమర్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ మెషినరీ, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్, ప్రింటింగ్ టెక్నాలజీ, ప్రొడక్షన్/ఫైనాన్షియల్/మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ప్యాకేజింగ్ మెషినరీ, ప్యాకేజింగ్ లాస్, టూలింగ్ అండ్ డిజైన్, ప్యాకేజింగ్ డిజైన్స్, అప్లికేషన్ ఆఫ్ కంప్యూటర్స్, ఆటోక్యాడ్ తదితర సబ్జెక్టుల్లో తరగతులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రాక్టికల్ సెషన్స్, రీసెర్చ్ యాక్టివిటీస్, ఇండస్ట్రియల్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు, కమ్యూనికేషన్ స్కిల్స్ సంబంధిత శిక్షణ ఉంటాయి.

**ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ:** ఈ ప్రోగ్రామ్‌నకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) గుర్తింపు ఉంది. ఇందులో ప్యాకేజింగ్ మెటీరియల్స్, ప్యాకేజ్ డెవలప్‌మెంట్, ప్యాకేజ్ ప్రింటింగ్ టెక్నాలజీ, మెటీరియల్ టెస్టింగ్, ప్యాకేజ్ ఫినిషింగ్ ఆపరేషన్స్, ప్యాకేజింగ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్ అండ్ మెడికల్ డివైజ్ ప్యాకేజింగ్, ఇండస్ట్రియల్ ప్రొడక్ట్ ప్యాకేజింగ్, ప్యాకేజింగ్ లాస్ అండ్ రెగ్యులేషన్స్, ప్యాకేజింగ్ మెషినరీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్-మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ డిజైన్ తదితర అంశాలు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ సెషన్స్, ఇండివిడ్యువల్ ప్రాజెక్ట్ వర్క్‌లు, కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ రిపోర్ట్ రైటింగ్ ట్రెయినింగ్, అయిదు నెలల ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

**సీపీఈ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ:** ఈ ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో మూడు సెమిస్టర్లు ఉంటాయి. వీటిలో ప్యాకేజింగ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ స్టడీస్ సంబంధిత సెషన్స్ నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ అండ్ రిపోర్ట్, డిజర్టేషన్, ప్రజంటేషన్ తదితరాలు ఉంటాయి.

**అర్హత:** పీజీడీపీ ప్రోగ్రామ్‌నకు గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/మైక్రోబయాలజీ/బయో కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అగ్రికల్చర్/ఫుడ్ సైన్స్/పాలిమర్ సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ అభ్యర్థులు కూడా అర్హులే. ఎంఎస్ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్/నాలుగేళ్ల డిగ్రీ ఇన్ ఇంటిగ్రేటెడ్ సైన్సెస్ ఉత్తీర్ణులై ఉండాలి. సీపీఈ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్, పార్ట్ టైం డిగ్రీలు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. పీజీడీపీ, ఎంఎస్ ప్రోగ్రామ్‌లకు అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. సీపీఈ ప్రోగ్రామ్‌నకు వయోపరిమితి నిబంధనలు లేవు.

**ఐఐపీ సెట్ 2024:** ఇది ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

**ఎంపిక:** సంస్థ నిర్ణయించిన ప్రకారం కటాఫ్ మార్కులు సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదోతరగతి మార్కులకు 10 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 10 శాతం, డిగ్రీ మార్కులకు 30 శాతం, రాత పరీక్ష స్కోరుకు 30 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 10
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూలై 14
- **ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 16
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూలై 18, 19
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 22
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 29
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** www.iip-in.com

## ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

**ప్రోగ్రామ్‌లు-సీట్లు:** బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

**దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

## ఏఐఏఎస్ఎల్‌లో కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌లు

మొత్తం ఖాళీలు 1049

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్... ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన మూడేళ్ల కాలపరిమితికిగాను ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: **343 పోస్టులు**
2. కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: **706 పోస్టులు**

**అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 33 ఏళ్లు, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు

**జీతం:** నెలకు సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.28,605. కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.27,450.

**దరఖాస్తు రుసుము:** రూ.500. ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మన్ అభ్యర్థుల ఫీజు చెల్లింపు మినహాయింపు ఉంటుంది.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ గూగుల్ ఫాం ద్వారా

**దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 14

**వెబ్‌సైట్:** https://www.aiasl.in/Recruitment

## ఐఐసీటీ హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ పోస్టులు

మొత్తం ఖాళీలు 23

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. రీసెర్చ్ అసోసియేట్-1: **1 పోస్టు**
2. సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: **3 పోస్టులు**
3. రీసెర్చ్ అసోసియేట్: **1 పోస్టు**
4. జూనియర్ రీసెర్చ్ ఫెలో/ప్రాజెక్ట్ అసోసియేట్-1: **1 పోస్టు**
5. ప్రాజెక్ట్ అసోసియేట్-2: **3 పోస్టులు**
6. ప్రాజెక్ట్ అసోసియేట్-1, 2: **1 పోస్టు**
7. ప్రాజెక్ట్ అసోసియేట్-1: **11 పోస్టులు**
8. ప్రాజెక్ట్ అసిస్టెంట్: **1 పోస్టు**
9. సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్: **1 పోస్టు**

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్ స్కోర్, పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** రీసెర్చ్ అసోసియేట్, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు 40 ఏళ్లు, ప్రాజెక్ట్ అసిస్టెంట్, సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ పోస్టులకు 50 ఏళ్లు, ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.




**ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

**ఇంటర్వ్యూ తేదీ:** జూలై 16

**వేదిక:** సీఎస్ఐఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, హైదరాబాద్.

**వెబ్‌సైట్:** https://www.iict.res.in/


# లిటిల్స్




## గడ్డంలో గడ్డిపరక


మహేంద్రుడనే రాజు దగ్గర ఆనందుడనే తెలివైన మంత్రి ఉండేవాడు. అతరు ఎన్నో సమస్యలకు సులువుగా చిటికెలో పరిష్కారాలు చెప్పేవాడు. ఒకరోజు మహారాజుకు ఇష్టమైన రత్నాలహారం కనిపించకుండా పోయింది. దాన్ని ఎవరు దొంగిలించినా కఠిన శిక్ష తప్పదు అనుకున్నారు అంతా. రాజుగారి కొలువులో పనిచేసే అందరు పనివారిని ఒకరోజు ఒకే దగ్గరకు పిలిచాడు మంత్రి, రాజుగారి నగల పెట్టె లోకి చూసి, మహారాజా.. మీ నగ ఎవరు దొంగిలించారో నాకు మీ నగల పెట్టె ఆనవాలు చెప్పింది. మీ నగ తీసుకున్న వ్యక్తి గడ్డంలో ఒక గడ్డి పరక ఉంటుందని నగల పెట్టె అంటోంది అన్నాడు గట్టిగా. అక్కడ ఉన్నర పనివారిలో ఒకడు తన గడ్డం పదేపదే తడుముకుని కంగారు పడటం గమనించిన మంత్రి మహారాజా ఇదిగో మీ హారం తీసుకున్న దొంగ అన్నాడు. ఆ పనివాడు బెదిరిపోయి, తప్పు ఒప్పుకుని, దొంగిలించిన నగను తెచ్చి రాజుకు ఇచ్చేశాడు. అందరూ మంత్రి సమయ స్ఫూర్తిని, తెలివి తేటలని మెచ్చుకున్నారు.

### దారి కనుక్కోండి



### 6 తేడాలు గుర్తించండి!






### సరైన నీడ ఏది?




### డైలీ సుడోకు - 351

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | | 5 | | 2 | 1 | | | |
| 9 | | | 8 | | | | | |
| | 1 | | 7 | | | 8 | | |
| | | | | 7 | 5 | | 8 | 6 |
| | | | | | | | | |
| 7 | 5 | | 9 | 4 | | | | |
| | | 4 | | | 6 | | 7 | |
| | | | | | 7 | | | 5 |
| | | | 5 | 3 | | 2 | | 1 |

**సుడోకు - 350 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 9 | 5 | 1 | 6 | 4 | 2 | 7 | 3 |
| 3 | 4 | 2 | 7 | 8 | 9 | 6 | 1 | 5 |
| 1 | 7 | 6 | 2 | 5 | 3 | 4 | 9 | 8 |
| 5 | 6 | 3 | 4 | 9 | 7 | 1 | 8 | 2 |
| 9 | 8 | 4 | 5 | 2 | 1 | 7 | 3 | 6 |
| 7 | 2 | 1 | 6 | 3 | 8 | 9 | 5 | 4 |
| 2 | 1 | 8 | 9 | 4 | 5 | 3 | 6 | 7 |
| 4 | 3 | 7 | 8 | 1 | 6 | 5 | 2 | 9 |
| 6 | 5 | 9 | 3 | 7 | 2 | 8 | 4 | 1 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.